బండి సంజయ్ పీఎస్‌గా ఆంధ్ర వంశీ

- కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- డైనమిక్ ఆఫీసర్‌గా ఆంధ్ర వంశీకి గుర్తింపు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)



హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రైవేట్ సెక్రటరీగా (పీఎస్) ఐఏఎస్ అధికారి ఆంధ్ర వంశీ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంజయ్‌కు వంశీ ఐదేండ్లపాటు పీఎస్‌గా కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో వెల్లడించింది. కాగా, ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు చెందిన ఆంధ్ర వంశీ 2011లో యూపీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఐఏఎస్ అయ్యారు. ఉత్తరప్రదేశ్ బస్తీ జిల్లాలోని వందలాది గ్రామాల్లో దాదాపు 30 ఏండ్లుగా పరిష్కారంకాని 50 వేల ఫిర్యాదులను కేవలం నాలుగు నెలల్లోనే పరిష్కరించారు. అలా ఉద్యోగంలో చేరిన అతి తక్కువ కాలంలోనే సమర్థవంతమైన, డైనమిక్ ఆఫీసర్‌గా ఆయన పేరు తెచ్చుకున్నారు. యూపీలోని మథుర, ప్రయాగ్‌రాజ్, ఝాన్సీ, ఫిలిబిత్, షాజహాన్‌పూర్ తదితర జిల్లాల్లో కలెక్టర్‌గా పనిచేశారు. 2006లో హైదరాబాద్ జేఎన్టీయూ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో వంశీ బీఏ పూర్తి చేశారు. ఆ తర్వాత కొంతకాలం యాక్సెంచర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశారు. 2008లో ఆదాయపు పన్ను శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగం సాధించారు. తర్వాత సివిల్స్‌కు ప్రిపేరయ్యారు. 2011లో ఐఏఎస్ అధికారిగా నియమితులయ్యారు.

నేటినుంచి మూడు రోజులు గవర్నర్ పర్యటన


యాదాద్రి, ములుగు, భూపాలపల్లి జిల్లాల టూర్



ములుగు, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ)/భువనగిరి కలెక్టరేట్/యాదగిరిగుట్ట: గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మంగళ, బుధ, గురువారాల్లో పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు రోడ్డు మార్గాన యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి ఉదయం 11.30 గంటలకు ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో 25 మంది జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు పొందిన రచయితలు, కళాకారులతో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి చేరుకొని పూజలు నిర్వహించిన అనంతరం సరస్సును సందర్శించనున్నారు. అక్కడి నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలోని కోటగుళ్లను సందర్శించి పూజలు చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుస్సాపురంలోని లక్నవరం సరస్సు వద్దకు చేరుకొని హరిత రిసార్ట్‌లో ఇతర అధికారులతో కలిసి రాత్రి బస చేయనున్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు లక్నవరం నుంచి హనుమకొండ జిల్లా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 29న మధ్యాహ్నం 2.20 గంటలకు ఆలేరు మండలంలోని కొలనుపాక జైన దేవాలయాన్ని, సోమేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు భువనగిరి పట్టణ పరిధిలోని స్వర్ణగిరి ఆలయాన్ని సందర్శిస్తారు. సాయంత్రం 5.15 గంటలకు భువనగిరి కలెక్టరేట్‌లో రచయితలు, కళాకారులు, ప్రముఖులు, రాష్ట్ర జాతీయ అవార్డు గ్రహీతలను కలుస్తారు.

అత్యవసర నిర్ణయాల్లోనూ నాన్చుడే

- సమయం మించిపోతున్నా పట్టని ప్రభుత్వం
- పీకల మీదికి వచ్చాక హడావుడి ప్రకటనలు
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు



హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం పలు అంశాల్లో వేగంగా నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమవుతున్నది. సమయం మించిపోతున్నా పట్టించుకోవడం లేదు. కొన్ని విషయాల్లో పీకల మీదికి వచ్చాక హడావుడి నిర్ణయాలు తీసుకుంటున్నది. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందుకు ఇటీవలి స్థానికత అంశమే ప్రత్యక్ష ఉదాహరణ. ఇదే కాదని, ఇలాంటివి ఎన్నో ఉన్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు.

జనవరి నుంచే చెప్తున్నా..

ఉమ్మడి కోటా పూర్తవుతున్న నేపథ్యంలో విద్యాసంస్థల్లో ప్రవేశాల స్థానికతపై నిర్ణయం తీసుకోవాలని ఈ ఏడాది జనవరి నుంచే ప్రభుత్వానికి వివిధ రూపాల్లో వినతులు అందాయి. అయినా పట్టించుకోలేదు. చివరికి జూలైలో హడావుడిగా నిర్ణయం తీసుకున్నది. ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ల నోటిఫికేషన్‌తోపాటు జీవో 33ని విడుల చేసింది. దీంతో వివాదం చెలరేగింది. ప్రభుత్వం ముందు నుంచే దృష్టిపెడితే ఈ సమస్య వచ్చేది కాదని నిపుణులు పేర్కొంటున్నారు.

కేసీఆర్ కిట్ ఉన్నట్టా? లేనట్టా?

మాతాశిశు సంరక్షణ కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్ ప్రవేశపెట్టి రూ.15వేల ఆర్థికసాయం అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పథకం పేరును తీసేసింది. ప్రస్తుతం తాత్కాలికంగా ఎంసీహెచ్ కిట్‌గా పిలుస్తున్నారు. గతంలో సొంతంగా రాష్ట్ర ప్రభుత్వమే ఖర్చు చేయగా, ఇప్పుడు 'ప్రధానమంత్రి మాతృవందన యోజన'ను కలిపి అమలుచేయాలని, కొత్త పేరు పెట్టాలని భావిస్తున్నది. ఈ విషయమై ఇప్పటికీ తుది నిర్ణయం తీసుకోలేదు.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఏవీ?

ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద వందలాది మంది విద్యార్థులు విదేశాల్లో విద్యనభ్యసిస్తున్నారు. అయితే ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో వారు ఫీజులు కట్టలేక సతమతమవుతున్నారు. కొందరు అప్పు చేసి ఫీజులు కట్టుకుంటున్నారు. మరికొందరు చదువు మధ్యలోనే ఆపేసే పరిస్థితి నెలకొన్నది.

ఆలస్యంగా చేపపిల్లల టెండర్లు

ఉచిత చేపపిల్లల పంపిణీ పథకానికి సాధారణంగా ఏప్రిల్‌లో టెండర్లు పిలిచి ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం జూలైలో ఈ ప్రక్రియ ప్రారంభించింది. వానలు మొదలయ్యాక టెండర్లు పిలిచింది. కొన్ని జిల్లాల్లో ఇప్పటికీ టెండర్లు పూర్తికాలేదు.

పెంచిన మెస్‌చార్జీలు అమలెప్పుడు?

సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను 25శాతం మేరకు పెంచాలని చేసిన ప్రతిపాదనలు ప్రభుత్వం వద్దే పెండింగ్ ఉన్నాయి. పెరిగిన ధరలతో కాంట్రాక్టర్లు నాసిరకం సరుకులు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో తరుచూ ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని చెబుతున్నారు.

గురుకుల అభ్యర్థులపై నిర్ణయం ఎప్పుడు?

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో 8,708 పోస్టులకు ట్రిబ్ నియామక ప్రక్రియ చేపట్టింది. 1:2 పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేసింది. అయితే ట్రిబ్ డిసెండింగ్ ఆర్డర్‌ను పాటించకపోవడం, ఇష్టారాజ్యంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టడంతో భారీగా బ్యాక్‌లాగ్‌లు ఏర్పడుతున్నాయని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డౌన్‌మెరిట్ అమలుచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

డీఎస్సీ–2008 బాధితులకు ఉద్యోగాలేవీ?

డీఎస్సీ–2008 బాధితులకు ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ ఈ ఏడాది ఫిబ్రవరి 24న నిర్ణయించింది. ఏపీ తరహాలో ఎంటీఎస్ పద్ధతిలో నియామకాలు చేపడుతామని చెప్పింది. విధివిధానాల ఖరారు బాధ్యత జీవో 317 క్యాబినెట్ సబ్ కమిటీకి అప్పగించింది. ఆరు నెలలు గడుస్తున్నా సబ్ కమిటీ నిర్ణయం తీసుకోలేదు. ఈ నెల 27లోగా పూర్తి చేస్తామని న్యాయస్థానానికి ప్రభుత్వం హామీ ఇచ్చింది.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	35.4°c	24.0°c
నిజామాబాద్	32.3°c	23.5°c
రంగారెడ్డి	32.2°c	21.6°c
కరీంనగర్	32.0°c	24.0°c
వరంగల్	32.0°c	24.0°c
ఖమ్మం	32.0°c	24.0°c
నల్లగొండ	32.0°c	23.2°c
హైదరాబాద్	31.0°c	23.8°c
మెదక్	30.3°c	23.0°c
మహబూబ్‌నగర్	29.2°c	22.5°c

రాష్ట్రవ్యాప్తంగా 31 వరకు వర్షాలు

- 29, 30 తేదీల్లో పలుచోట్ల భారీ వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసినట్టు అధికారులు తెలిపారు. 27న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. 28న ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో వానలు కురుస్తాయని పేర్కొంది. 29, 30 తేదీల్లో పలుచోట్ల భారీ వర్షాలకు తోడు ఈదురు గాలులు వీస్తాయని, పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురిస్తే స్కూళ్లకు సెలవులు ఇవ్వటానికి అధికారులు సిద్ధమయ్యారు. గడిచిన 24 గంటల్లో ములుగు, వరంగల్, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. ములుగుజిల్లా కన్నాయిగూడెంలో 4.36 సెం.మీ వర్షంపాతం నమోదైంది.

పొంగులేటి కంపెనీకి 4,495 కోట్ల పనులు

మొదటిపేజీ తరువాయి...

రూ.60.82 కోట్లు, ఈపీడీసీఎల్ నుంచి రూ.75.54 కోట్ల మేర బిల్లులు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి కొన్ని రోజులుగా వివాదాలు నడుస్తున్నాయి. టెండర్లు దక్కించుకోవడమే తప్ప పనులు చేపట్టలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు ఇటీవల ఏపీ ప్రభుత్వం రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు నోటీసులు జారీచేసింది. విశాఖపట్నంతోపాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో భూగర్భంలో విద్యుత్తు లైన్లు వేసే కాంట్రాక్టును దక్కించుకొని ఏడాది గడిచినా పనులు ఎందుకు మొదలు పెట్టలేదని ఈ ఏడాది జూలైలో ప్రభుత్వం నోటీసులు ఇచ్చింది. 2022లో పనులు అప్పగించినా ఇంకా ప్రారంభించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే మొదలుపెట్టకుంటే చర్యలు తప్పవని హెచ్చరించింది. దీనికితోడు ఎగ్జింబ్యాంకు నుంచి గ్యారెంటీ పొందడంపై తాజా వివాదం మొదలైంది. నెల్లూరు జిల్లాతోపాటు పలు ప్రాంతాల్లో ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌కు సంబంధించిన రూ.800 కోట్ల పనులకు వెస్టిండీస్‌కు చెందిన ఎగ్జింబ్యాంకు నుంచి రూ. 80 కోట్ల బ్యాంకు గ్యారెంటీ సమర్పించారు. దేశంలోనే ఒక్క శాఖ కూడా లేని బ్యాంకు నుంచి గ్యారెంటీ ఎలా తెస్తారన్న చర్చ సోషల్ మీడియాలో మొదలైంది. ఎగ్జింబ్యాంకు పూర్వాపరాలను వెలికి తీస్తున్నారు. దేశంలో ఈ బ్యాంకుకు ఒక్క లావాదేవీ కూడా లేకపోవడం అందరినీ నివ్వెరపరుస్తున్నది. సాధారణంగా బ్యాంకులు ప్రతి ఏటా తమ లాభనష్టాలను ప్రకటిస్తుంటాయి. కానీ, ఈ బ్యాంకు వివరాలు ఎక్కడా లేవు. 2021 ఏప్రిల్ నాటికి తమ సంస్థ విలువ 227 మిలియన్ డాలర్లు అని ఒకసారి, మరోసారి 230 మిలియన్ డాలర్లు అని బ్యాంకు ప్రకటించడంపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎగ్జింబ్యాంకు ఏపీలో మొత్తం 31 ప్రాజెక్టులకు గ్యారెంటీ ఇచ్చిందని, వీటి విలువ రూ.481 కోట్లని చెప్తున్నారు.

ఒక్కడినీ గెలవనియ్య

- ఆ మంత్రిని పాతర పెట్టకపోతే నా పేరు తీన్మార్ మల్లన్నే కాదు
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, ఆగస్టు 26(నమస్తే తెలంగాణ): 'వాళ్లంతా కలిసి మూకుమ్మడిగా నన్ను ఓడించేందుకు కుట్ర చేశారు. మీరు రాసిపెట్టుకోండి.. మిత్తి, అసలు, చక్రవడ్డీ కలిపి వచ్చే ఎన్నికల్లో ఒక్కడు కూడా గెలవకుండా పాతరపెట్టకపోతే నా పేరు తీన్మార్ మల్లన్నే కాదు' ఇవీ ఆదివారం కాజీపేటలో జరిగిన ఒక సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన సంచలన వ్యాఖ్యలు. ఆయన ఈ వ్యాఖ్యలు ఏ మంత్రిని ఉద్దేశించి చేశారనే చర్చ జోరుగా జరుగుతున్నది. ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ సమయంలో విదేశాల్లో ఉన్న ఒక మంత్రి ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్(కలెక్టర్)కు ఫోన్ చేసి తాను ఓడిపోయే అవకాశం ఏమైనా ఉన్నదా? అని ఆరా తీశారని మల్లన్న చెప్పారు. తనను ఓడించేందుకు కుట్ర చేసిన వాళ్లలో ఒక్కడిని కూడా వచ్చే ఎన్నికల్లో గెలవనివ్వనని, అలా చేయకపోతే తన పేరు తీన్మార్ మల్లన్నే కాదని శపథం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో మంత్రి కోమటిరెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లడంపై అప్పట్లోనే రకరకాల చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు మల్లన్న వ్యాఖ్యలు కోమటిరెడ్డిని ఉద్దేశించినవనే ప్రచారం జోరందుకుంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయకపోతే భూకంపం సృష్టిస్తా.. రాసిపెట్టుకోరి ప్రభుత్వాన్ని మల్లన్న హెచ్చరించడం గమనార్హం.

మాలలకు అన్యాయం జరగకుండా చూడండి

సీఎంకు మాల సామాజికవర్గ ప్రతినిధుల విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మాల సామాజిక వర్గం నేతలు కోరారు. సోమవారం సచివాలయంలో ఎంపీ గడ్డం వంశీ, ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, మట్టా రాగమయి, వంశీకృష్ణ, నాగరాజు, మాల మహానాడు నేత చెన్నయ్య సీఎంతో భేటీ అయ్యారు. ఎస్సీ వర్గీకరణపై కోర్టు తీర్పునకు అనుగుణంగా మాల, మాదిగలకు సరైన న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ.. కమిటీని నియమించి అధ్యయనం చేసి, నివేదిక ఆధారంగా అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

15 రోజుల్లో వీసీలు, ప్రొఫెసర్ల నియామకం

- సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన 135మందికి అభయహస్తం
- ఇంటర్వ్యూకు ఎంపికైతే మరో రూ.లక్ష ప్రోత్సాహకం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



సివిల్స్ మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులకు సింగరేణి సంస్థ అందజేసిన రూ.లక్ష చెక్కును అందజేస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు దుద్దిళ్ల, పొన్నం

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు రాబోయే 10 –15 రోజుల్లో వైస్‌చాన్స్‌లర్లు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల నియామకం చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రం నుంచి సివిల్స్ మెయిన్స్‌కు అర్హత సాధించిన 135 మందికి సోమవారం సచివాలయంలో రాజీవ్ సివిల్స్ అభయహస్తం కింద రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.లక్ష పెద్ద మొత్తం కాకపోవచ్చని, కానీ ప్రభుత్వం మీ వెనుక ఉందనే ఆత్మవిశ్వాసం కల్పించడానికి ఇస్తున్నామని చెప్పారు. మెయిన్స్ నుంచి ఇంటర్వ్యూకు ఎంపికైతే మరో రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. తాము అధికారంలోకి వచ్చిన 90రోజుల్లోనే 30వేల ఉద్యోగాలు ఇచ్చామని, గ్రూప్ –1, 2, 3, డీఎస్సీతో కలిపి మరో 35 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వసతిగృహాలన్నీ ఒకే చోట ఉండేలా వంద నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నిరుద్యోగ సమస్య నిర్మూలనకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం వృథా కాకుండా 2 వేల మందికి శిక్షణ ప్రారంభిస్తున్నామని, వచ్చే ఏడాది నుంచి 20వేల మందికి శిక్షణ ఇస్తుందని తెలిపారు. ఒలింపిక్స్‌లో పెద్దసంఖ్యలో పతకాలు సాధించేలా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి రూపకల్పన చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయి, గండ్ర సత్యనారాయణరావు, గడ్డం వివేక్‌వెంకటస్వామి, డాక్టర్ కవ్వంపల్లి సత్యానారాయణ, ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, గడ్డం వంశీ, సింగరేణి సీఎండీ బలరాం, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

సొమ్మొకరిది.. సోకొకరిది

సీఎస్‌ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ) కింద సింగరేణి సంస్థ సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నది. కాగా, ఆ చెక్కులను అభ్యర్థులకు అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ ఖాతాలో వేసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి.

పోచారం, అమిత్‌కు అధిష్ఠానం ఝలక్?

- వీరి నియామాకాలపై అభ్యంతరం.. బాధ్యతల స్వీకరణ వాయిదా?
- ఉత్తర్వులిచ్చి వారం రోజులైనా ఊసే లేదు





హైదరాబాద్, ఆగస్టు 26(నమస్తే తెలంగాణ): ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి వెళ్లిపోయి కాంగ్రెస్ కండువా కప్పుకొని వ్యవసాయ శాఖ సలహాదారుగా నియమితులైన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడి, గుత్తా అమిత్‌రెడ్డికి కాంగ్రెస్ అధిష్ఠానం ఝలక్ ఇచ్చినట్టు సమాచారం. వారి నియామకాలపై అభ్యంతరం వ్యక్తమైనట్టు తెలిసింది. అందుకే పదవీ బాధ్యతలు చేపట్టలేదంటూ పార్టీలో జోరుగా చర్చ జరుగుతున్నది. వీరి నియామకంపై ఉత్తర్వులు వెలువడి వారం గడుస్తున్నా బాధ్యతల స్వీకరణ ఊసెత్తకపోవడం గమనార్హం. వీరి నియామకానికి వ్యతిరేకంగా సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. కొత్తగా పార్టీలో చేరిన వారికి వెంటనే పదవులివ్వడంపై ఆయన అభ్యంతరం వ్యక్తంచేసినట్టు సమాచారం. దీంతో అధిష్ఠానం వారి నియామకాలను ఆపేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇది పరోక్షంగా సీఎం రేవంత్ రెడ్డికి కూడా భంగపాటేననే అభిప్రాయాలు పార్టీలో వ్యక్తమవుతున్నాయి.

పార్టీలో తీవ్ర వ్యతిరేకత

పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వడంపై పార్టీలో అంతర్గతంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఎన్నో ఏండ్లుగా పార్టీ జెండా మోస్తూ కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవారిని పక్కనపెట్టి, కొత్తగా పార్టీలో చేరిన వారికి పదవులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుత్తా అమిత్‌రెడ్డి నియామకంపై నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వర్గీయులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నట్టు తెలిసింది. ఎన్నో ఏండ్లుగా పార్టీ కోసం పని చేసిన మోహన్‌రెడ్డి, శంకర్‌నాయక్ వంటి వారికి ఇంకా పదవులే దక్కలేదని, ఇప్పుడు పార్టీలో చేరిన గుత్తా అమిత్‌కు రెడ్ కార్పెట్ పరిచి చైర్మన్ పదవి ఇవ్వడమేమిటని వారు ప్రశ్నిస్తున్నట్టు సమాచారం. నల్లగొండలో ఇప్పటికే రేవంత్ వర్గానికి చెందిన చాలామందికి పదవులు దక్కడంపై కూడా ఆ జిల్లా నేతలు ఆగ్రహంతో ఉన్నారు. ఇదే విధంగా చూస్తూ పోతే జిల్లాలో తమ ఉనికే ప్రశ్నార్థకం చేస్తారని, తమను నమ్ముకున్న వారికి మొండిచెయ్యే మిగులుతుందని కీలక నాయకులు భావిస్తున్నట్టు తెలిసింది. అందుకే పదవుల నియామకంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించినట్టు సమాచారం.



బీసీ సదస్సులో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

బీసీ రిజర్వేషన్లు పెంచకుంటే రణరంగమే

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య హెచ్చరిక

కడ్తాల్, ఆగస్టు 26: జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని, లేని పక్షంలో బీసీల ఉద్యమాలతో రాష్ట్రం రణరంగం అవుతుందని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ అధ్యక్షతన సోమవారం మైసిగండి గ్రామంలో నిర్వహించిన బీసీల రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించేందుకు అన్ని రాజకీయ పార్టీలు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ జనాభాలో దాదాపు సగం మేరకు ఉన్న బీసీల అభివృద్ధి గురించి ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీ ఆలోచించలేదని విమర్శించారు. ప్రజాస్వామ దేశంలో బీసీలు బిచ్చగాళ్లు కాదని వాటాదారులని, బీసీలకు అన్యాయం చేస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. బీసీల రిజర్వేషన్లను చట్టసభల్లో 50 శాతానికి, విద్య, ఉద్యోగాల్లో 56 శాతానికి పెంచాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, ఏటా రూ.2 లక్షల కోట్లు కేటాయిచాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కులగణనను చేపట్టి, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని, ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎన్నికలను అడ్డుకుంటామని, ప్రతి నియోజకవర్గంలో బహిరంగ సభలను నిర్వహించి ప్రభుత్వం తీరును ఎండగడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నందగోపాల్, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, ఉపాధ్యక్షుడు పెద్దయ్యాయాదవ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, కన్వీనర్ భాస్కర్, బీసీ రక్షక్ దళ్ నాయకులు ఉదయ్ నేత తదితరులు పాల్గొన్నారు.

తేలుకుట్టిన దొంగలు

మొదటిపేజీ తరువాయి...

హోదాను వాడుకోవడం ద్వారా ఈ ముఠా మోసాలకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలోనే ముఠా అధికార పార్టీకి చెందిన దక్షిణ తెలంగాణ ఎంపీ పేరును కూడా వాడినట్టు గుర్తించారు. ఈ ముఠా నాయకుడు కొద్ది రోజుల క్రితం ఒక కాంట్రాక్టర్‌కు రూ. 25 కోట్ల బిల్లును ఒకే ఒక్క రోజులో క్లియర్ చేయించాడట. ఎట్లా చేయించాడు? ఎవరి సాయం తీసుకున్నాడు? అన్నది రహస్యం. అనూహ్య రీతిలో బిల్లు క్లియర్ చేయించడంతో అతడు అధికార పార్టీ నేతలకు సన్నిహితుడనే నమ్మకం అందరికీ కలిగింది. దీనికి తోడు కాంగ్రెస్ ముఖ్యుల పేరు చెప్పి ఒకట్రెండు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు కూడా పెట్టించాడట. బదిలీల కోసం కొందరు ఉద్యోగులను ప్రిన్సిపల్ సెక్రటరీతో కూడా కలిపించాడట. వీటిన్నింటినీ చూసి నమ్మకం కుదిరిన పలువురు ఇతరత్రా పనుల కోసం ఆ ముఠా నేతకు డబ్బులు సమర్పించుకున్నారు. అయితే ఆ పనులను ఆయన చేయించలేకపోయాడు. దీంతో మోసకారి అన్న విషయం బయటపడింది. మోసపు సంపాదనలో ఎక్కువ భాగాన్ని ముఠా నాయకుడే తీసుకోవడం (దాన్ని బెట్టింగ్‌లో పోగొట్టుకున్నాడు. అది వేరే సంగతి!)తో గ్యాంగ్ సభ్యుల మధ్య విభేదాలు తలెత్తి మోసాల సంగతి బయటకు పొక్కడంతో ఎస్‌వోటీ పోలీసులు నిఘావేసి ముఠాను అనధికారికంగా వారం పది రోజుల క్రితమే అదుపులోకి తీసుకున్నారు. అసలు డ్రామా ఇక్కడే మొదలైంది. ముఠా పట్టుబడడం, కాంగ్రెస్ పెద్దల పేర్లు ప్రస్తావనకు రావడంతో విషయం పైదాకా వెళ్లింది. ఒక్కరోజులో బిల్లు పాసైన వ్యవహారం తన మెడకు ఎక్కడ చుట్టుకుంటుందో అని భయపడ్డ ఒక పెద్దాయన వెంటనే రంగంలోకి దిగి, ముఠాతో పాటు, వారి సంభాషణల్లో ప్రస్తావనకు వచ్చిన, తన ప్రత్యర్థి శిబిరంలో ఉన్న కీలక వ్యక్తిపై కూడా కేసు నమోదు చేయాల్సిందిగా పోలీసు ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చారట. తద్వారా విషయం డైవర్ట్ అవుతుందనీ, తన ప్రస్తావన లేకుండా చర్చ అటు వైపు మళ్లుతుందన్నది ఆయన ఎత్తుగడ. కేసు మరీ సీరియస్ అయితే తను సేఫ్, అతడు ఎగిరిపోతాడు, వన్‌షాట్ టు బర్డ్స్ అని ఆయన అంచనా వేసాడు. అయితే సదరు కీలక వ్యక్తి కాంగ్రెస్ ప్రముఖుడికి సన్నిహితుడు కావడంతో పోలీసులు తటపటాయించి విషయాన్ని ఆయన దృష్టికీ తీసుకుని వెళ్లారట. దీంతో కలవరపడ్డ ఆయన, ముఠా నా పేరు ప్రస్తావిస్తేనే నా మీద కేసు నమోదు చేసేటట్లయితే, మరి ఒక్కరోజులో అంత బిల్లు ఎట్లా పాసైందో కూడా ఆరా తీయండి. దాని వెనక ఎవరున్నారో వారిపైనా కేసులు నమోదు చేయండి అని ఒత్తిడి తెచ్చారట. దీంతో పోలీసు ఉన్నతాధికారులు సంకటంలో పడ్డారు. కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం అన్నట్టుగా మారింది వారి పరిస్థితి. ఈ ఫ్రస్టేషన్‌లోనే ఒక ఉన్నతాధికారి కిందిస్థాయి అధికారులకు ఫోన్ చేసి, వెనకాముందూ చూసుకోకుండా, ఎవడినిపడితే వాడిని పట్టుకొచ్చి, ఏది పడితే అది రికార్డు చేయడమేనా? అని చెడామడా తిట్టిపారేశారట. తర్వాత ఎస్‌వోటీ పోలీసులు ముఠాను తమదైన శైలిలో విచారించి, కొందరు బాధితులను వెతికి పట్టుకుని, ఇద్దరు ప్రముఖుల ప్రస్తావనేదీ లేకుండానే, సాదాసీదా ఫిర్యాదు తీసుకుని, రెండు వేర్వేరు పోలీసుస్టేషన్లలో కేసులు నమోదు చేయించారట. ముఠా మోసం కన్నా బయటకు వచ్చిన కాంగ్రెస్ ముఖ్యుల విభేదాలు, పరస్పరం కేసులు పెట్టించుకోవడానికి వారు తెచ్చిన ఒత్తిడి ఇప్పుడు పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఇద్దరు ముఖ్యులు తమను కాపాడుకోవడానికి ఎదుటి ప్రముఖుడిని ఇరికించే ప్రయత్నం చేయడంమీద పోలీసు వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతున్నది. ఈ విషయంలో నిజానిజాలు తెలుసుకోవాలని ప్రయత్నించినప్పుడు పోలీసులు నోరు విప్పడం లేదు. చివరికి ఫిర్యాదు ఇచ్చిన బాధితులు కూడా మాట్లాడడానికి నిరాకరిస్తున్నారు. అసలేం జరిగిందని పోలీసు ఉన్నతాధికారులను ఆరాతీస్తే వారు అవసరానికి మించి సీరియస్ అవుతున్నారు. అంత కోపం ఎందుకో. విషయం ఎలా బయటకు పొక్కిందనేనా?

అమ్మే భారమైందా?

- *అలుగునూర్‌లో తల్లి పోషణను మరిచిన కొడుకులు*
- *ఠాణా మెట్లెక్కిన వృద్ధురాలు*



తిమ్మాపూర్, ఆగస్టు 26: కొడుకులకు కన్నతల్లి భారమైంది. మొన్నటిదాకా వంతుల వారీగా పోషించి, కొద్దిరోజులుగా పట్టించుకోకపోవడంతో ఆ తల్లి ఠాణా మెట్లెక్కి తన గోడువెళ్లబోసుకోవడం, పోలీసులు వెళ్లి మాట్లాడినా వారి తీరు మారలేదు. ఈ ఘటన అలుగునూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. అల్గునూర్‌కు చెందిన వేముల నర్సవ్వకు నలుగురు కొడుకులు, ముగ్గురు బిడ్డలు. అందులో ఓ కొడుకు, కూతురు కొన్నేండ్ల క్రితం మరణించారు. ఆమె భర్త ఇటీవలే మృతిచెందారు. అప్పటి నుంచి గ్రామంలో ఉంటున్న కొడుకులే 15 రోజులకొకరు వంతుల వారీగా పోషిస్తున్నారు. కొద్దిరోజులుగా కొడుకులు తల్లి పోషణను మరిచారు. చిన్న కొడుకు వద్దే మూడు నెలలపాటు ఉండి ఒకే కొడుకుకు భారం కాదల్చుకోలేక అల్గునూర్‌లోనే కిరాయి ఇంట్లో నివాసం ఉంటున్న బిడ్డ ఇంటికి వెళ్లింది. మిగితా కొడుకుల తీరుమారకపోవడంతో ఆదివారం ఆమె ఎల్‌ఎండీ ఠాణా మెట్లెక్కింది. పోలీసులు ఆమె ఇంటికి వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చినా వారిలో మార్పు రాలేదు. విషయం తెలుసుకున్న మహిళా, శిశు, వికలాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు శ్రీనివాస్, రఫీయొద్దీన్ సోమవారం నర్సవ్వ వద్దకు వెళ్లి వివరాలు తీసుకున్నారు. కాగా, మంగళవారం నర్సవ్వ కొడుకులను పిలిచి కౌన్సెలింగ్ ఇస్తానని ఎస్సై చేరాలు తెలిపారు. తల్లికి బువ్వ పెట్టలేని కొడుకుల విషయం సోషల్‌మీడియాలో వైరల్ అవుతుండగా, చివరి ఘడియల్లో ఇలాంటి కష్టం ఎవరికీ రావద్దని నెటిజన్లు సైతం ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి నివాసం వద్ద 2008-డీఎస్సీ బాధితుల ఆందోళన

డీఎస్సీ-2008 బాధితులకు పోస్టులిస్తం

15రోజుల్లో ఇస్తామని సీఎంవో హామీ

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడాది మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు తమకు ఉద్యోగాలు ఇవ్వాలని 2008-డీఎస్సీ బాధితులు సోమవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి భారీగా తరలివచ్చారు. డీఎస్సీ-2008 సాధన సమితి నేతృత్వంలో 200మందికి పైగా అభ్యర్థులు సీఎం ఇంటికి చేరుకోగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం ఆరుగురిని సీఎం ఇంట్లోకి అనుమతించారు. సీఎం వ్యక్తిగత కార్యదర్శి జైపాల్‌రెడ్డి వారితో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. తమకు ఉద్యోగాలు ఇవ్వాలని హైకోర్టు ఈ ఏడాది ఫిబ్రవరి 8న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని, దీంతో గత మార్చి14న రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో డీఎస్సీ బాధితులకు ఏపీ తరహాలో ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్టు గుర్తుచేశారు. ఈ నెల 27నాటికి నియామక ప్రక్రియ పూర్తిచేస్తామని, చివరి అవకాశం ఇవ్వాలని అడ్వకేట్ జనరల్ హైకోర్టు ధర్మాసనానికి తెలిపారని, ఈ గడువు నేటితో ముగియనున్నట్టు వివరించారు. అనంతరం సీఎంవో అధికారులు విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో మాట్లాడి వివరాలు సేకరించారు. వారం రోజుల్లో క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక తీసుకొని, 15రోజుల్లో నియామక ప్రక్రియ పూర్తిచేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్టు డీఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సభావత్ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో సమితి ఉపాధక్షుడు భాస్కర్, ప్రతినిధులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌చావ్లా, ప్రమీల, ప్రశాంతి, లావుడ్యా రవి పాల్గొన్నారు.

'ఇన్‌స్పైర్' అవుతారా..?

- **ఇన్‌స్పైర్ మానక్‌పై స్కూళ్ల అనాసక్తి**
- **వచ్చిన ఎంట్రీలు 1,451**
- **సెప్టెంబర్ 15తో ముగియనున్న గడువు**

హైదరాబాద్, ఆగస్టు 26(నమస్తే తెలంగాణ): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని.. సైన్స్ జిజ్ఞాసను పెంపొందించేందుకు విద్యాశాఖ నిర్వహించే ఇన్‌స్పైర్ మానక్ పట్ల రాష్ట్రంలోని పాఠశాలలు ఆసక్తిచూపడంలేదు. నారాయణపేట, ఆదిలాబాద్, ములుగు, యాదాద్రి భువనగిరి, జయశంకర్‌భూపాలపల్లి, నిర్మల్, మెదక్ జిల్లాల నుంచి ఇప్పటివరకు ఒక్క దరఖాస్తూ రాలేదు. రాష్ట్రంలో 12,954 పాఠశాలలున్నాయి. ఈ విద్యాసంవత్సరానికి 64,770 నామినేషన్లను లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 1,451 మాత్రమే వచ్చాయి. 2024-25 విద్యాసంవత్సరానికి ఇన్‌స్పైర్ దరఖాస్తుల స్వీకరణ గడువు సెప్టెంబర్ 15తో ముగియనుంది. ఈ నేపథ్యంలో పాఠశాలలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీఈఆర్టీ అధికారులు కోరారు. ఇప్పటి వరకు మహబూబాబాద్ నుంచి 395, నల్లగొండ నుంచి 173, నాగర్‌కర్నూల్ నుంచి 118 మాత్రమే ఎంట్రీలు వచ్చాయి. మిగిలిన 30 జిల్లాల్లో ఒక్కో జిల్లా నుంచి వంద ఎంట్రీలు కూడా రాలేదు. జనగాం 5, పెద్దపల్లి 6, కామారెడ్డి 8, జోగులాంబ గద్వాల నుంచి 10 చొప్పున మాత్రమే దరఖాస్తులొచ్చాయి.

స్టార్టప్‌లుగా అవతరించే చాన్స్..

విద్యార్థి దశలోనే పరిశోధనాకాంక్షను పెంపొందించేందుకు ఇన్‌స్పైర్‌ను విద్యాశాఖ అమలుచేస్తున్నది. మాడ్యూల్స్‌ను రూపొందించడం వరకే పరిమితం కాకుండా.. ప్రాజెక్ట్‌లకు వాస్తవిక రూపాన్నిచ్చి స్టార్టప్‌లుగా రూపొందించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. విద్యార్థుల ఆలోచనలకు పదునుపెట్టేందుకు ఐఐటీ, ఎన్ఐటీ, ఐసర్ సంస్థల సహకారం తీసుకుంటున్నారు. ఇన్‌స్పైర్ జిల్లాస్థాయిలో ఎంపికైతే రూ.10వేలు, జాతీయస్థాయికి ఎంపికైతే రూ.20వేల చొప్పున ప్రోత్సాహాకాన్ని విద్యాశాఖ అందిస్తున్నది.

సీఎంఆర్‌ఎఫ్‌పై సీ'ఐ'డీ

- **నకిలీ బిల్లులతో ప్రైవేట్ దవాఖానల భారీ స్కామ్**
- **28 ప్రైవేట్ దవాఖానలపై చర్యలకు సీఐడీ సిద్ధం**
- **ఫోర్జరీ, చీటింగ్‌లపై 6 ఎఫ్ఐఆర్‌లు, 17 కేసులు**
- **చైన్‌లింక్ స్కామ్‌లో ప్రభుత్వ వైద్యులు, అధికారులు?**



హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): నకిలీ పేషెంట్లు, నకిలీ బిల్లులతో కొన్ని దవాఖానలు భారీ స్కామ్ నడిపినట్టు సీఐడీ అధికారులు గుర్తించారు. వీరు అక్రమార్గంలో చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్‌ఎఫ్) నుంచి భారీగా నిధులు కొల్లగొట్టినట్టు ఆరోపణలున్నాయి. లేని రోగులను, రోగాలను సృష్టించి ఎలాంటి ఆపరేషన్ ఎక్విప్‌మెంట్ లేకపోయినా, ఆపరేషన్లు చేసినట్టు నకిలీ బిల్లులు చూపించి ఆయా దవాఖానల యాజమాన్యాలు రూ.కోట్లు దండుకున్నాయి. ఈ భారీ కుంభకోణంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పది, ఖమ్మం జిల్లాలో పది, నల్లగొండలో మూడు, ఉమ్మడి వరంగల్‌లో మూడు, కరీంనగర్‌లో రెండు ప్రైవేట్ దవాఖానలు ఉన్నట్టు సమాచారం. ఏడాదిన్నర క్రితమే ఈ తరహా కుంభకోణం మంచిర్యాల, హైదరాబాద్‌లో వెలుగు చూడటంతో నాటి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలోనే సుమారు 28 ప్రైవేట్ దవాఖానలు కాసులకు కక్కుర్తిపడి ప్రభుత్వ సొమ్మును కాజేసినట్టు సీఐడీ అధికారులు గుర్తించారు. సీఎంఆర్‌ఎఫ్ సెక్షన్ ఆఫీసర్ డాక్టర్ డీఎన్ మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతకాల ఫోర్జరీ, చీటింగ్ వంటి అంశాలపై తెలంగాణ సీఐడీ అధికారులు ఆరు ఎఫ్ఐఆర్‌లు, 17 కేసులు నమోదు చేశారు. సీఎంఆర్‌ఎఫ్‌లోని వ్యక్తులు, ప్రైవేట్ దవాఖానల యాజమాన్యం, కొందరు ప్రభుత్వ డాక్టర్లు, సిబ్బంది, అకౌంటెంట్ ఆఫీసర్లు అంతా చైన్‌లింక్‌గా ఏర్పడి ఈ భారీ మోసానికి తెరలేపినట్టు సీఐడీ గుర్తించింది. దీనిపై లోతుగా విచారణ కొనసాగుతున్నదని, ఈ కుంభకోణం కోట్ల రూపాయల్లో ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్‌కు ముందు ఈ దందా జరిగినట్టు సమాచారం.

లేఖలపై ప్రభుత్వ డాక్టర్ల సంతకాలు

ఈ ప్రైవేట్ దవాఖానలకు రెఫరెన్స్‌గా వస్తున్న ప్రభుత్వ డాక్టర్ల సంతకాలు సైతం బిల్లులపై ఉండటం అనుమానాలకు తావిస్తున్నది. నల్లగొండలోని మూడు దవాఖానల్లో రూ.50 కోట్లకు మేర నకిలీ బిల్లులతో డబ్బులు పొందినట్టు సమాచారం. ఫలానా శస్త్రచికిత్సకు ఫలానా రోగి తమ హాస్పిటల్‌లో జాయిన్ అయినట్టు నకిలీ లేఖలు ప్రభుత్వానికి పంపడం, డబ్బులు క్లెయిమ్ చేసుకోవడం వీరికి పరిపాటిగా మారింది. ప్రైవేట్ దవాఖానల్లో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బంది, ప్రభుత్వ అధికారులు ఓ చైన్‌లింక్‌గా ఏర్పడి.. డబ్బులు దండుకునేలా పథకం రచించినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రైవేట్ దవాఖానల దృశ్చర్య వల్ల ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లింది. గతంలో ఇట్లాంటి కేసు ఒకటి హైదరాబాద్ సీసీఎస్‌లో నమోదైంది. దీనిపై నాటి ప్రభుత్వం వెంటనే విచారణకు ఆదేశించింది. హైదరాబాద్‌లో మొదట నాలుగు దవాఖానలను గుర్తించి చర్యలు తీసుకున్నారు. అయితే ఈ భారీ కుంభకోణం వెనుక అధికారులు, కొందరు నాయకుల పాత్రపై ఆరా తీస్తున్నారు.

అక్రమాలకు పాల్పడిన దవాఖానలు

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో..: అరుణశ్రీ మల్టీ స్పెషాలిటీ (ఐఎస్ సదన్ ఎక్స్ రోడ్), శ్రీకృష్ణ హాస్పిటల్, జనని హాస్పిటల్ (సైదాబాద్), హిరణ్య హాస్పిటల్ (మీర్‌పేట),డెల్టా హాస్పిటల్ (హస్తినాపురం), శ్రీరక్ష (బీఎన్‌రెడ్డి నగర్), ఎంఎంఎస్ హాస్పిటల్ (సాగర్ రింగ్ రోడ్), ఏడీఆర్ఎం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (శారదానగర్), ఎంఎంవీ ఇందిరా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (కొత్తపేట), శ్రీసాయి తిరుమల హాస్పిటల్ (బైరామల్‌గూడ).

ఖమ్మం జిల్లా: శ్రీ శ్రీకర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, డాక్టర్ జేఆర్ ప్రసాద్ హాస్పిటల్, శ్రీవినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీసాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, వైష్ణవి హాస్పిటల్, సుజాత హాస్పిటల్, న్యూ అమృత, ఆరెంజ్ హాస్పిటల్, మేఘశ్రీ హాస్పిటల్

నల్లగొండ జిల్లా: నవీన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (మిర్యాలగూడ), మహేశ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (మిర్యాలగూడ), అమ్మ హాస్పిటల్, (నల్లగొండ)

ఉమ్మడి కరీంనగర్ జిల్లా: సప్తగిరి హాస్పిటల్ (జమ్మికుంట), శ్రీసాయి హాస్పిటల్ (పెద్దపల్లి)

ఉమ్మడి వరంగల్ జిల్లా: రోహిణి మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ (హనుమకొండ), శ్రీసంజీవిని హాస్పిటల్ (మహబూబాబాద్), సిద్ధార్థ హాస్పిటల్ (మహబూబాబాద్)

త్వరలోనే అరెస్టులు..?

ఈ నకిలీ బిల్లుల్లో పేర్కొన్న రోగుల్లో ఏ ఒక్కరు కూడా వైద్యం చేయించుకోలేదు. అయితే వీరంతా వైద్యం చేసుకున్నట్టు, వాటికి బిల్లులు అయినట్టు రికార్డులు ఉన్నాయి. విచారణలో అవన్నీ నకిలీ బిల్లులుగా సీఐడీ అధికారులు తేల్చారు. వీటి వెనుక ఉన్నవారిపై కూడా కేసులు నమోదు చేస్తామని చెప్తున్నారు. ప్రభుత్వ అధికారుల, ప్రైవేట్ వైద్యుల హస్తం ఉన్నట్టు ప్రాథమిక విచారణలో అనుమానిస్తున్నారు. ఈనేపథ్యంలోనే ప్రైవేట్ దవాఖానల్లోని వైద్యులు, సిబ్బందిని విచారించేందుకు సీఐడీ బృందాలు రంగంలోకి దిగినట్టు సమాచారం. సమగ్ర దర్యాప్తు తర్వాత.. సూత్రధారులు, పాత్రధారులను అరెస్టు చేయనున్నట్టు సమాచారం. ఈ కేసు దర్యాప్తులోనే పదుల సంఖ్యలోనే అరెస్టులు జరుగుతాయని అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం మోసానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది.

సంవత్సరం కిందటే వెలుగులోకి..

జమ్మికుంట, ఆగస్టు 26: ఏడాది క్రితమే జమ్మికుంటలోని ఒక ప్రైవేట్ దవాఖానలో సీఎంఆర్‌ఎఫ్, ప్రైవేట్ బీమా సంస్థల దందా సాగినట్టు ఆరోపణలులొచ్చాయి. ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో సంవత్సరం కిందట సీఐడీ డీఎస్పీ శ్రీనివాస్ బృందం రంగంలోకి దిగింది. అధికారులు ప్రైవేట్ దవాఖానలో విచారణ జరిపారు. దవాఖాన ఏర్పాటు, సీఎంఆర్‌ఎఫ్ కోసం, ప్రైవేట్ బీమా సొమ్ము కాజేసేలా ఇచ్చిన బిల్లులు, తదితర విషయాలపై ఆరా తీశారు. రికార్డులు, బిల్లులు పరిశీలించగా, నకిలీ బిల్లుల బాగోతం బయటపడినట్టు తెలిసింది. కోట్లాది రూపాయల సొమ్ము కాజేసినట్టు అధికారులు గుర్తించనట్లు సమాచారం. అయితే, విచారణ సమయంలో దవాఖాన యాజమాన్యం (వైద్యులు) నకిలీ బిల్లులు తాము ఇచ్చినవి కాదని, దవాఖానలో పనిచేసే కొందరు సిబ్బంది కలిసి మోసానికి పాల్పడ్డారని అధికారులకు వివరించినట్టు తెలిసింది.



రెండు వేల కోట్లిస్తేనే రోడ్ల పునరుద్ధరణ

- **9,400 కి.మీ. మేర పనులకు ప్రతిపాదనలు**
- **ఇందులో 4,000 కి.మీ. రోడ్లు మరీ అధ్వానం**
- **నిధులివ్వని రాష్ట్ర సర్కారు**

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రోడ్ల పునరుద్ధరణ పనులకు నిధుల సమస్య వెంటాడుతున్నది. సుమారు 9,400 కిలోమీటర్ల మేర రోడ్లను పునరుద్ధరించాల్సి ఉండగా, ఇందులో సగానికి పైగా రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉన్నది. అన్ని రోడ్ల పునరుద్ధరణకు రూ.2,000 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు రూపొందించిన రోడ్లు భవనాల శాఖ, నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన రావడంలేదు. రాష్ట్రంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఆధీనంలోని రోడ్లు మినహా, ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో 24,245 కిలోమీటర్ల మేర రోడ్లు ఉన్నాయి. రోడ్ల నిర్వహణలో భాగంగా ఏటా వర్షాకాలానికి ముందు మరమ్మతులు చేయడం, ప్రతి ఐదేండ్లకోసారి రోడ్లను పూర్తిగా పునరుద్ధరించడం ఆనవాయితీ. ప్రస్తుతం 9,400 కిలోమీటర్ల మేర రోడ్లను పునరుద్ధరించాల్సి ఉన్నది. ఇందులో సుమారు 4,000 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారులు పూర్తిగా ప్రయాణానికి వీలు లేకుండా ఉన్నట్టు గుర్తించారు. రోడ్ల వివరాలు, వాటి పునరుద్ధరణకు రూ.2,000 కోట్లు అవసరమవుతాయనే అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఉలుకూ పలుకు లేదు. నిధులు మంజూరు చేస్తేనే రోడ్లు మెరుగుపడే అవకాశం ఉన్నది.

గురుకుల బదిలీల్లో రిజర్వేషన్లకు తూట్లు

హైదరాబాద్, ఆగస్టు26 (నమస్తే తెలంగాణ): సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీలో నిర్వహించిన బదిలీలు, ప్రమోషన్లలో రిజర్వేషన్లను సైతం అటకెక్కించారు. డిసెండింగ్ ఆర్డర్‌లో ప్రమోషన్లను నిర్వహించి, జనరల్ కోటా పోస్టులను తొలుత భర్తీ చేసి అనంతరం రిజర్వేషన్ కోటాని నింపాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ప్రక్రియను చేపట్టారు. గురుకుల డిగ్రీ కాలేజీలకు సంబంధించిన బదిలీలు, పదోన్నతులనైతే అడ్డదిడ్డంగా చేశారని యూనియన్లు ఆరోపిస్తున్నాయి. సొసైటీకి సంబంధించి 2020లో మొత్తంగా 19 డిగ్రీ ప్రిన్సిపాల్ పోస్టులను నోటిఫై చేశారు. అందులో ఓసీ 8, ఎస్సీ 4, ఎస్టీ 2, బీసీ(ఏ) 2, బీసీ(బీ) 1, దివ్యాంగులకు 2 ప్రకటించారు. కానీ ఆ నోటిఫికేషన్‌లో ఓసీ 6, ఎస్సీ 1, బీసీ(ఏ) 1 మొత్తంగా 8 పోస్టులను మాత్రమే భర్తీ చేశారు. 11 డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పోస్టులు మిగిలిపోయాయి. అందులో ఓసీ 2, ఎస్సీ 3, ఎస్టీ 2, బీసీ(ఏ) 1, బీసీ(బీ) 1, దివ్యాంగుల కోటా 2 ఉన్నాయి. ఇవన్నీ కూడా నోటిఫైడ్ పోస్టులు. కానీ సొసైటీ ఉన్నతాధికారులు మాత్రం ఈ నోటిఫైడ్ పోస్టులను సైతం జనరల్ కన్వర్షన్ చేసి నింపారు. ఆ 11 పోస్టులతోపాటు మరో 6 కలిపి మొత్తంగా 17 డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పోస్టులను 100 శాతం ప్రమోషన్ల ద్వారానే, అదీ నిబంధనలకు విరుద్ధంగానే భర్తీ చేసింది. అందులో బీసీ (ఏ), దివ్యాంగుల కోటా లేకుండా చేశారు. సొసైటీలో అర్హులైన మహిళలు లేకుంటే 30% ప్రమోషన్ కోటాలో 50 ఏండ్లు దాటిన పురుష అభ్యర్థులకు ప్రమోషన్ ఇవ్వొచ్చు అన్న నిబంధన ఉన్నది. అయితే, ఒక మహిళా అధ్యాపకురాలు సొంతంగా జాతీయ స్థాయి రిసెర్చ్ ప్రాజెక్టులను పూర్తిచేసినా.. ఆమెను పక్కనబెట్టి డిగ్రీ కాలేజీలో 5 ఏండ్ల బోధన అనుభవం కూడా లేని ఓ పురుష అభ్యర్థికి 30 శాతం కోటా కింద ప్రమోషన్ కల్పించడం గమనార్హం.

కరీంనగర్‌లో ఆర్టీసీ కార్మికుల నిరసన

- **కాంగ్రెస్ అనుబంధ ఎస్‌డబ్ల్యూయూ ఆందోళన**
- **కార్మికులకు న్యాయం జరగడంలేదని ఆవేదన**
- **పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక**



సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ బస్టాండ్‌లో నిరసన చేస్తున్న కార్మికులు

కరీంనగర్ తెలంగాణచౌక్, ఆగస్టు 26 : ఆర్టీసీ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఐఎన్‌టీయూసీ ఆర్టీసీ కార్మిక విభాగమైన స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం కరీంనగర్ బస్టాండ్‌లో నిరసనకు దిగారు. అంతకుముందు యూనియన్ రాష్ట్ర వైస్ చైర్మన్, జిల్లా ఇన్‌చార్జి జక్కుల మల్లేశం ఆధ్వర్యంలో ఆర్ఎం కార్యాలయం ఎదుట నిరసనకు దిగగా.. పోలీసు, సెక్యూరిటీ గార్డులు అనుమతి ఇవ్వలేరు. తమ ప్రభుత్వ పాలనలో శాంతియుత నిరసనను ఎందుకు అడ్డుకుంటున్నారని వన్ టౌన్ సీఐ సిరిలాల్‌తో వాగ్వాదానికి దిగారు. సమస్యలను ఆర్ఎం దృష్టికి తీసుకెళ్లేందుకు మూడు నెలలుగా ప్రయత్నిస్తున్నా అనుమతి ఇవ్వడంలేదని, అందుకే నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం జక్కుల మల్లేశం మీడియాతో మాట్లాడుతూ.. ఆర్టీసీ అధికారులు కార్మికులను వేధిస్తున్నారని ఆరోపించారు. డ్యూటీ చార్ట్‌లో సంతకం చేయకముందే బ్రీత్ ఎనలైజర్ టెస్టులు చేస్తున్నారని, మద్యం సేవించకపోయినా షుగర్, బీపీ మందులు వాడినప్పుడు బ్రీత్ ఎనలైజర్ టెస్టులో పర్సంటేజీ చూపెడితే డ్రైవర్లను సస్పెండ్ చేస్తున్నారని వాపోయారు. తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆర్టీసీలో జంగ్ సైరన్

మొదటిపేజీ తరువాయి...

పికెట్‌లో నిర్వహించే కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికుల డిమాండ్లతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తామని చెప్పారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా నిరసన కార్యక్రమం చేపట్టి సమస్యలను పరిష్కరించుకోనున్నట్టు స్పష్టంచేశారు. 3 వేల కొత్త నియామకాలు చేపడుతామని మూడు మాసాలుగా ఊదరగొడుతున్నా ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని, వెంటనే నియామకాల నోటిఫికేషన్ ప్రకటించాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని ఎస్‌డబ్ల్యూయూ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమిరెల్లి రాజిరెడ్డి, ప్రచార కార్యదర్శి కొవ్వూరు యాదయ్య డిమాండ్ చేశారు.

రేపు సమగ్రశిక్షా ఉద్యోగుల నిరసన

తమను రెగ్యులరైజ్ చేయాలని ధర్నాలు

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : తమను రెగ్యులరైజ్ చేయాలని, బేసిక్ పే అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న సమగ్ర శిక్షా ఉద్యోగులు జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, నిరసన దీక్షలు చేపట్టనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఝూన్సీసౌమ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది సెప్టెంబర్‌లో సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె చేస్తున్న సందర్భంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో హాజరైన రేవంత్‌రెడ్డి తమ ప్రభుత్వం వచ్చిన నెలరోజుల్లోనే రెగ్యులరైజ్ చేస్తామని, బేసిక్ పే(మినిమం టైం స్కేల్) అమలుచేస్తామని హామీ ఇచ్చి, నేడు తాత్సారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ 9 నెలల్లో ముఖ్యమంత్రితో సహా మంత్రులను అనేకసార్లు కలిసినా తమ సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో ఆందోళనలకు సిద్ధమైనట్టు తెలిపారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు ఆందోళనలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

• రుణమాఫీ కోసం రోడ్డెక్కిన రైతన్న



2 లక్షల రుణమాఫీ చేయాల్సిందేనని ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి రైతులు సోమవారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. లేనిపోని నిబంధనలతో రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. రుణమాఫీ చేయకపోతే రైతు సంఘం ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. - ఏటూరునాగారం

• నీటిని విడుదల చేయాలని రైతుల నిరసన



డీ-40కి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరుతూ నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం ఇందుగుల రైతులు సోమవారం కాల్వలోకి దిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పానగల్ ఉదయ సముద్రం నుంచి కాల్వకు నీటిని విడుదల చేయాలని పలుమార్లు మంత్రి కోమటిరెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశంతోపాటు కలెక్టర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. - మాడ్గులపల్లి

సమీకృత మార్కెట్లు సగం సగమే!

- **నిధులు విడుదల చేయక నిలిచిన పనులు**

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో ప్రారంభించిన సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణాలు పడకేశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణాలకు నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ఇప్పటికే రూ.200 కోట్లు ప్రభుత్వం బకాయి ఉందని, ఆ డబ్బులు ఇచ్చే వరకు పనులు పునః ప్రారంభించమని స్పష్టం చేస్తున్నారు. దీంతో మార్కెట్లు అందుబాటులోకి రాకుండాపోయాయి. ప్రజలకు అవసరమైన పండ్లు, కూరగాయలు, మాసం, చేపలు, పూలు అన్నీ ఒకే దగ్గర లభించాలనే లక్ష్యంతో ప్రతి మున్సిపాలిటీలో ఒక్కో సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్లను నిర్మించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. వీటి కోసం రూ.500 కోట్లను కేటాయించింది. పట్టణం, నగరం మధ్యలో అన్ని వసతులతో ఉండాలని నిర్ణయించారు. మురుగునీరు నిలిచిపోకుండా మోడల్ డ్రైనేజీ, మరుగుదొడ్లు, మోడల్ లైటింగ్, ప్రహరీ, అంతర్గత రహదారులు, పార్కింగ్ సౌకర్యం, సీసీ కెమెరాలు, మొక్కల పెంపకం, జీరో వేస్ట్ తదితర వాటికి చర్యలు చేపట్టారు. మార్కెట్లు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండే విధంగా రూపకల్పన చేశారు. రాష్ట్రంలో మొత్తం 144 సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్లను మంజూరు చేశారు. 25 వేల కంటే తక్కువ జనాభా ఉన్న 57 పట్టణాల్లో ఒక్కో దాన్ని రూ.2 కోట్లతో, 25 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న 81 పట్టణాల్లో ఒక్కొక్కటి రూ.4.50 కోట్లతో నిర్మించనున్నారు. లక్ష కంటే ఎక్కువ జనాభా ఉన్న పట్టణాల్లో లక్షకు ఒక మార్కెట్ చొప్పున గరిష్ఠంగా ఐదు నిర్మించాలని నిర్ణయించారు. బీఆర్ఎస్ హయాంలోనే 15 మార్కెట్లు పూర్తి అయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వాటి గురించి పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. కాంట్రాక్టర్లు ప్రభుత్వ అధికారులను ఎన్నిసార్లు కలిసినా పైసా విడుదల చేయలేదు. దీంతో కాంట్రాక్టర్లు అక్కడి యంత్రాలను వేరే పనులకు తరలించారు. తమకు బిల్లులు చెల్లిస్తేనే పనులు ప్రారంభిస్తామని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా నిధులు విడుదల చేసి సమీకృత మార్కెట్లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం సాలార్‌పూర్‌లో మైనింగ్ జరుగుతున్న ప్రాంతం

ఆ'గని' దోపిడీ

- **సహజ వనరులనూ వదలని మైనింగ్ లీజుదారులు**
- **డీజీపీఎస్, ఈటీఎస్ సర్వేతో వెలుగులోకి అక్రమాలు**
- **రంగారెడ్డి జిల్లాలో 100 వరకు ఖనిజ లీజులు**

జిల్లాలో మొత్తం గనులు : 152
ప్రస్తుతం నడుస్తున్నవి : 100



- **2022-23 సంవత్సరంలో**
- **లీజు రూపంలో సమకూరిన ఆదాయం : రూ.154.65 కోట్లు**
- **లక్ష్యం : రూ.129.08 కోట్లు**
- **జూలై నాటికి సమకూరిన ఆదాయం: రూ.37.31 కోట్లు**

జిల్లాలో ఖనిజ వనరుల వివరాలు ఇలా..:

ఖనిజం పేరు	-	లీజుల సంఖ్య
క్వార్ట్జ్, ఫెల్డ్ స్పార్	-	52
గ్రానైట్	-	15
కంకర, రాయి	-	82
లెటరైట్	-	03

రంగారెడ్డి/వికారాబాద్, ఆగస్టు 26(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లాలో మైనింగ్ లీజుదారులు నిబంధనలు అతిక్రమించి యథేచ్ఛగా తవ్వుకుంటున్నారు. సహజ వనరులను కూడా వదలడం లేదు. ప్రభుత్వానికి రాయల్టీ చెల్లింపుల్లోనూ తీవ్ర అవకతవకలు జరుగుతున్నట్టు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం చేపడుతున్న డీజీపీఎస్(డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్, ఈటీఎస్(ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్) సర్వేల్లో పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగుజూస్తున్నాయి. ఏకంగా అటవీశాఖ భూముల్లోనూ అక్రమ మైనింగ్ జరుగుతున్న విషయం బయటపడింది.

ఆదాయమే కాదు.. అక్రమాలూ ఎక్కువే

జిల్లాలో మైనింగ్ ఆదాయం గణనీయంగా ఉంటుండగా అక్రమాలూ అదేస్థాయిలో ఉంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా 152 వరకు క్వార్ట్జ్, గ్రానైట్, కంకర పరిశ్రమలు ఉండగా, ఇందులో 100 మాత్రమే పనిచేస్తున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం లీజు డబ్బులను ఆయా పరిశ్రమల యజమానుల నుంచి గనులు, భూగర్భ శాఖ వసూలు చేస్తున్నది.

ఒకచోట అనుమతి..మరోచోట తవ్వకాలు

జిల్లాలో లీజుదారులు ఒకచోట అనుమతి తీసుకుని మరోచోట తవ్వకాలు సాగించి అక్రమాలకు పాల్పడ్డారు. మరికొందరు అనుమతి పొందిన ప్రాంతం హద్దులు దాటి తవ్వకాలు జరిపారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీలో భారీగా కోతపడింది. దీనికోసమే డీజీపీఎస్, ఈటీఎస్ సర్వే నిర్వహిస్తున్నారు. సర్వేలో వెల్లడైన వివరాల ప్రకారం కొందరు మైనింగ్ యజమానులకు షోకాజ్ నోటీసులు ఇస్తున్నారు. తీవ్రత ఆధారంగా 5 నుంచి 10 రెట్లు పెనాల్టీ వేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 22 మంది లీజుదారులకు డిమాండ్ నోటీసులను జారీ చేసినట్లు మైనింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

అటవీ ప్రాంతంలోనే..

మైనింగ్ శాఖ చేపడుతున్న సర్వేలో కడ్తాల్ మండలం సాలార్‌పూర్ అటవీ ప్రాంతంలోని సర్వే నంబర్ 97లో అక్రమంగా మైనింగ్ చేస్తున్నట్టు నిర్ధారణ అయ్యింది. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు ఎఫ్‌డీవో, రెవెన్యూ, మైనింగ్ శాఖలతో జాయింట్ సర్వే చేయించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. సాలార్‌పూర్‌లో క్వార్ట్జ్, ఫెల్డ్ స్పార్ మైనింగ్‌కు గనుల శాఖ అనుమతులు ఇచ్చింది. అప్పట్లో ల్యాండ్ రెవెన్యూ అధికారులు జరిపిన సర్వేలో అటవీ ప్రాంతానికి వెలుపలే మైనింగ్ ప్రాంతమని నిర్ధారించినట్టు తెలిసింది. ఈ సర్వేలో అటవీశాఖ సైతం పాలుపంచుకుంది. కానీ..తాజాగా చేపట్టిన సర్వేలో మైనింగ్ పనులు జరుగుతున్న ప్రాంతం అటవీ ప్రాంతంలో ఉన్నట్టు తేలింది.

ప్రతిపాదనల్లోనే గౌరారం రిజర్వ్ ఫారెస్ట్

వికారాబాద్ జిల్లా బొంరాసుపేట్ మండలం గౌరారంలోని సర్వే నంబర్ 127లోని 2 వేల ఎకరాల అటవీ భూములను 1971లో రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రతిపాదించారు. తదనంతరం అటవీ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో క్రమంగా తగ్గుతూ 180 ఎకరాలకు చేరింది. మరోవైపు రెవెన్యూ అధికారులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండానే సర్వే నంబర్ 127, 82 రీ అలాట్‌మెంట్ ప్రక్రియ పూర్తి చేశారు. దీంతో ఈ భూములు తమవి కావని అటవీ శాఖ పేర్కొనడంతో, 180 ఎకరాల అటవీ భూములకు పట్టాలిస్తూ వచ్చారు. ఏడాది క్రితం జిల్లా అటవీ శాఖ అధికారిగా డీవీ రెడ్డి పనిచేసిన సమయంలో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. జిల్లా అటవీశాఖ అధికారిగా వచ్చిన జ్ఞానేశ్వర్ గౌరారంలోని అటవీ భూములపై ఆరా తీసి సంబంధిత భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ సుమారు ఐదెకరాల్లో అక్రమ మైనింగ్ జరుగుతున్నట్లు ఏడాది క్రితం వెలుగులోకి వచ్చింది. గత అటవీ శాఖ అధికారి అక్రమ మైనింగ్‌ను మూసివేయించారు. ఇవి పట్టా భూములంటూ మైనింగ్ నిర్వాహకులు కోర్టుకెళ్లడంతో గౌరారం అటవీ భూములకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించగా అసలు విషయం బయటపడింది.

'గౌరారం' భూములను కాపాడుకుంటాం..

గౌరారం అటవీ భూములను కాపాడుకుంటాం. సరైన ఆధారాలతో కోర్టుకెళ్తాం. సర్వే నిర్వహించి రెవెన్యూ-అటవీ హద్దులను గుర్తించాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీకి లెటర్ రాశాం. గౌరారం అటవీ భూముల్లో ఎలాంటి మైనింగ్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వొద్దని జిల్లా మైనింగ్ అధికారులను ఆదేశించాం.

-జ్ఞానేశ్వర్, జిల్లా అటవీ శాఖ అధికారి

నోటి మంట.. వంటింటి చిట్కా!

వేడి వేడి సమోసానో, గరం గరం చాయ్‌నో నోట్లో పెట్టుకోగానే కాలడం అందరికీ అనుభవమే. నిజానికి ఇది చిన్న అసౌకర్యం మాత్రమే. కొన్ని గంటలో, ఒకట్రెండు రోజులో బాధించే ఈ సమస్య పరిష్కారానికి ఇంటి చిట్కాలు కొన్ని ఉన్నాయి.

నోరు కాలినప్పుడు చల్లటి పాలు తాగితే మంట నుంచి ఉపశమనం కలుగుతుంది. పాలలో కేసిన్ లాంటి ప్రొటీన్లు ఉంటాయి. ఇవి కాలిన కణజాలంపై పూతగా అమరిపోతాయి. దాంతో మనకు ఉపశమనం లభిస్తుంది. చల్లటి పాలను కొద్దికొద్దిగా తాగుతూ కొన్ని సెకండ్ల పాటు నోట్లోనే ఉంచుకుని మింగేస్తే మంచి ఫలితం ఉంటుంది.

నోరు కాలిన సందర్భాల్లో తేనె కూడా గొప్ప ప్రయోజనాన్ని ఇస్తుంది. యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి కాబట్టి తేనెను కాలిన చోట పూస్తే బాధ చాలావరకు తగ్గిపోతుంది. ఒక చెంచాడు తేనె తీసుకుని కాలిన చోట పూతలా పూసి నోట్లో నెమ్మదిగా కరిగిపోనివ్వాలి. రోజంతా తరచూ ఇలా చేస్తుండాలి.


కాలిన గాయాల చికిత్సలో నెయ్యిని వందల ఏండ్లుగా ఉపయోగిస్తూనే ఉన్నారు. దీనికున్న చల్లబరిచే గుణాలు నోటి మంటకూ ఉపశమనం కలిగిస్తాయి. వేలిని శుభ్రం చేసుకొని, నెయ్యి అద్దుకొని నోట్లో కాలిన చోట పూతగా రాయాలి. కాలిన వెంటనే ఇలా చేస్తే మంచిది.

కలబందకు చల్లబరిచే, గాయాలను తగ్గించే గుణాలు ఉన్నాయి. వేడి కారణంగా నోరు కాలితే వెంటనే కలబంద గుజ్జును పూయాలి. దీంతో మంట తగ్గిపోతుంది. తొందరగా ఉపశమనం దొరుకుతుంది.



అధిక వేడి వల్ల నోరు కాలినప్పుడు పెరుగు కూడా మంచి ప్రత్యామ్నాయంగా నిలుస్తుంది. చల్లదనం, పొరలా ఉండే లక్షణం కాలిన కణజాలాన్ని బాగుచేసి మంటను తగ్గిస్తుంది. ఓ చెంచాడు పెరుగు తీసుకుని కొన్ని సెకండ్లపాటు నోట్లో ఉంచుకొని మింగేయాలి.

చక్కెర నోట్లో వేసుకున్నా మంచి ఫలితమే కనిపిస్తుంది. చక్కెర నోట్లో లాలాజలం ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. కాబట్టి నోరు కాలిన సందర్భాల్లో కొంచెం చక్కెరను నోట్లో వేసుకోవాలి. నెమ్మదిగా కరిగిపోయేలా చప్పరించాలి. ఈ చిట్కా కూడా త్వరిత ఉపశమనాన్ని ఇస్తుంది.



రోగ నిరోధక శక్తి మనకు ప్రకృతి సిద్ధంగానే వస్తుంది. అయితే, కాలంతోపాటు మన జీవనశైలి, ఆహారపు అలవాట్లు మారిపోతున్నాయి. దీంతో మనలో స్వయం సిద్ధంగా ఉండే రోగ నిరోధక శక్తి తగ్గిపోయి చిన్నపాటి ఇన్ఫెక్షన్లకే అనారోగ్యం బారినపడే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఒకప్పుడైతే ఎంత పెద్ద జ్వరం వచ్చినా ఇంటి చిట్కాలతోనే నయం చేసుకునే వాళ్లు. ఇప్పుడు మాత్రం చిన్నపాటి జలుబును కూడా తట్టుకునే పరిస్థితి లేదు. మందుబిళ్ల నోట్లో పడాల్సిందే! కారణం... మన శరీరంలో రోగ నిరోధక శక్తి తగినంతగా లేకపోవడమే. ఈ క్రమంలో అసలు రోగ నిరోధక శక్తి అంటే ఏంటి? అది మనకు ఎలా సమకూరుతుంది? ఈ ఇమ్యూనిటీ పవర్ పెరగాలంటే ఎలాంటి ఆరోగ్య సూత్రాలు పాటించాలి? ఏ ఆహారం తీసుకోవాలి? మొదలైన విషయాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.



ఇమ్యూనిటీ ఆరోగ్యానికి... రక్షరేకు

ప్రతి మనిషిలో రోగ నిరోధక శక్తి (ఇమ్యూనిటీ) అనేది ప్రకృతి సిద్ధంగానే సమకూరి ఉంటుంది. మన రక్తంలోని తెల్ల రక్తకణాలు శరీరానికి సైనికుల్లా పనిచేస్తాయి. ఇవి బయటి పరిసరాల నుంచి దాడిచేసే ఇన్ఫెక్షన్లు, బ్యాక్టీరియాను శరీరంలోకి చొరబడకుండా రక్షిస్తాయి. ఒకవేళ కొవిడ్– 19 లాంటి వైరస్‌లు శరీరంలోకి ప్రవేశిస్తే, వాటితో తెల్ల రక్తకణాలు పోరాడతాయి. ఈ విధంగా పోరాడే తెల్ల రక్తకణాల సంఖ్యను లేదా శక్తినే రోగ నిరోధక శక్తి అని పేర్కొంటారు. ఇది మనం తీసుకునే రోజువారీ ఆహారం, శారీరక శ్రమతోనే లభిస్తుంది. అలా సమకూరని వారికి మాత్రం ఔషధాల రూపంలో ఇవ్వాల్సి వస్తుంది.


ఈ కాలాల్లో అత్యవసరం

రోగ నిరోధక శక్తి అనేది వర్షకాలం, శీతకాలంలో అత్యవసరం. ఎందుకంటే వానాకాలం, చలికాలంలో డెంగీ, మలేరియా, ఫ్లూ వంటి సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలుతుంటాయి. వీటిని సమర్థంగా ఎదుర్కోవడానికి మన శరీరంలో తగినంత రోగ నిరోధక శక్తి ఉండాలి. ఈ పవర్ లేకపోతే వచ్చిన వ్యాధులు త్వరగా తగ్గకపోవడమే కాకుండా రోగి తీవ్ర అనారోగ్యానికి గురవుతాడు. తరచూ వ్యాధుల బారినపడాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. ప్రధానంగా వేసవి నుంచి వర్షకాలానికి మారుతున్న సంధి దశలో శరీరానికి ఇమ్యూనిటీ ఎంతో అవసరం. వానాకాలంలో సాధారణంగా డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు వస్తుంటాయి. రోగ నిరోధక శక్తి బాగా ఉన్నవారిలో బయటినుంచి యాంటి బయాటిక్స్ అవసరం లేకుండానే ఇలాంటి జ్వరాలను శరీరం తట్టుకుంటుంది. ఇక మనలో ఇమ్యూనిటీ పవర్ పెరగడానికి కొన్ని ప్రాథమిక జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. రోజువారి జీవనశైలి, ఆహారపు అలవాట్లలో స్వల్ప మార్పులు చేసుకోవడం వల్ల దీర్ఘకాలికంగా మంచి ఫలితాలు ఒనగూరుతాయి.

ఇమ్యూనిటీకి బాటలు

- వ్యక్తిగత పరిశుభ్రత పట్ల శ్రద్ధ చూపాలి. బయటికి వెళ్లి వచ్చిన వెంటనే, భోజనానికి ముందు, మల, మూత్ర విసర్జన తర్వాత కాళ్లు, చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.
- రోగ నిరోధక శక్తి పెరగడానికి ఆహారపు అలవాట్లతోపాటు వ్యాయామం, తగినంత నిద్ర కూడా చాలా అవసరం.
- రోజుకు కనీసం 40 నిమిషాల చొప్పున వారంలో 5 రోజులు వ్యాయామం చేయడం మంచిది.
- నడకకు వెళ్లే వాళ్లు రోజుకు కనీసం ఏడు వేల నుంచి ఎనిమిది వేల అడుగులు వేయాలి.
- డెస్క్ ఉద్యోగాల్లో ఉన్నవాళ్లు గంటకు ఒక్కసారైనా కూర్చున్న చోటు నుంచి లేచి, కొంచెం దూరం నడవాలి.
- స్కిప్పింగ్ వల్ల కాళ్ల కండరాలు, రక్త ప్రసరణ మెరుగుపడుతుంది.
- 60 ఏళ్లు దాటినవాళ్లు స్కిప్పింగ్ చేయలేని పరిస్థితుల్లో సైక్లింగ్ చేయవచ్చు.
- వయసులో ఉన్నవాళ్లయితే జాగింగ్, రన్నింగ్, స్విమ్మింగ్ చేయడం ఉత్తమం. లేదంటే శారీరక, మానసిక ఉల్లాసాన్ని ఇచ్చే ఏవైనా క్రీడలు ఆడాలి.
- యోగా చేస్తే శరీరం ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది. ప్రాణాయామం వల్ల మెదడు, ఇతర అవయవాలకు తగినంత ఆక్సిజన్ అందుతుంది.

జాగ్రత్తలే కీలకం



- ఫ్లూ వంటి విషజ్వరాలు వ్యాపించకుండా ఉండాలంటే బయటికి వెళ్లినప్పుడు మాస్క్ ధరించాలి.
- ప్రతి సంవత్సరం ఫ్లూ లాంటి విషజ్వరాలకు టీకాలు వేయించుకుంటే ఇన్ఫెక్షన్ల వల్ల తలెత్తే ఇబ్బందులు చాలావరకు తగ్గుతాయి.
- పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి.
- జంతువుల ద్వారా సోకే ఇన్ఫెక్షన్ల గురించి అవగాహన పెంచుకోవాలి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- రోజూ పొద్దునే ఓ ఇరవై నిమిషాలపాటు ఎండలో గడిపితే శరీరంలో విటమిన్ డి తగినంతగా ఉత్పత్తి అవుతుంది. రోగ నిరోధక శక్తి నిర్వహణలో విటమిన్– డి కూడా కీలకపాత్ర పోషిస్తుంది.
- విటమిన్– డి తక్కువ ఉన్నవాళ్లు డాక్టర్ల సూచన మేరకు సప్లిమెంట్స్ తీసుకోవాలి.
- జ్వరం, దగ్గు, జలుబు, ర్యాషెస్ వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- రోగ నిరోధక శక్తి పెరగడానికి వ్యాయామం, ఆహారం మాత్రమే కాకుండా ఇతర జాగ్రత్తలు కూడా తీసుకోవాలి. ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలి.

ఆహారంతో రోగ నిరోధకత

రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలంటే విటమిన్–సి, విటమిన్–ఇ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలి. వీటిలో యాంటిఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తి పెరగడంలో ఎంతో దోహదపడతాయి. పల్లీలు, పిస్తాపప్పు, ఎండుద్రాక్ష, కుంకుమ పువ్వులో సరిపడా యాంటి ఆక్సిడెంట్స్ ఉంటాయి. పసుపు, తులసి, అల్లం, వెల్లుల్లిలో యాంటి ఆక్సిడెంట్లతోపాటు యాంటిబ్యాక్టీరియల్ గుణాలు కూడా ఉంటాయి. ప్రతిరోజూ చాయ్‌లో అల్లం లేదా తులసి, పాలల్లో అయితే పసుపు వేసుకుని తాగడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దానిమ్మ, స్ట్రాబెర్రీ, కర్బూజ, తర్బూజ పళ్లు తింటే శరీరానికి తగినన్ని విటమిన్లు, యాంటి ఆక్సిడెంట్స్ పుష్కలంగా దొరుకుతాయి. ఇవి కూడా రోగ నిరోధక శక్తి పెరగడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. సమతుల ఆహారానికి పెద్దపీట వేస్తూనే, ధూమపానం, మద్యపానం లాంటి దుర్వ్యసనాలను వదిలించుకోవాలి.

విటమిన్-సి ఉన్న పదార్థాలు

- నారింజ
- బత్తాయి
- నిమ్మ మొదలైన సిట్రస్ జాతి పళ్లు

విటమిన్-ఇ ఉన్న పదార్థాలు

- అవకాడో
- కివీ
- బాదం
- పాలకూర
- పొప్పడి పండు

ఆహారంతోపాటు హైడ్రేషన్..

వర్షకాలం, చలికాలంలో రోజుకు 2 నుంచి 3 లీటర్ల నీరు, వేసవిలో అయితే 4 లీటర్ల నీరు తప్పనిసరిగా తాగాలి. వానాకాలంలో కూరగాయలు, ఆకు కూరలు శుభ్రంగా కడిగాకే వాడుకోవాలి. వర్ష కాలంలో టైఫాయిడ్ సహా వివిధ వ్యాధులు రావడానికి కలుషితమైన నీరే ప్రధాన కారణం. కాబట్టి వర్ష రుతువులో బయటి ఆహార పదార్థాలను సాధ్యమైనంత వరకు దూరం పెట్టడమే ఉత్తమం. ఇక మాంసాహారులు మాంసాన్ని చక్కగా శుభ్రం చేసి బాగా ఉడికించి తినాలి. చేపల్లో విటమిన్– ఇ, ఒమేగా– 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండెకు మేలుచేస్తాయి.

మంచి నిద్ర ఎంతో మంచిది

మనిషికి ఆహారం, వ్యాయామం ఎంత ముఖ్యమో నాణ్యమైన నిద్ర అంతే ప్రధానం. ప్రతిరోజూ వయసుతో నిమిత్తం లేకుండా కనీసం ఆరు నుంచి ఎనిమిది గంటల నాణ్యమైన నిద్ర అవసరం. రాత్రివేళ త్వరగా పడుకుని పొద్దునే తొందరగా లేచి చేసే వ్యాయామం మంచి ఫలితాలను ఇస్తుందని వివిధ అధ్యయనాలు వెల్లడించాయి. సరైన నిద్ర వల్ల శరీరంలో హార్మోన్ల సమతుల్యత ఏర్పడుతుంది. త్వరగా లేచి వ్యాయామం చేయడం వల్ల ఒత్తిడి కూడా తగ్గుతుంది. మన రోగ నిరోధక శక్తి తగ్గడంలో ఒత్తిడికీ పాత్ర ఉంటుంది. కాబట్టి మానసిక ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలి.

... మహేశ్వర్‌రావు బండారి



డాక్టర్ నిషాంత్‌రెడ్డి
ఎం.డి (జనరల్ మెడిసిన్), కన్సల్టెంట్ ఫిజీషియన్
స్టార్ హాస్పిటల్, హైదరాబాద్

పిల్లల పెంపకం

అలా పడటం సహజమే!

మా అబ్బాయి వయసు రెండేండ్లు. పదిహేను నెలల వయసులో నడవడం మొదలుపెట్టాడు. ఇప్పుడు పరిగెత్తుతున్నాడు. ఈ క్రమంలో మాటిమాటికీ కిందపడిపోతున్నాడు! పడినప్పుడు దెబ్బలు తగులుతున్నాయి. ఈ దెబ్బల కారణంగా భవిష్యత్తులో ఏమైనా సమస్యలు వస్తాయా?

• సుధీర్ కుమార్, ఖమ్మం

సాధారణంగా పిల్లలు సంవత్సరం నుంచి పద్దెనిమిది నెలల వయసు మధ్య నడవడం మొదలుపెడతారు. కానీ, కొంతమంది పిల్లలు ఏడాదికి ముందుగానే నడుస్తారు! ఇంకొంతమంది పిల్లలు పద్దెనిమిది నెలల తర్వాత నడుస్తారు. ఆలస్యంగా నడవడం మొదలుపెట్టారని ఆందోళన అనవసరం. పిల్లలు తమ చుట్టూ ఉన్న ప్రదేశాలను చూస్తూ ఉండిపోరు. పరిసరాల్లో ఉండే వస్తువులను తాకాలని, అందుకోవాలని ఆరాటపడుతుంటారు. అందుకోసం అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు. ఆ సందర్భంలో పడిపోవడం సహజమే. చిన్నపిల్లలకు దెబ్బలు తగులుతాయని భయంతో తల్లిదండ్రులు వాళ్లను ఎటూ వెళ్లకుండా ఎత్తుకోవడం, తామే తిప్పడం చేస్తుంటారు. ఇలా చేయకుండా.. పిల్లలు తిరిగేటప్పుడు, పరిగెత్తేటప్పుడు దెబ్బలు తగలకుండా, ప్రమాదం జరగకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఇల్లు, పరిసరాలు పిల్లలకు సేఫ్‌గా ఉండేలా మార్చుకోవాలి. పిల్లలు ఉన్న ఇంట్లో రసాయనాలు, వేడి పాత్రలు, వస్తువులు, పదునైన కత్తులు వాళ్లకు అందకుండా ఉంచాలి. చిన్నారులు బాల్కనీలోకి పోకుండా తలుపులు పెట్టాలి. ప్రమాదం జరుగుతుందేమోనని పిల్లల్ని కట్టడి చేయకుండా, కనిపెట్టుకుని ఉండాలి. వారికి అన్ని సదుపాయాలు కల్పించడం పెద్దల బాధ్యత. పిల్లలు పరిగెత్తేటప్పుడు తగిలిన దెబ్బ తీవ్రతను బట్టి దాని ప్రభావం ఉంటుంది. చిన్న చిన్న దెబ్బలు సాధారణమే. వాటివల్ల భవిష్యత్‌లో ఏ సమస్యా ఉండదు. అన్నిటికీ కంగారుపడొద్దు. ఈ వయసులో పిల్లల యాక్టివిటీ చాలా ఎక్కువగా ఉంటుంది. వాళ్ల ఎదుగుదలకు మనం సాయం చేయాలి. మాటిమాటికీ పడటం గురించి ఏదైనా సందేహం ఉంటే, పిల్లల వైద్యులకు చూపించాలి. బిడ్డ కండరాల్లో, నరాల్లో ఏదైనా లోపం ఉందో, లేదో వైద్యులు పరీక్షలు చేసి నిర్ధారిస్తారు. ఏదేదో ఊహించుకొని అనవసరంగా ఆందోళన చెందకండి.



డాక్టర్ విజయానంద్
నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్

పసుపు.. పద్నాలుగు రోజులు

పసుపు భారతీయుల వంటల్లోనే కాకుండా, వివాహాది వేడుకల్లోనూ ప్రాముఖ్యం కలిగిన దినుసు. అయితే, ఆర్థరైటిస్, టెండనైటిస్, బర్సయిటిస్ లాంటి రోగ నిరోధక శక్తికి సంబంధించిన ఆటో ఇమ్యూన్ వ్యాధుల నివారణలో, కిడ్నీల పనితీరు మెరుగుపర్చడంలో, పాదాల వాపును తగ్గించడంలోనూ పసుపు ఎంతో దోహదపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. పద్నాలుగు రోజులపాటు పసుపును ఆహారంలో, పాలు, మజ్జిగలో తగిన మోతాదులో భాగం చేసుకుంటే సానుకూల ఫలితాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. పసుపులో యాంటి ఇన్‌ఫ్లమేటరీ, యాంటి ఆక్సిడెంట్, క్యాన్సర్ నిరోధక గుణాలు ఉంటాయి. గాయాల చికిత్సలో, ఇన్ఫెక్షన్లను నియంత్రణలో ఇవెంతో సహకరిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు రుమటాయిడ్ ఆర్థరైటిస్ విషయంలో కూడా పసుపు ప్రయోజనకారిగా ఉంటుందట. ఇంకా జీర్ణ వ్యవస్థలో రసాల ఊటను పెంచడం, కడుపులో మంట తగ్గించడం, రక్తంలో చక్కెర స్థాయులు ఆరోగ్యకరంగా ఉండటానికి, ఊబకాయం ముప్పు తగ్గడానికీ పసుపు సహకరిస్తుందట. ఇందులో ఉండే కర్క్యుమిన్ శరీరంలో ఫంగస్, బ్యాక్టీరియా పెరుగుదలను అడ్డుకుంటుందట. అయితే, మంచిది కదా అని పసుపును ఎక్కువగా తీసుకుంటే మాత్రం అలర్జీలు, డయేరియా లాంటి సమస్యలకు దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పైగా పసుపులో కాల్షియం ఆగ్జలేట్ ఉంటుంది కాబట్టి, కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదం కూడా పొంచి ఉంటుందని పేర్కొంటున్నారు.

వానాకాలం మధ్యలోకి వచ్చేశాం. ముసుర్లు, ఓ మోస్తరు వానల్లో తడవాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా జలుబు, దగ్గు లాంటి సమస్యలు పట్టి పీడిస్తుంటాయి. అయితే, దగ్గు, జలుబులు మామూలు వ్యాధులే అయినా, వీటి చుట్టూ మనలో ఎన్నో అపోహలు ఉంటాయి. వాటిని నివృత్తి చేసుకుంటే మంచిది.

జలుబు, దగ్గు.. అపోహలు

దగ్గు, జలుబులకు యాంటిబయాటిక్స్ వాడాలా?
బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లకే యాంటిబయాటిక్స్ అవసరమవుతాయి. దగ్గు, జలుబులేమో వైరస్‌ల వల్ల వస్తాయి. కాబట్టి, యాంటి బయాటిక్స్ తరచుగా, క్రమరహితంగా తీసుకుంటే మన ఆరోగ్యానికి మంచి కంటే చెడే ఎక్కువ.

పెరుగు, ఇతర పాల ఉత్పత్తులతో జలుబు వస్తుందా?
ఇన్ఫెక్షన్ కలిగించే బ్యాక్టీరియా, వైరస్‌ల కారణంగా రోగాలు వస్తాయి. సాధారణంగా, జలుబు కారణంగా మ్యూకస్ (శ్లేష్మం) ఉత్పత్తి అవుతుంది. ఇక పెరుగులో ప్రొబయాటిక్స్ ఉంటాయి. ఇందులో ఉండే బ్యాక్టీరియా నిజానికి మనిషి ఆరోగ్యానికి మేలుచేస్తుంది.

ఓవర్ ద కౌంటర్ టానిక్‌లు ఇన్ఫెక్షన్‌ను తొందరగా నయం చేస్తాయా?
డాక్టర్ సూచన లేకుండా మందుల దుకాణాల్లో కొనే టానిక్‌లు హానికరమైనవి. వీటి వాడకంతో సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. ముఖ్యంగా చిన్నపిల్లల విషయంలో. అవి కేవలం రోగ లక్షణాలను మరుగున పరుస్తాయి. అలా రోగం నుంచి ఉపశమనం కలగజేస్తాయి.



ఇవి పిల్లల్లో బలహీన రోగ నిరోధక శక్తికి సంకేతాలా?
పిల్లల్లో దగ్గు, జలుబు తరచుగా వస్తుంటే... అది అలర్జీకి సంకేతం. అంతేతప్ప బలహీనమైన రోగ నిరోధక శక్తికి సూచన కాదు.

జలుబులాగే అన్ని రకాల దగ్గులూ ఇతరులకు వ్యాపిస్తాయా?
బ్యాక్టీరియా లేదా వైరస్ ఇన్ఫెక్షన్ ద్వారా వచ్చిన దగ్గు ఇతరులకు వ్యాపిస్తుంది. అదే అలర్జీ, ఆస్తమా, శ్వాసనాళంలో మంట కారణంగా అయితే మాత్రం చాలావరకు ఇతరులకు వ్యాపించవు.

ఫ్లూ వ్యాక్సిన్ల వల్ల మళ్లీ ఫ్లూ దాడిచేస్తుందా?
ఏడాదికోసారి డాక్టర్లు సూచించే ఫ్లూ వ్యాక్సిన్లలో క్రియాశీలం కాని వైరస్‌లు ఉంటాయి. ఇవి మళ్లీ ఇన్ఫెక్షన్లకు ఎంతమాత్రం కారణం కాదు. కాబట్టి, ప్రతి ఏటా పిల్లలకు ఫ్లూ టీకాలు వేయించవచ్చు.

మామూలు జలుబు అయితే, పిల్లలు బడికి వెళ్లొచ్చా?
దగ్గు, జలుబు సాధారణంగా వైరస్‌ల కారణంగా వస్తాయి. ఇవి రోగుల దగ్గర్లో ఉన్నవారికి ఒకరినుంచి మరొకరికి సోకే ప్రమాదం ఉంది. కాబట్టి పిల్లలను ఇంట్లోనే ఉంచాలి. తగిన చికిత్స అందించాలి.


మాలీవుడ్‌లో 'మీటూ' ప్రకంపనలు

- ప్రముఖ నటులు, డైరెక్టర్లపై క్యాస్టింగ్ కౌచ్ ఆరోపణలు

తిరువనంతపురం: మలయాళం సినిమా ఇండస్ట్రీలో 'మీటూ' వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తున్నది. పలువురు ప్రముఖ నటులు, డైరెక్టర్లపై క్యాస్టింగ్ కౌచ్ ఆరోపణలు గుప్పుమంటున్నాయి. మాలీవుడ్‌లో మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించి జస్టిస్ హేమ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను బహిరంగపర్చిన తర్వాత పలువురు మహిళా నటులు తమకు ఎదురైన దారుణ పరిస్థితులపై గళం విప్పుతున్నారు. ప్రముఖ నటులు ఎం ముఖేశ్(సీపీఎం ఎమ్మెల్యే), జయసూర్య, మునియన్‌పిళ్ల రాజు, ఇదవేళ బాబులు 2013లో ఓ సినిమా షూటింగ్ సందర్భంగా తనపై శారీరకంగా, మానసికంగా లైంగిక వేధింపులకు పాల్పడ్డారని మలయాళీ నటీ మిను మునీర్ సోమవారం ఆరోపించారు. జయసూర్య తనను కౌగిలించుకొన్నాడని, బలవంతంగా ముద్దు పెట్టాడని పేర్కొన్నారు. అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్(ఏఎంఎంఏ) సభ్యత్వం కోరితే, కార్యదర్శి ఇదవేళ బాబు తన ఫ్లాట్‌కు రమ్మన్నాడని, అదేవిధంగా ముఖేశ్ ఆయన చెప్పిన దానికి అంగీకరించనందుకు తనకు సభ్యత్వం రాకుండా చేశాడని ఆరోపించారు. అయితే మిను మునీర్ ఆరోపణల వెనుక స్వార్థ ప్రయోజనాలు ఉన్నాయని, ఆరోపణలపై దర్యాప్తు జరపాలని మునియన్‌పిళ్ల రాజు కోరారు. నటుడు, డైరెక్టర్ బాబురాజ్‌పై ఓ జూనియర్ ఆర్టిస్ట్ సంచలన ఆరోపణలు చేశారు. ఆయన తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ యువతి పేర్కొన్నారు. తమపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో డైరెక్టర్ రంజిత్, నటుడు సిద్ధిఖ్ ఏఎంఎంఏ పదవులకు ఆదివారం రాజీనామా చేశారు.

రూ.35కే టీబీ పరీక్ష

- కొత్త పరీక్ష విధానం అభివృద్ధి
- రెండున్నర గంటల్లో ఫలితం
- ఐసీఎంఆర్-ఆర్ఎంఆర్‌సీ ఘనత



న్యూఢిల్లీ: క్షయ వ్యాధి పరీక్షకు అస్సాంలోని దిబ్రుగఢ్‌లో ఉన్న ఐసీఎంఆర్-ప్రాంతీయ వైద్య పరిశోధన కేంద్రం(ఆర్ఎంఆర్‌సీ) కొత్త విధానాన్ని అభివృద్ధి చేసింది. దీని ద్వారా కేవలం రూ.35 ఖర్చుతో టీబీ పరీక్ష చేయొచ్చు. సీఆర్ఐఎస్‌పీఆర్ ఆధారిత టీబీ పరీక్షను రోగుల కఫంతో చేస్తారు. సులువుగా, మూడు దశల్లో ఈ పరీక్ష ఉంటుంది. రెండున్నర గంటల్లో దాదాపు 1,500 నమూనాల పరీక్షలను ఏకకాలంలో చేయవచ్చని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్(ఐసీఎంఆర్) వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు ఎక్కువగా మైక్రోస్కోపీ, న్యూక్లియిక్ యాసిడ్ ఆధారిత పరీక్ష పద్ధతులు పాటిస్తున్నారు. వీటి ద్వారా టీబీ లేదని నిర్ధారణ అయ్యేందుకు 42 రోజుల సమయం పడుతుంది. పైగా ఈ పరీక్షలకు ఖరీదైన యంత్రాలు అవసరం. తాము అభివృద్ధి చేసిన కొత్త పరీక్ష విధానంతో సులువుగా, వేగంగా, చౌకగా టీబీ పరీక్షను జరపొచ్చని ఐసీఎంఆర్ తెలిపింది. ఈ పరీక్ష విధానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు గానూ సంస్థలు, పరిశ్రమలు, తయారీదారుల నుంచి ఆసక్తి వ్యక్తీకరణకు ఆహ్వానం తెలిపినట్టు పేర్కొన్నది. క్షయ వ్యాధి తీవ్రంగా మారకముందు గుర్తించడం చాలా అవసరమని, ఈ దిశగా కొత్త పరీక్ష విధానం కీలకంగా మారబోతున్నట్టు ఐసీఎంఆర్ భావిస్తున్నది.


9-11 తరగతుల మార్కులకు 12వ తరగతి ఫలితాల్లో వెయిటేజీ

ఎన్సీఈఆర్టీ ప్రతిపాదన

న్యూఢిల్లీ: 12వ తరగతి బోర్డు పరీక్షలకు ఎన్సీఈఆర్టీ సరికొత్త మూల్యాంకన నమూనాను ప్రతిపాదించింది. ఇందులో విద్యార్థులు 9 నుంచి 11 తరగతుల వరకు సాధించిన మార్కుల ఆధారంగా 12వ తరగతి ఫలితాల్లో వెయిటేజీ ఇవ్వడంతోపాటు వృత్తివిద్యకు, నైపుణ్య ఆధారిత శిక్షణకు మరింత ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నది. ఎడ్యుకేషన్ బోర్డుల మధ్య సమానత్వాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా రూపొందించిన ఓ నివేదిక నుంచి ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. 12వ తరగతి ఫైనల్ ఫలితాల్లో గరిష్ఠంగా 9వ తరగతి నుంచి 15 శాతం, 10వ తరగతి నుంచి 20 శాతం, 11వ తరగతి నుంచి 25 శాతం మార్కులను కలపాలని ఇది సూచించింది.

బై..బై.. స్వీడన్!

- ఐరోపా దేశాన్ని వీడుతున్న భారతీయులు
- దేశానికి వచ్చేవారి కంటే వెళ్లేవారే ఎక్కువ
- జీవన వ్యయం పెరగడమే ప్రధాన కారణం



స్టాక్‌హోమ్: ఐరోపాలో స్థిరపడాలనుకునే భారతీయులకు ఆకర్షణీయంగా కనిపించే స్వీడన్ దేశం పట్ల క్రమంగా ఆసక్తి తగ్గిపోతున్నది. వీలైతే స్వీడన్ నుంచి బయటకు వెళ్లేందుకు ప్రవాస భారతీయులు ప్రయత్నిస్తున్నారు. 'స్టాటిస్టిక్స్ స్వీడన్' లెక్కలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ వివరాల ప్రకారం.. 2024 జనవరి నుంచి జూన్ మధ్యకాలంలో స్వీడన్‌కు వచ్చిన భారతీయుల కంటే, ఈ దేశాన్ని వీడిన భారతీయుల సంఖ్యనే ఎక్కువగా ఉంది. ఈ ఆరు నెలల కాలంలో 2,837 మంది భారత్‌లో జన్మించిన వారు స్వీడన్‌ను విడిచిపెట్టి వెళ్లారు. గత ఏడాది ఇదే కాలంలో పోలిస్తే ఇది 171% ఎక్కువ.

కారణాలివే..

భారతీయులు స్వీడన్‌ను విడిచిపెట్టడానికి ఖర్చులు రోజురోజుకూ పెరుగుతూ ఉండటం, అందుబాటు ధరల్లో ఇండ్లు లభించకపోవడం వంటివే ప్రధాన కారణాలు. పైగా ఇటీవల స్వీడన్‌కు చెందిన పలు కంపెనీలు లేఆఫ్‌లు ప్రకటించాయి. ఆ తర్వాత కొత్త ఉద్యోగాలు వెతుక్కోవడం కష్టంగా మారడంతో కొందరు స్వీడన్‌ను వీడుతున్నట్టు తెలుస్తున్నది. ఇక, వర్క్ పర్మిట్ల విషయంలో ఇటీవల స్వీడన్ ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేయడం, జీవిత భాగస్వాములకు ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారడం కూడా చాలామంది దేశం వీడటానికి కారణాలు.

బద్లాపూర్ ఘటనలో సీసీటీవీ ఫుటేజ్ మాయం

ముంబై, ఆగస్టు 26: మహారాష్ట్రలోని బద్లాపూర్ బడిలో చిన్నారులపై లైంగిక వేధింపుల ఘటన నేపథ్యంలో స్కూల్లోని గత 15 రోజుల సీసీటీవీ ఫుటేజ్ మాయమైందని రాష్ట్ర విద్యా మంత్రి దీపక్ ఖేసర్కర్ సోమవారం తెలిపారు. ఈ నెల 14న ఘటన గురించి క్లాస్ టీచర్‌కు, ప్రిన్సిపల్‌కు తెలిపామని బాధితుల కుటుంబాలు చెప్తుండగా.. ఈ నెల 16న తమకు సమాచారం అందిందని స్కూల్ యాజమాన్యం చెప్తున్నది. ఈ తేడాపై విచారణ జరుపుతున్నట్టు మంత్రి తెలిపారు. ఈ క్రమంలో సీసీటీవీ ఫుటేజ్ మాయం కావడం స్కూల్ బాధ్యతపై కొత్త ప్రశ్నలు లేవనెత్తింది.

రేప్ అంటే ఏంటని అడిగిన రెండు రోజులకే!

గువాహటి: అస్సాంలోని నాగావ్ జిల్లాలో ఈనెల 22న ట్యూషన్ నుంచి తిరిగి వస్తున్న ఓ బాలికపై కొంత మంది సామూహిక లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. రేప్ అంటే ఏంటి ఆంటీ? అని బాలిక తనను అడిగిన రెండు రోజులకే ఆమెపై ఆఘాయిత్యం జరిగిందని బంధువు ఒకరు మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు. కోల్‌కతా ట్రైనీ డాక్టర్‌పై లైంగిక దాడి, హత్య ఘటన వార్తను చదివిన బాలిక ఈ మేరకు తనను ఈ ప్రశ్న అడిగిందని తెలిపారు.

పాలీగ్రాఫ్ టెస్టులో అబద్ధాలు!

కోల్‌కతా, ఆగస్టు 26: పాలీగ్రాఫ్ టెస్టులో కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ అబద్ధాలు, పొంతనలేని సమాధానాలు ఇచ్చినట్టు సమాచారం. తాను ఘటన జరిగిన సెమినార్ హాల్‌కు వెళ్లే సమయానికే బాధిత వైద్యురాలు చనిపోయిందని, తర్వాత నేను భయంతో అక్కడి నుంచి పారిపోయానని లై డిటెక్టర్ టెస్టులో నిందితుడు చెప్పుకొచ్చాడని తెలిసింది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ మీడియా సంస్థలు కథనాలు ఇచ్చాయి. ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటన జరిగిన రోజు రాత్రి ముందు నిందితుడు సంజయ్ రాయ్ మరో మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని సీబీఐ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు, టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ మైనర్ కుమార్తెకు లైంగిక దాడి బెదిరింపులు వచ్చాయి. దీన్ని బెంగాల్ పిల్లల హక్కుల పరిరక్షణ కమిషన్ సుమోటోగా స్వీకరించింది. పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరింది.

రైతాంగ ఉద్యమంతో బంగ్లా పరిస్థితులు!

- కేంద్రం కఠిన చర్యలు తీసుకోకుంటే అదే జరిగేది
- రైతు ఆందోళనల కొనసాగింపు వెనుక విదేశీ కుట్ర
- బీజేపీ ఎంపీ, నటి కంగనా వివాదాస్పద వ్యాఖ్యలు
- వెంటనే దిద్దుబాటు చర్యలకు దిగిన కమలం పార్టీ
- అది పార్టీ అభిప్రాయం కాదని ప్రకటన విడుదల

న్యూఢిల్లీ, ఆగస్టు 26: రైతాంగ ఉద్యమంపై బీజేపీ ఎంపీ, ప్రముఖ నటి కంగనా రనౌత్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం దేశంలో కొనసాగుతున్న రైతుల ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోయి ఉంటే, కేంద్ర నాయకత్వం బలంగా లేకుంటే భారత్‌లో కూడా బంగ్లాదేశ్ పరిస్థితులు తలెత్తేవని వ్యాఖ్యానించారు. నూతన వ్యవసాయ చట్టాలను కేంద్రం వెనక్కు తీసుకొన్నప్పటికీ స్వార్థ ప్రయోజనాలు ఆశించేవారు, విదేశీ శక్తులు రైతాంగ ఉద్యమాన్ని ఎగదోస్తున్నాయని ఆరోపించారు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో మృతదేహాలు వేలాడుతూ కనిపించాయని, మహిళలపై లైంగిక దాడులు చోటుచేసుకొన్నాయని ఆరోపిస్తూ తన ఎక్స్ ఖాతాలో వీడియోను పోస్టు చేశారు. 'బంగ్లాదేశ్‌లో ఏం జరిగిందో, మన దేశంలో కూడా జరిగే అవకాశం ఉన్నది. విదేశీ శక్తులు, స్వార్థ శక్తులు ఇందుకు కుట్ర పన్నాయి. దేశం కుక్కల పాలైనా వారికేం పట్టదు' అని అన్నారు.

హర్యానా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ నుంచి వెంటనే స్పందన

రైతుల ప్రభావం అధికంగా ఉండే హర్యానాలో అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్న నేపథ్యంలో కంగన వ్యాఖ్యలు అధికార బీజేపీకి తలనొప్పిగా మారాయి. కంగన వ్యాఖ్యలపై దుమారం రేగడంతో కమలం పార్టీ వెంటనే స్పందించింది. దిద్దుబాటు చర్యలు చేపట్టింది. కంగన వ్యాఖ్యలు పార్టీ అభిప్రాయం కాదని, ఆమె వ్యాఖ్యలను అంగీకరించడం లేదని బీజేపీ ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ పాలసీ అంశాలపై మాట్లాడేందుకు అధికారం కానీ, అనుమతి గానీ ఆమెకు లేదని పేర్కొన్నది. వివాదాస్పద, రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని కంగనాకు పంజాబ్ బీజేపీ సీనియర్ నేత హర్జిత్ గరేవాల్ సూచించారు. రైతుల గురించి మాట్లాడే పని ఆమెది కానని, కంగన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతంగా పరిగణించాలని, ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు రైతు పక్షపాతులు అని చెప్పుకొచ్చారు. ప్రతిపక్షాలు తమకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని, కంగన వ్యాఖ్యలు కూడా అదేవిధంగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు.



మోదీ క్షమాపణలు చెప్పాలి: ఏఐకేఎస్

రైతాంగ ఉద్యమంపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ వ్యాఖ్యలను ఏఐకేఎస్ ఖండించింది. దేశ వ్యవసాయ రంగాన్ని మింగేయాలనుకొంటున్న బయటి, అంతర్గత బాస్‌లను సంతోషపెట్టేందుకే ఆమె ఈ విధమైన వ్యాఖ్యలు చేశారని ఏఐకేఎస్ అధ్యక్షుడు అశోక్ ధావలే ఓ ప్రకటనలో విమర్శించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని మోసం చేసిన, బ్రిటీషర్లకు తొత్తులుగా వ్యవహరించిన మతతత్వ శక్తులకు దేశ రైతాంగం, కార్మికుల దేశభక్తిని ప్రశ్నించే నైతికత లేదని అన్నారు. కంగన వ్యాఖ్యలకు ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇదే తొలిసారి కాదు..

రైతాంగ ఉద్యమం, రైతుల గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం కంగనకు ఇదే తొలిసారి కాదు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ ఉద్యమాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. 2020లో ఉద్యమంలో పాల్గొన్న ఓ మహిళా రైతును 'బిల్కిస్ బానో'గా పేర్కొన్న ఆమె.. డబ్బులిచ్చి ఆందోళనలకు తీసుకొచ్చారని పేర్కొన్నారు. రైతు వ్యతిరేక వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె ఇటీవల మండీ ఎంపీగా ఎన్నికైన తర్వాత కంగనకు చండీగఢ్ ఎయిర్‌పోర్టులో చేదు అనుభవం ఎదురైంది. ఓ సీఐఎస్ఎఫ్ మహిళా సిబ్బంది ఆమె చెంపపై చెళ్లుమనిపించింది. ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.

చంద్రుడిపై మట్టితో మంచినీరు

బీజింగ్, ఆగస్టు 26: చంద్రుడిని మానవులకు నివాసయోగ్యంగా మార్చే దిశగా చైనాకు చెందిన శాస్త్రవేత్తలు సరికొత్త ప్రయోగం చేపట్టారు. మానవ మనుగడకు కీలకమైన నీటి వనరులను సృష్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్(సీఏఎస్)లోని నింగ్‌బో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటీరియల్స్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్‌కు చెందిన శాస్త్రవేత్తలు చంద్రుడి ఉపరితలం నుంచి సేకరించిన మట్టి నుంచి నీటిని వెలికితీశారు. చాంగ్ ఈ-5 మిషన్‌లో భాగంగా చంద్రుడి ఉపరితలం నుంచి తెచ్చిన మట్టిని 1,200 కెల్విన్‌కు పైగా వేడి చేసి, ప్రత్యేకమైన ప్రక్రియ ద్వారా నీటిని తీసినట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. ఒక టన్ను మట్టితో దాదాపు 500 లీటర్ల తాగునీటిని తయారుచేయవచ్చని వీరు పేర్కొన్నారు. చంద్రుడిపై మట్టి నుంచి తయారుచేసిన నీటిని హైడ్రోజెన్, ఆక్సిజన్‌గా కూడా వేరు చేయవచ్చని శాస్త్రవేత్తలు చెప్పారు.

భారత్‌లో టెలిగ్రామ్‌పై నిషేధం?

న్యూఢిల్లీ, ఆగస్టు 26: ప్రముఖ మెసేజింగ్ యాప్‌లలో ఒకటైన టెలిగ్రామ్ భారత్‌లో నిషేధానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. మోసాలు, జూదం వంటి అక్రమ కార్యకలాపాలకు ఈ యాప్‌ను వినియోగిస్తున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై ప్రస్తుతం హోంశాఖ, ఐటీ శాఖ సహకారంతో ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) విచారణ జరుపుతున్నది. టెలిగ్రామ్‌లో అక్రమ కార్యకలాపాలతో పాటు ఇది భారతదేశ ఐటీ నిబంధనలను పాటిస్తున్నదా అనేది విచారణలో తేలనుంది. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా టెలిగ్రామ్ పని చేస్తుందని విచారణలో వెల్లడైతే ఈ యాప్‌ను నిషేధించే అవకాశం ఉంది. కాగా, మానవ అక్రమ రవాణా, మోసాలు, సైబర్ బెదిరింపులు వంటి వాటిలో ప్రమేయం ఉందనే ఆరోపణలతో మూడు రోజుల క్రితం టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు, సీఈఓ పవెల్ దురోవ్‌ను ఫ్రెంచ్ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

బస్సులు ఆపి.. ప్రయాణికులను కాల్చేసి

- పాకిస్థాన్‌లో బలూచ్ లిబరేషన్ ఆర్మీ దుశ్చర్య
- పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన వారే లక్ష్యంగా దాడులు
- 23 మంది ప్రజలు సహా 38 మంది మృతి
- 'ఆపరేషన్ హెరాఫ్' పేరుతో మారణకాండ



బలూచిస్థాన్‌లో సాయుధులు నిప్పుపెట్టడంతో దగ్ధమైన వాహనం

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ)రెచ్చిపోయింది. 'ఆపరేషన్ హెరాఫ్' పేరుతో బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో పెద్ద ఎత్తున దాడులకు తెగబడింది. సైనిక స్థావరాలు, పోలీస్ స్టేషన్లను లక్ష్యంగా చేసుకున్నది. ఈ క్రమంలో రహదారులను ఆధీనంలోకి తీసుకొని సాధారణ ప్రయాణికులనూ హతమార్చింది. దాడుల్లో 23 మంది ప్రజలు సహా 38 మంది మరణించారు. అసిస్టెంట్ కమిషనర్ నజీబ్ కాకేర్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం ముసఖైల్ జిల్లాలోని రరాషామ్ ప్రాంతంలో పంజాబ్ - బలూచిస్థాన్ రహదారిని సాయుధులు అధీనంలోకి తీసుకున్నారు. బస్సులు, వ్యాన్లు, ట్రక్కులను కలిపి మొత్తం 22 వాహనాలను నిలిపివేసి, ప్రయాణికులను కిందకు దించేశారు. ప్రయాణికుల గుర్తింపును తనిఖీ చేసి, పంజాబ్ ప్రావిన్స్, ఖైబర్ పఖ్తుంఖ్వాకు చెందిన వారిని గుర్తించి కాల్పులు జరిపారు. కాల్పుల్లో 23 మంది మృతి చెందినట్టు గుర్తించారు. మృతుల్లో నలుగురు సైనికులు కాగా, మిగతా వారు సాధారణ ప్రజలు. కలత్ జిల్లాలో బీఎల్ఏ దాడుల్లో మరో 11 మంది మరణించగా, వీరిలో నలుగురు సాధారణ పౌరులని ఎస్సీ దష్తి తెలిపారు. ఆదివారం రాత్రి మస్తుంగ్, కలత్, పస్ని, సున్‌స్టార్ పోలీస్ స్టేషన్లపై బీఎల్ఏ కాల్పులు జరిపింది. సిబి, పంజగర్, తర్బత్ బేలా, క్వెట్టాలో గ్రెనేడ్ దాడులు చేసింది. ఈ దాడుల్లో నలుగురు భద్రతా సిబ్బంది మరణించారు.

102 మంది పాక్ జవాన్లను హతమార్చాం

బేలాలోని పాక్ ఆర్మీ క్యాంపుపై పెద్ద ఎత్తున పేలుళ్లు జరిపి 40 మంది పాక్ సైనికులను హతమార్చినట్టు బీఎల్ఏ ప్రకటించింది. ఆర్మీ స్థావరంలోని చాలా భాగాన్ని ఆధీనంలోకి తీసుకున్నట్టు వెల్లడించింది. తమ దాడుల్లో 102 మంది పాకిస్థానీ సైనికులు మరణించి పేర్కొంది. కాగా, 14 మంది తమ సైనికులు మరణించారని, 21 మంది ఉగ్రవాదులను హతమార్చామని పాక్ ఆర్మీ తెలిపింది.

మూడో ప్రపంచ యుద్ధం దిశగా వెళ్తున్నాం: ట్రంప్

వాషింగ్టన్, ఆగస్టు 26: పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం మరింత ముదురుతున్నదని, మూడో ప్రపంచ యుద్ధం సంభవించే ప్రమాదముందని అమెరికా అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూప్, ఇజ్రాయెల్ బలగాల మధ్య భీకరపోరు మొదలైన కొన్ని గంటల్లోనే ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని ఎదుర్కొనటంలో అమెరికా విధానంపై ట్రంప్ అనుమానాలు వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కాలిఫోర్నియా బీచ్‌లో హాయిగా నిద్రపోతున్నాడని మండిపడ్డారు. 'స్లీపీ జో' అంటూ 'ఎక్స్'లో సందేశాన్ని పోస్ట్ చేశారు. అమెరికా నేతలు నిద్రమత్తులో ఉన్నారని, అందువల్లే మూడో ప్రపంచ యుద్ధం ముంచుకొస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉక్రెయిన్‌పై విరుచుకుపడ్డ రష్యా

- 100కుపైగా క్షిపణులు, డ్రోన్లతో దాడి
- పలు నగరాల్లో నిలిచిన విద్యుత్తు సరఫరా



9/11 దాడులను గుర్తుతెచ్చేలా రష్యాలోని ఓ భవనంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి

కీవ్: ఉక్రెయిన్-రష్యా యుద్ధం తీవ్రరూం దాల్చింది. ఆదివారం రాత్రి నుంచి రాజధాని కీవ్ సహా ఉక్రెయిన్ నగరాలపై రష్యా సైన్యం భారీ ఎత్తున క్షిపణి, డ్రోన్లతో విరుచుకుపడుతున్నది. ఈ దాడుల్లో కనీసం నలుగురు చనిపోయారని, పదుల సంఖ్యలో తీవ్రంగా గాయపడ్డారని ఉక్రెయిన్ తెలిపింది. రాజధాని కీవ్‌పై రష్యా 100కుపైగా క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. దీంతో పౌరులు ఇండ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. ఇక్కడి మెట్రో స్టేషన్లో తలదాచుకుంటున్నారు. రష్యా క్షిపణులు, డ్రోన్లను కూల్చేందుకు యూరప్ దేశాలు ఉక్రెయిన్‌కు సాయం చేయాలని ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అభ్యర్థించారు. విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు సహా కీలక మౌలిక వసతులను రష్యా టార్గెట్ చేసిందన్నారు. దీంతో వివిధ నగరాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. మరోవైపు, 9/11 దాడులను గుర్తుతెచ్చేలా రష్యాలోని సరటోవ్‌లో 38 అంతస్థుల భవనంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి చేసింది. 2001 సెప్టెంబర్ 11న అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై అల్‌ఖైదా దాడి చేసిన విషయం తెలిసిందే.

ఢిల్లీలో కేదార్‌నాథ్ ఆలయ నిర్మాణంపై వెనక్కి

డెహ్రాడూన్, ఆగస్టు 26: కేదార్‌నాథ్ గుడిని పోలిన ఆలయాన్ని ఢిల్లీలో నిర్మించాలన్న ప్రతిపాదనపై పెద్ద ఎత్తున విమర్శలు రావటంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఢిల్లీలోని బురారీలో తలపెట్టిన ఆలయ నిర్మాణ ప్రణాళికను ఉపసంహరించుకుంటున్నట్టు కేదార్‌నాథ్ ధామ్ ఢిల్లీ ట్రస్ట్ అధ్యక్షుడు సుమన్ మిట్టల్ సోమవారం వెల్లడించారు. ఉత్తరాఖండ్ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేక వచ్చిందని, ప్రజల మత విశ్వాసాలు దెబ్బతింటాయని తాము భావిస్తున్నామని సుమన్ మిట్టల్ అన్నారు.

బుర్కినా ఫాసోలో 100 మంది ఊచకోత

దాడి చేసింది మేమే: అల్‌ఖైదా

అబుజా(నైజీరియా), ఆగస్టు 26: అంతర్యుద్ధంతో సతమతమవుతున్న బుర్కినా ఫాసోలో మళ్లీ హింస చెలరేగింది. బర్సాలోగో పట్టణం వద్ద అల్‌ఖైదాకు చెందిన జిహాదీలు ఊచకోతకు పాల్పడ్డారు. జిహాదీ గ్రూప్ జరిపిన తుపాకీ కాల్పుల్లో కనీసం 100 మంది చనిపోయారని, మృతుల్లో గ్రామస్థులు, సైనికులు ఉన్నారని ఆ ప్రాంతానికి చెందిన రీజినల్ స్పెషలిస్ట్ ఒకరు తెలిపారు. బర్సాలోగో వద్ద శనివారం భద్రతా బలగాలు, గ్రామస్థులు కలిసి కందకాలు తవ్వుతుండగా, అల్‌ఖైదాకు చెందిన జిహాదీ గ్రూప్ 'జేఎన్ఐఎమ్' ఫైటర్లు ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకొని.. కాల్పులకు తెగబడ్డారని సెక్యూరిటీ థింక్ ట్యాంక్ నిపుణుడు వాజిం నాజర్ తెలిపారు. ఈ దాడి తామే చేశామని, బర్సాలోగో పట్టణంపై పట్టుసాధించామని అల్‌ఖైదా ప్రకటించకుంది. దేశంలో సగానికిపైగా భూభాగం అక్కడి ప్రభుత్వ నియంత్రణలో లేదు. అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు వేలాది మందిని పొట్టనబెట్టుకున్నాయి. 'జిహాదీ గ్రూపుల దాడిలో సైనికులు, సామాన్య పౌరులు చనిపోయారు. వైమానిక, పదాతి దళంతో దాడిని ఎదుర్కొంటున్నాం' అని రక్షణ మంత్రి చెప్పారు.

ఉత్తర కొరియా సూసైడ్ డ్రోన్ పరీక్ష

సియోల్: రష్యాలో తయారైనదిగా చెప్తున్న సూసైడ్ డ్రోన్‌ను దేశాధినేత కిమ్ పర్యవేక్షణలో ఉత్తర కొరియా పరీక్షించినట్టు ఆ దేశ మీడియా సోమవారం పేర్కొంది. శత్రువు కదలికలపై వ్యూహాత్మక భూతల పర్యవేక్షణ, బహుళ విధ అవసరాల కోసం మరిన్ని సూసైడ్ డ్రోన్లను అభివృద్ధి, ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందని కిమ్ జోంగ్ అన్నట్టు అధికార కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.

బంగ్లాలో మళ్లీ అల్లర్లు

- విద్యార్థులు, పారామిలిటరీ సిబ్బంది మధ్య ఘర్షణ
- 50 మందికి పైగా గాయాలు

ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరుతూ సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న అన్సార్ అనే పారామిలిటరీ బలగాలు, విద్యార్థుల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. ఆందోళన చేస్తున్న అన్సార్ బలగాలు సచివాలయాన్ని ముట్టడించాయి. విద్యార్థి నాయకుడు, తాత్కాలిక ప్రభుత్వ సలహాదారు నహీద్ ఇస్లాంను సైతం బంధించినట్టు విద్యార్థులకు సమాచారం అందింది. దీంతో దాదాపు వెయ్యి మంది విద్యార్థులు కర్రలు పట్టుకొని వెళ్లారు. ఇరువర్గాల మధ్య దాడులు జరిగాయి. దాదాపు 50మంది గాయపడ్డారు. అన్సార్ రూపంలో నియంతృత్వ శక్తులు మళ్లీ వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయని, ప్రభుత్వం హామీ ఇచ్చిన తర్వాత కూడా వారు ఆందోళనలు చేపట్టడం వెనుక కుట్ర ఉందని విద్యార్థి నేత హస్నత్ అబ్దుల్లా ఆరోపించారు. అయితే, ఘర్షణకు దిగింది తమ బలగాలు కాదని, బయట నుంచి వచ్చిన వారే ఇందుకు కారణమని అన్సార్ డైరెక్టర్ తెలిపారు.

ఎన్సీ 51.. కాంగ్రెస్ 32

జమ్ముకశ్మీర్‌లో సీట్ల సర్దుబాటు

శ్రీనగర్, ఆగస్టు 26: జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ), కాంగ్రెస్ మధ్య ఎట్టకేలకు సీట్ల పంపకంపై ఓ అంగీకారం కుదిరింది. ఇక్కడ జరగనున్న ఎన్నికల్లో 51 స్థానాల్లో ఎన్సీ, 32 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేయబోతున్నట్టు ఇరు పార్టీల నేతలు సోమవారం ప్రకటించారు. మరో ఐదు స్థానాల్లో రెండు పార్టీలూ స్నేహపూర్వక పోటీకి దిగనున్నాయి. మరోవైపు, 44 మందితో తొలుత జాబితాను ప్రకటించిన బీజేపీ.. పార్టీలో వ్యతిరేకత రావడంతో దానిని ఉపసంహరించుకుంది. 16 మందితో మళ్లీ జాబితాను విడుదల చేసింది.

లద్దాఖ్‌లో ఐదు కొత్త జిల్లాలు

న్యూఢిల్లీ: కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్‌లో ఐదు కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. 'జన్స్కర్, ద్రాస్, శామ్, నుబ్ర, చాంగ్‌తంగ్ పేర్లతో ఏర్పడే కొత్త జిల్లాలు పరిపాలనను ప్రతి మూలకు తీసుకెళ్తాయి' అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. జమ్ము కశ్మీర్‌ను 2019లో విభజించి.. జమ్ముకశ్మీర్, లద్దాఖ్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చారు.


- కూలిన 35 అడుగుల శివాజీ విగ్రహం



మహారాష్ట్రలో ప్రధాని మోదీ గత ఏడాది ఆవిష్కరించిన 35 అడుగుల ఛత్రపతి శివాజీ విగ్రహం సోమవారం కుప్పకూలింది. సింధుదుర్గ్ జిల్లా రాజ్‌కోట్ కోట వద్ద ఏర్పాటుచేసిన ఈ విగ్రహం ఎలా కూలిందన్నది తెలియరాలేదు. ఈ విగ్రహ నిర్మాణంలో లోపాలున్నాయని, పనుల్లో నాణ్యత లేనందునే విగ్రహం కుప్పకూలిందని విపక్షాలు ఆరోపించాయి.

బీహార్‌లో 'స్మార్ట్' చిచ్చు!

- స్మార్ట్ మీటర్లపై పలు గ్రామాల ప్రజల నిరసన
- బిల్లు ఎక్కువగా వస్తున్నట్టు ఆరోపణలు
- గ్రామస్థులపై యంత్రాంగం ఉక్కుపాదం
- పవర్ కట్స్.. అంధకారంలో గ్రామాలు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): స్మార్ట్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా బీహార్‌లోని పలు గ్రామాల ప్రజలు నిరసనలకు దిగారు. ఈ ప్రీపెయిడ్ మీటర్లు పెట్టినప్పటి నుంచి కరెంట్ బిల్లులు రెండు, మూడు రెట్లు ఎక్కువగా వస్తున్నట్టు వాపోయారు. మీటర్లలో సమస్యలతో కరెంటు సరఫరాలో తరుచూ అంతరాయం కలుగుతున్నట్టు మండిపడ్డారు. అధికారులు వెంటనే ఈ మీటర్లను తొలగించి వాటి స్థానంలో పాత మీటర్లను బిగించాలంటూ డిమాండ్ చేశారు. ఈ మేరకు నందలాల్‌పూర్, మిల్లీచక్, బహదూర్‌పూర్, ఐనాయత్‌పూర్, రోస్‌రా, సమస్తీపూర్ తదితర గ్రామాల ప్రజలు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. నిరసనలను అణచివేయడంలో భాగంగా పలు గ్రామాలకు అధికారులు విద్యుత్తు సరఫరాను నిలిపేశారు. దీంతో ఆ గ్రామాలు రెండుమూడు రోజులుగా అంధకారంలోనే ఉండాల్సివచ్చింది. నిరసనలను అదుపులోకి తీసుకురావడానికి కరెంట్ సరఫరాను నిలిపివేయడం నిజమేనని, అయితే, తర్వాత సరఫరాను పునరుద్ధరించినట్టు విద్యుత్తుశాఖకు చెందిన ఇంజినీర్ దీపక్ చౌదరీ పేర్కొనడం గమనార్హం. బీహార్‌వ్యాప్తంగా 2024 చివరినాటికి 1,72,08,939 స్మార్ట్‌మీటర్లు బిగించాలని 2023లో సీఎం నితీశ్‌కుమార్ ఆదేశించారు. అయితే, ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతతో ఇప్పటివరకూ 40,01,215 మీటర్లను మాత్రమే అధికారులు బిగించారు. దీంతో డెడ్‌లైన్‌ను 2025కు పొడిగిస్తున్నట్టు ప్రభుత్వం తాజాగా పేర్కొంది.

ఏకపక్షంగా ముందుకెళ్లడం సరికాదు

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలు నిరసనలు చేస్తుంటే, అధికారులు కరెంటు సరఫరాను నిలిపేస్తున్నారు. ఇది అన్యాయం. ముందు స్మార్ట్‌మీటర్లపై ప్రజలు చెప్తున్న అభ్యంతరాలను ప్రభుత్వం ఓపిగ్గా వినాలి. సమస్యలను పరిష్కరించాలి. అలా చేయకుండా ఏకపక్షంగా ముందుకువెళ్లడం సరైన పద్ధతి అనిపించుకోదు.

– రజాక్, నందలాల్‌పూర్ గ్రామస్థుడు

తీరని రుణం.. రైతుల రణం





రెడ్డికుంట తండా జీపీ, సర్పంచ్ తండాలో రుణమాఫీ కాని రైతులు

విప్‌ల ఊరిలో మాఫీ ప్యాకప్!

- రామచంద్రూనాయక్ తండాలో ఏడుగురికే మాఫీ
- సర్‘పంచ్’ తండాలో 21 మందికి కట్
- బీర్ల ఊరిలో రైతులు బొక్కబోర్లా
- ‘ఆది’లోనే అన్నదాతలకు టోకరా

మహబూబాబాద్,ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ)/పెద్దవంగర: కాంగ్రెస్ ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రూనాయక్ సొంత తండాలో కేవలం 28 మంది రైతులు వ్యవసాయ రుణాలు తీసుకుంటే.. మాఫీ అయ్యింది మాత్రం ఏడుగురికే. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం రెడ్డి కుంట తండా జీపీ పరిధిలోని సర్పంచ్ తండాలో 30 మంది రైతులు ఉన్నారు. ఇందులో 28 మంది రైతులు రుణాలు తీసుకున్నారు. కొంత మంది రూ.లక్ష, మరికొందరు రూ.రెండు లక్షల లోపు రుణాలు తీసుకున్నారు. వీరిలో ఏడుగురికే రుణమాఫీ జరిగింది. మిగిలిన 21 మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ తండాలో చాలా ఇండ్లలో భార్యాభర్తలకు ఇద్దరి పేరు మీద పాస్ పుస్తకాలు ఉన్నాయి. రుణమాఫీ నిబంధనల ప్రకారం ఇద్దరిలో ఒకరికి రుణమాఫీ కావాలి. అలా కూడా రుణమాఫీ కాలేదు. మాకు ఎప్పుడు రుణమాఫీ అయితదని రైతులు మొరపెట్టుకుంటున్నారు. ఇదే తండాకు చెందిన జాటోత్ మంగమ్మ అనే మహిళ పాస్ పుస్తకంలో, బ్యాంకు ఖాతాలో, ఆధార్‌కార్డులోనూ పేర్లు సరిగానే ఉన్నాయి. ఈ లెక్కన ఈమెకు రుణమాఫీ కావాలి.. కానీ కాలేదు. బ్యాంక్, వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లి అడిగితే ఈమె ఆధార్ కార్డు నంబర్‌ను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేసి చూస్తే జాటోత్ మంగమ్మకు బదులుగా బానోత్ మంగమ్మ అని పేరు చూపిస్తున్నదని చెప్తున్నారు. దీంతో రుణమాఫీ ఆగిపోయింది.

మా ఇంట్లో ఎవరికీ రుణమాఫీ కాలేదు

నాతో పాటు నా భార్య పేరు మీదు మొత్తం 12ఎకరాల భూమి ఉంది. తొర్రూరు ఏపీజీవీబీలో ఒకరిపై రూ.1.65లక్షలు, మరొకరిపై రూ.1.70లక్షల రుణం ఉంది..ప్రతి సంవత్సరం రెన్యువల్ చేస్తూనే ఉన్నం. కేసీఆర్ ప్రభుత్వంలో ఇద్దరికి కలిపి రూ.లక్ష రుణమాఫీ అయ్యింది. మళ్లీ పైసలు తీసుకున్నం. కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెయ్యలే. మా కుటుంబంలో ఒక్కరికైనా మాఫీ చేయలేదు.

-జాటోతు దేవా, దుబ్లీ దంపతులు, సర్పంచ్ తండా



సైదాపురం.. ఆగమాగం..

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సొంతూరు సైదాపురంలో రుణమాఫీ అందని ద్రాక్షగానే మిగిలింది. మొత్తం 1,008 మంది రైతుల్లో దాదాపు 600 మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది. సర్కారు పెట్టిన అనేక కొర్రీలతోనే రుణమాఫీ జరుగడం లేదు. జాబితాలో ఉన్న వారిలో కొందరికి మాఫీ అవలేదు. దాంతో రైతులు బ్యాంకులు, రైతు వేదికలు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇంట్లో ఇద్దరిపేరునా రుణాలు ఉంటే.. రూ.2 లక్షలు దాటిందంటూ పెండింగ్‌లో పెడుతున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు మంచిగా మాఫీ చేశారని, ఈ దఫా అలా లేదని వాపోయారు. సైదాపురం గ్రామంలో ప్రభుత్వ తీరుపై కాంగ్రెస్ నేతలు సైతం విమర్శలు గుప్పిస్తున్నారు. తాము ఓట్లేస్తేనే గెలిచారని, అలాంటిది రుణమాఫీ కాకుంటే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో ఏదో ఒకటి తేల్చకుంటే రోడ్డెక్కి ఆందోళన చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

రైతులను మోసం చేస్తున్నరు



మేం బ్యాంకులో లక్షా 60 వేలు వ్యవసాయ రుణం తీసుకున్నాం. ఎప్పటికప్పుడు రెన్యువల్ చేస్తున్నాం. అయినా మాకు మాఫీ కాలేదు. మాకు రేషన్ కార్డు లేదు. రేషన్ కార్డు లేకున్నా రుణమాఫీ వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పిండు. ఇప్పుడు ఎందుకు మాఫీ చేస్తలేరు.

- బీర్ల మహేశ్, రైతు, సైదాపురం, యాదాద్రి భువనగిరి

ఇది అన్యాయం




నా పేరు మీద బ్యాంకులో లక్ష, భార్య పేరు మీద 70వేలు, కొడుకు పేరు మీద 60 వేలు ఉన్నయి. మొత్తం కలిపి రూ.2.10లక్షలు అవుతున్నదని కాబట్టి మాఫీ కావు అంటున్నరు. ఇది అన్యాయం.

- అచ్చిన వీరయ్య, రైతు, సైదాపురం, యాదాద్రి భువనగిరి

ఆది శ్రీనివాస్ స్వగ్రామంలో 60 శాతమే మాఫీ

రుద్రంగి, ఆగస్టు 26: ప్రభుత్వ మరో విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వగ్రామమైన రుద్రంగి మండల పరిధిలో 3039 మంది రైతులు రుణాలు తీసుకోగా.. 1896 మందికి మాత్రమే మాఫీ అయ్యింది. మిగిలినవాళ్లు ఎప్పుడు రుణమాఫీ జరుగుతుందా అని ఎదురుచూస్తున్నారు. రుద్రంగి రైతు బోయిని చంద్రయ్య మాట్లాడుతూ.. ‘నాకు 3.12 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. నేను రూ.98,000 లోన్ తీసుకున్నా. మొదటి విడుత జాబితాలో నా పేరు లేదు. అధికారులను అడిగితే తరువాత విడుతల్లో వస్తుందన్నరు. కానీ, మూడు లిస్టుల్లో కూడా నా పేరు రాలేదు. రుణమాఫీ జాబితా గందరగోళంగా ఉన్నది. రూ.2 లక్షలలోపు రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ దానిని విస్మరించింది’ అని పేర్కొన్నారు



బోయిని చంద్రయ్య

మాఫీలో మరో నాటకం

మొదటిపేజీ తరువాయి...

సర్వేపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా రైతులను మళ్లీ మభ్యపెట్టేందుకు ప్రభుత్వ ఎత్తుగడ అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రుణమాఫీని సాగదీయడానికో, తప్పించుకునేందుకో చేస్తున్న ప్రయత్నమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



రుణమాఫీ వచ్చిందో, రాలేదో తెలుసుకోవడానికి వచ్చిన రైతులతో కిటకిటలాడుతున్న నిజామాబాద్ జిల్లా కోటగిరిలోని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఫైల్)

మళ్లీ సర్వే ఎందుకు?

మొత్తం 42 లక్షల మంది రైతులకు గానూ 22 లక్షల మంది రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేసింది. ఇందులో పలు కారణాలతో 5.49 లక్షల మంది రైతులకు మాఫీ కాలేదని స్వయంగా మంత్రి తుమ్మల వెల్లడించారు. ఎంత మందికి రుణమాఫీ కాలేదో, వారికి ఎందుకు కాలేదో ప్రభుత్వం వద్ద సమాచారం ఉంది. అలాంటప్పుడు ఆ సమాచారం ప్రకారం బ్యాంకుల నుంచి మళ్లీ వివరాలు తెప్పించుకొని, తప్పులను సరిచేసి గంటల వ్యవధిలో రుణమాఫీ కానటువంటి రైతులకు మాఫీ చేయొచ్చు. రుణమాఫీ కాని వారి నుంచి ఇప్పటికే ప్రభుత్వం ఫిర్యాదులను స్వీకరించింది. వీటి ఆధారంగా కూడా మాఫీ చేయొచ్చు. కానీ ప్రభుత్వం ఈ రెండు పనులు చేయకుండా మళ్లీ కొత్తగా సర్వే చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే రైతుభరోసా పేరుతో ప్రత్యేక యాప్‌ను రూపొందించి ఆ యాప్‌తో రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తారట.

వారికెలా మాఫీ చేశారు?

రుణమాఫీలో భాగంగా బ్యాంకుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా 22 లక్షల మందికి ప్రభుత్వం రుణమాఫీ చేసింది. మాఫీ అయినవారి నుంచి ఇంతకు ముందు ఎలాంటి దరఖాస్తు తీసుకోనప్పుడు, కాని వారి కోసం ఇప్పుడు సర్వే ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వారికి చేసినట్టే తమకూ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సర్వేల పేరుతో రుణమాఫీలో కోత పెడితే సహించేది లేదని హెచ్చరిస్తున్నారు.

రుణ చెల్లింపుపై షరతు ఎందుకు?

రుణమాఫీలో భాగంగా రూ. 2 లక్షలకు పైనున్న రుణాలపై ప్రభుత్వం ఆంక్షలు పెట్టింది. రూ. 2 లక్షలకు పైనున్న రుణాన్ని రైతులు చెల్లిస్తే మిగతా సొమ్మును తాము చెల్లిస్తామని పేర్కొన్నది. ఈ షరతుపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. చెప్పినట్టుగా ప్రభుత్వం రూ. 2 లక్షలు మాఫీ చేస్తే పైనున్న రుణాన్ని రైతులే తమ వద్ద డబ్బు ఉన్నప్పుడు కట్టుకుంటారని చెప్తున్నారు. రైతుల నుంచి రుణం వసూలు చేసుకునే బాధ్యత రైతులదేనని అంటున్నారు. అలాంటప్పుడు ఈ కండిషన్ ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెడపై కత్తిపెట్టి పైనున్న రుణం చెల్లించాలనడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తులు బుట్టదాఖలేనా?

రుణమాఫీ కాని రైతుల నుంచి జిల్లాల్లో ప్రత్యేకంగా కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం ఫిర్యాదులు స్వీకరించింది. లక్షకు పైగా దరఖాస్తులు వచ్చినట్టు తెలిసింది. కొందరు రైతులు ఏఈవోల వద్ద కూడా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా బ్యాంకుల నుంచి రైతుల వివరాలు తీసుకొని వాళ్లకు రుణమాఫీ చేయొచ్చు. కానీ ప్రభుత్వం ఈ సులువైన మార్గాలను పక్కనపెట్టి సర్వేకే మొగ్గు చూపుతున్నది. ఈ నేపథ్యంలో లక్షల్లో స్వీకరించిన దరఖాస్తులన్నీ బుట్టదాఖలైనట్లేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సాగదీత... తప్పించుకునేందుకేనా?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 9న ప్రతి రైతుకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక మాట తప్పారు. బీఆర్‌ఎస్ పోరాటం, హరీశ్‌రావు సవాల్‌తో దిగొచ్చిన ప్రభుత్వం ఆగస్టు 15 నాటికి ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎదురుపడ్డ దేవుళ్లపై ఒట్టు పెట్టారు. కానీ ఆ మాటను కూడా నిలబెట్టుకోలేకపోయారు. ఆగస్టు 15 నాటికి రుణమాఫీ పూర్తి కాలేదని స్వయంగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అంగీకరించారు. రేవంత్‌రెడ్డి కూడా రుణమాఫీ కాలేదని ఒప్పుకొన్నారు. దీంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత మొదలైంది. ఈ నేపథ్యంలో రైతులను మభ్య పెట్టేందుకు ప్రభుత్వం మళ్లీ కొత్త కథను తెరపైకి తీసుకొచ్చింది. సర్వే పేరుతో సాగదీతకు మరో ప్రణాళిక రూపొందించింది.

పై రుణం చెల్లించాక మాఫీ కాకపోతే

రూ. 2 లక్షలుకు పైనున్న రుణాన్ని రైతులు చెల్లిస్తే రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్తున్నది. అయితే, ప్రభుత్వం చెప్పినట్టుగా అప్పోసప్పో చేసి చెల్లించాక ప్రభుత్వం రుణమాఫీ కాకపోతే పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు రైతుల నుంచి వస్తున్నాయి. మాఫీ అవుతుందన్న గ్యారెంటీ ఏంటని నిలదీస్తున్నారు.

వారికి మాఫీ చేసి.. వీరికి మాత్రం సర్వేనా?

1. రుణమాఫీకి అసలు సర్వే చేయాల్సిన అవసరం ఏమిటి? రైతులు స్వీయ ధ్రువీకరణ ఎందుకు ఇవ్వాలి? దరఖాస్తు ఎందుకు చేయాలి? ఇప్పటికే ప్రభుత్వం కొందరికి రుణమాఫీ చేసింది. వారు ఏ దరఖాస్తు చేశారని మాఫీ చేసింది? ఎలాంటి సర్వే లేకుండానే వాళ్లకు రుణమాఫీ చేసినప్పుడు ఇప్పుడు ఈ రైతులకు దరఖాస్తు తీసుకోవాల్సిన అవసరం ఏమిటి? సర్వే చేయాల్సిన అవసరం ఏమిటి? ఇప్పటికే రుణమాఫీ అయిన రైతుల మాదిరిగానే వీళ్లకు కూడా రుణమాఫీ చేయొచ్చు కదా?

2. ఓ రైతుకు బ్యాంకు రుణం ఇచ్చిందంటే అతడికి సంబంధించిన పూర్తి వివరాలు బ్యాంకు వద్ద ఉంటాయి. ఈ డాటా ఆధారంగానే ప్రభుత్వం రుణమాఫీ చేసింది. అలాంటప్పుడు ఇప్పుడు రుణమాఫీ కాని రైతుల నుంచి వివరాల సేకరించాల్సిన అవసరం ఏమిగా? అంటే వీరి వివరాలు బ్యాంకుల వద్ద లేవా? వివరాలు లేకుండానే బ్యాంకులు రైతుకు రుణాలిచ్చాయా? లేదంటే ప్రభుత్వం రుణమాఫీని సాగదీసేందుకు, ఇవ్వకుండా తప్పించుకునేందుకు ఈ డ్రామాను తెరపైకి తీసుకొచ్చిందా?

3. ఇక రూ. 2 లక్షల రుణమాఫీ కావాలంటే ఆపై రుణం చెల్లించాలని ప్రభుత్వం చెబుతున్నది. అసలు రుణమాఫీకి ఈ కండిషన్ ఎందుకు? ప్రభుత్వం చేస్తానన్న రుణమాఫీ చేయాలి. అంతేకానీ రైతులను రుణం చెల్లించాలని చెప్పే హక్కు ప్రభుత్వానికి ఎక్కడిది? ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తే పైన ఉన్న రుణం రైతుకు ఇష్టమున్నప్పుడు చెల్లించుకుంటాడు. ఒక విధంగా చెప్పాలంటే రుణం వసూలు చేసుకునే బాధ్యత బ్యాంకులది. దీనితో ప్రభుత్వానికేం సంబంధం. ఈ కండిషన్ రుణమాఫీ ఎగ్గేట్టొందుకేనా?

4. రుణమాఫీ కానటువంటి రైతుల నుంచి ఇప్పటికే ప్రభుత్వం ఫిర్యాదులు స్వీకరించింది. వీటి ఆధారంగా రైతుల వివరాలను బ్యాంకుల నుంచి తెప్పించుకొని మాఫీ చేయొచ్చు. ప్రభుత్వం ఆ పని చేయకుండా మళ్లీ కొత్తగా సర్వే చేసేందుకు నిర్ణయించింది. అంటే మొన్నటి వరకు రైతుల నుంచి తీసుకున్న ఫిర్యాదులు ఉత్తుత్తివేనా. లక్షల ఫిర్యాదులను చెత్త బుట్టలో వేసినట్లేనా?

70 కోట్లకుగానూ 42 కోట్లే మాఫీ

హనుమకొండ సబర్బన్, ఆగస్టు 26: ఆసియా ఖండంలోనే అతిపెద్దదిగా ప్రసిద్ధికెక్కిన సహకార సంఘమిది.జిల్లాలోనే ఎక్కువగా సభ్యులు కలిగిన ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘంలోని రైతులకు రుణమాఫీలో అన్యాయం జరిగింది. సొసైటీ పరిధిలో 14 పాత గ్రామపంచాయతీలు, పది కొత్త గ్రామపంచాయతీలతో కలిపి మొత్తం 24 గ్రామాల పరిధిలో 7641మంది రైతు సభ్యులున్నారు. ఇందులో ప్రభుత్వం విధించిన నిబంధనల మేరకు 6662మంది రుణమాఫీకోసం అర్హులుగా గుర్తించిన సొసైటీ ప్రభుత్వానికి జాబితాను పంపించింది. ఇదీగాకుండా మండలంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఎస్‌బీఐ శాఖలు కూడా కొనసాగుతున్నాయి. అయితే మండలంలో మెజార్టీ రైతులు ముల్కనూరు సొసైటీ నుంచే రుణాలు తీసుకున్నారు. ఇందులో లక్షలోపు రుణం అర్హులు 3526 మంది ఉండగా 3022మందికి మాఫీ లభించింది. రెండవ విడుతలో లక్షయాభైవేయిలు లోపు వారిలో 1533మంది రైతులు ఉండగా 1142మందికి మాఫీ వచ్చింది. ఇక రెండు లక్షల లోపు రుణమాఫీ అయిన మూడవ విడుతలో 985మంది అర్హులుగా ఉండగా కేవలం 577మందికే రుణమాఫీ అయినట్లుగా అధికారులు చెబుతున్నారు. సొసైటీ పంపించిన ప్రతిపాదనల ప్రకారం రూ.70.23కోట్లు రైతులకు రుణమాఫీ రావాల్సి ఉండగా కేవలం రూ.42.40 కోట్లు మాత్రమే వచ్చాయి. ఇంకా రూ. 27.65 కోట్లు రైతులకు రావాల్సి ఉన్నది.

కాలయాపనకేనా రైతుభరోసా యాప్

- రైతు జేఏసీ నేత లింగారెడ్డి



ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 26: కాలయాపన కోసమే ప్రభుత్వం రైతుభరోసా యాప్ తీసుకొచ్చిందని నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ రైతు ఐక్యకార్యాచరణ కమిటీ సభ్యుడు ఇట్టడి లింగారెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన ఆర్మూర్‌లో మీడియాతో మాట్లాడారు. యాప్‌లో రైతులు స్వీయ ధ్రువీకరణ ఇవ్వాలనడం దారుణమని అన్నారు. సిద్దుల గుట్ట సాక్షిగా 2 లక్షలలోపు రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ తరువాత రైతులను దారుణంగా మోసం చేశారని ధ్వజమెత్తారు. అర్హులందరి రుణాలను మాఫీ చేయాలని కోరారు. సెప్టెంబర్ 15లోగా రుణ సంకెళ్లు తెంచకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేఏసీ సభ్యులు ప్రభాకర్, యాదగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆ ఊళ్లో ఇద్దరికే రుణమాఫీ!

- జనగామ జిల్లా నిడిగొండ పీఏసీఎస్‌లో వెలుగులోకి..
- అప్పు చెల్లించినా బాకీ ఉన్నట్టుగా తప్పుడు రికార్డులు
- ఫోర్జరీ సంతకాలతో రైతుల పేరిట రుణాలు
- సీఈవో నిర్వాకంతో మాఫీకి దూరంగా 552 మంది



జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ గ్రామ వ్యూ

జనగామ, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పరిధిలో ఇద్దరు రైతులకే రుణమాఫీ అయింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే 554 మంది రైతులకు రూ.2.55 కోట్లు మాఫీ కావాల్సి ఉండగా కేవలం ఇద్దరి ఖాతాల్లో రూ.87 వేలు జమ అయ్యాయి. పాత అప్పు పూర్తిగా చెల్లించినా, ఇంకా బకాయి ఉన్నట్టు రికార్డుల్లో చూపడంతో 552 మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదు. నిడిగొండ పీఏసీఎస్ సీఈవో నిర్వాకం, అధికారుల పర్యవేక్షణ లోపంతో 552 మంది రైతులు ఇప్పుడు త్రిశంకు స్వర్గంలో ఉన్నారు. నిడిగొండ పీఏసీఎస్ పరిధిలో 3,760 మంది రైతులు సభ్యులుగా ఉండగా, అందులో కొందరు రైతులు రుణం తీసుకొని చెల్లించినప్పటికీ బాకీ ఉన్నట్టు, మరి కొందరు అప్పు తీసుకోకపోయినా వారి పేరిట బాకీ ఉన్నట్టు సీఈవో తప్పుడు రికార్డులు సృష్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీఏసీఎస్ పాలకవర్గం, సీఈవో కుమ్మక్కై తప్పుడు రికార్డులు సృష్టించి రూ.లక్షలు స్వాహా చేయడంతో పలువురు రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. దీంతో రైతులు పాలకవర్గంతోపాటు సీఈవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఒకే ఆధార్ నంబర్‌పై మరొకరికి రుణం

నిడిగొండ గ్రామానికి చెందిన వూరడి చంద్రమౌళి ఆధార్‌కార్డు నంబరుపై ఆయనతో పాటు మరొకరికి రూ.10 వేలు రుణం ఇచ్చినట్టు పీఏసీఎస్ రికార్డుల్లో ఉన్నది. పదేండ్ల క్రితమే అతడు అప్పు మొత్తం చెల్లించి నోడ్యూస్ సర్టిఫికెట్ తీసుకొని గ్రామంలోని ఏపీజీవీబీ బ్యాంకులో రూ.1.60 లక్షలు రుణం తీసుకున్నాడు. ఇద్దరికి ఒకే ఆధార్ నంబర్ ఉండటంతో ప్రస్తుతం అతడి పంట రుణం మాఫీ కాలేదు.

డబ్బులు రికవరీ చేయాలి



రైతుల పేరిట ఫోర్జరీ సంతకాలు చేసి లక్షలు దండుకున్న పీఏసీఎస్ సీఈవో రాజయ్య నుంచి డబ్బులు రికవరీ చేయాలి. సీఈవో అక్రమాలకు తెరలేపాడు. సాంకేతికంగా రుణమాఫీ వర్తించకుండా నష్టం చేశాడు. సీఈవోపై చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనలు చేస్తాం.

- కమలాకర్‌రెడ్డి, రైతు, నిడిగొండ,రఘునాథపల్లి, జనగామ జిల్లా

అధికారుల వల్లే మాఫీ కాలేదు



మాఫీకి అర్హత ఉన్నా, పీఏసీఎస్‌లో అప్పు తీసుకోకున్నా తీసుకున్నట్టు రికార్డుల్లో చూపించడంతో నాకు మాఫీ వర్తించలేదు. రైతుల పేరిట దొంగ సంతకాలు పెట్టి అప్పు ఇచ్చినట్టు రికార్డులు సృష్టించిన సీఈవో రూ.కోట్లు దండుకున్నాడు. ప్రభుత్వం స్పందించి సీఈవోపై చర్యలు తీసుకోవాలి. రైతులకు బేషరతుగా మాఫీ చేయాలి.

-వూరడి చంద్రమౌళి, రైతు, నిడిగొండ, రఘునాథపల్లి, జనగామ జిల్లా

గురుకులం కన్నా జైలు నయం!

- కారాగారాల టైంటేబుల్ కన్నా దారుణంగా పనివేళలు
- ఉదయం నుంచి రాత్రి వరకు 16 గంటల షెడ్యూల్
- తరగతుల్లోనే విద్యార్థుల నిద్ర.. బుర్రకెక్కని పాఠాలు

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని గురుకుల సొసైటీలన్నింటికీ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఖరారు చేసిన పనివేళలు జైలు మాన్యువల్ కన్నా దారుణంగా ఉన్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జైల్లో ఖైదీలకు వర్తింపజేసేట్టు విద్యార్థులకు టైం టేబుల్ అమలు చేయటంపై అసహనం వ్యక్తం అవుతున్నది. ఉదయం 5 గంటలకే నిద్రలేపి.. రాత్రి 9 గంటల వరకు విశ్రాంతి లేకుండా, వ్యక్తిగత సమయం ఇవ్వకుండా చేయటంతో విద్యార్థులు అలసిపోతున్నారు. దాంతో తరగతి గదుల్లో క్లాసులు జరుగుతుండగానే నిద్ర వచ్చేస్తున్నది. అటు పాఠాలు కూడా బుర్రకు ఎక్కడం లేదు. ప్రభుత్వం మార్చిన పనివేళలతో విద్యార్థులు విపరీతమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. టైం టేబుల్ అమలు ఆచరణ సాధ్యం కాదని పేర్కొంటున్నారు. అనేక గురుకులాలు ప్రైవేటు భవనాల్లోనే ఉన్నాయని, అందులో బాత్రూంలు, నీళ్లు, వంటగది తదితర వసతులు సరిపడా లేవని, బ్రేక్‌ఫాస్ట్ రెడీ అయ్యే వరకు విద్యార్థులను పరిగడుపున తరగతి గదిలో కూర్చొబెట్టి క్లాస్ చెప్పాల్సి వస్తున్నదని, తిరిగి క్లాస్ మధ్యలో బ్రేక్‌ఫాస్ట్‌కి పంపాల్సిన పరిస్థితి నెలకొన్నదని వివరిస్తున్నారు. విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనై, మానసిక స్థితిపై దెబ్బ పడుతున్నదని తెలిపారు. ప్రభుత్వం ఈ పనివేళల ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి.

పనివేళలను శాస్త్రీయంగా నిర్ణయించాలి

గురుకుల పాఠశాలల పనివేళలు విద్యార్థుల మానసిక వికాసానికి తగిన విధంగా ఉండాలని, టీచర్లు ఒత్తిడి లేకుండా పనిచేసేలా శాస్త్రీయంగా నిర్ణయించాలని టీఎస్‌యూటీఎఫ్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. ‘గురుకులాల పనివేళలు-విద్యార్థులపై ప్రభావం’ అంశంపై తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది. ఫెడరేషన్ అధ్యక్షుడు జంగయ్య అధ్యక్షతన కొనసాగిన సమావేశంలో వక్త లు మాట్లాడుతూ విద్యార్థులకు అనుగుణంగా పనివేళలను సవరించాలని డిమాం డ్ చేశారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి, కోశాధికారి లక్ష్మిరెడ్డి, టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి పాల్గొన్నారు.

గురుకులాల కామన్ టైంటేబుల్

- ఉదయం 5-5.15 గంటలకు నిద్ర లేవాలి.
- 5.15-6 గంటల వరకు యోగ, వ్యాయామం,
- 6-7 గంటల వరకు కాలకృత్యాలు
- 7-7.45 గంటల వరకు అల్పాహారం
- 7.45-8 గంటల వరకు కిచెన్ ఇన్‌స్పెక్షన్
- 8-8.15 గంటల వరకు ప్రేయర్
- 8.15 గంటల నుంచి ప్రతి 45 నిమిషాల చొప్పున 11.15 గంటల వరకు 4 క్లాసుల నిర్వహణ (10 నిమిషాల స్వల్ప విరామం)
- 11.25 గంటలకు క్లాసులు ప్రారంభం మధ్యాహ్నం 12.45 గంటల వరకు 2 క్లాసుల నిర్వహణ.
- మధ్యాహ్నం 12.45-1.30 గంటల వరకు 5, 6, 7 తరగతుల విద్యార్థులకు లంచ్
- 1.45-2.30 గంటల వరకు 5, 6, 7 తరగతుల విద్యార్థులకు పర్సనల్ టైం
- 12.45-1.25 గంటల వరకు 8వ తరగతి నుంచి ఆ పైతరగతులకు 7వ పీరియడ్
- 1.25-2.15 గంటల వరకు లంచ్
- 2.15-2.30 గంటల వరకు పైతరగతుల విద్యార్థులకు పర్సనల్ టైం
- మధ్యాహ్నం 2.30-4.30 గంటల వరకు క్లబ్ యాక్టివిటీస్, ప్రాజెక్ట్స్, కోకరిక్యులర్ యాక్టివిటీస్
- సాయంత్రం 4.30-4.45 గంటల వరకు స్నాక్స్
- సాయంత్రం 4.45-5.45 గంటల వరకు స్పోర్ట్స్
- సాయంత్రం 5.45-6 గంటల వరకు రోల్‌కాల్
- 6.15 వరకు పర్సనల్ టైం
- రాత్రి 6.15-7 గంటల వరకు డిన్నర్
- రాత్రి 9 గంటల వరకు స్టడీ అవర్స్
- ఆ తర్వాత విద్యార్థులకు నిద్రకు ఉపక్రమించాలి.

దర్శన్ రాజభోగాలకు డీకేనే బాధ్యుడు

- బీజేపీ నేత అశోక ఆరోపణ

బెంగళూరు, ఆగస్టు 26: కన్నడ నటుడు దర్శన్‌కు జైలులో విలాసవంతమైన సౌకర్యాలు కల్పించినట్టు వచ్చిన వార్తలపై బీజేపీ నేత అశోక సోమవారం విమర్శలు ఎక్కుపెట్టారు. ఇందుకు డిప్యూటీ సీఎం, కాంగ్రెస్ నేత శివకుమార్ బాధ్యుడని ఆరోపించారు. శివకుమార్ జైల్లో దర్శన్‌ను కలిసి అన్ని రకాలుగా సాయం చేయడానికి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ కేసులో ఆధారాల విధ్వంసానికి, సాక్షుల బెదిరింపుకు కుట్ర జరుగుతున్నదని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి ఆరోపించారు. మరోవైపు ఈ ఘటనకు సంబంధించి ఏడుగురు జైలు సిబ్బందిని సస్పెండ్ చేశామని.. జైలులో విచారణ జరపాలని హోంమంత్రిని ఆదేశించానని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తెలిపారు.

సర్కారుపై పోరుకు గురుకుల విద్యాజేఏసీ

- 11 సంఘాలు కలిసి ఏర్పాటు
- తక్షణమే సమస్యల పరిష్కరించాలని అల్టిమేటం

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): బదిలీలు, పదోన్నతుల్లో ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలు, ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితులు ఉండటంతో సర్కారుపై ఐక్యంగా పోరుబావుటా ఎగరేయాలని గురుకుల సొసైటీల్లోని సంఘాలు నిర్ణయించుకున్నాయి. ఈ మేరకు 11 సంఘాలు కలిసి గురుకుల విద్యాజేఏసీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించాయి. జేఏసీలో టీఎస్‌డబ్ల్యూఆర్టీఈఏ అధ్యక్షుడు సీహెచ్ బాలరాజు, స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభుదాస్, టీఎస్‌డబ్ల్యూఆర్టీయూ బాలస్వామి, ఏటీజీఆర్‌ఐఈడబ్ల్యూఏ యాదయ్య, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ చలపతి, టీటీఆర్‌ఈఐటీఏ రుషికేశ్‌కుమార్, టీఆర్‌ఈఐటీఏ గోవర్ధన్‌రెడ్డి, టీఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఝాన్సీరాణి, టీఆర్‌డీసీఈఏ సాంబలక్ష్మి, టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈటీఎల్‌ఏ ఆవుల సైదులు, పీడీ అసోసియేషన్ వీ చందర్ భాగస్వాములుగా ఉన్నారు. అంతేకాదు జేఏసీ ఆధ్వర్యంలో తక్షణం పరిష్కరించాల్సిన పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుపెట్టారు.

గురుకుల విద్యాజేఏసీ డిమాండ్లు ఇవే..

- జీవో 80కి విరుద్ధంగా, సొసైటీ మార్గదర్శాలను పట్టించుకోకుండా సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో ఇటీవల నిర్వహించిన బదిలీలు, పదోన్నతుల్లో అవకతవకలు జరిగాయి. వాటిపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించాలి. దొర్లిన తప్పులన్నీ సవరించాలి. నష్టపోయిన టీచర్లకు న్యాయం చేయాలి.
- అశాస్త్రీయంగా ఉన్న ప్రస్తుత నూతన టైం టేబుల్‌ను ఉపసంహరించుకోవాలి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటలకు టైం టేబుల్ మార్చాలి.
- నాన్‌టీచింగ్ ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్, జూనియర్ అసిస్టెంట్లకు ట్రాన్స్‌ఫర్ కౌన్సెలింగ్ ఆర్డర్లను విడుదల చేయాలి.
- జీవో 317, ప్రమోషన్స్, బదిలీలు, ఎక్సెస్ స్టాఫ్ 2 కౌన్సెలింగ్ ఇవ్వాలి.
- 317 స్టేటస్ కో తెచ్చుకున్నవాళ్లను యథాస్థానాల్లో కొనసాగించాలి. స్పౌజ్, లోకల్, విడో, మెడికల్, మెంటర్ రిటార్డెడ్, డిసెబిలిటీ కేసులను సబ్‌కమిటీ నిర్ణయం వచ్చేవరకు వారి స్థానాల్లోనే కొనసాగించాలి.
- పార్ట్‌టైం, సీవోఈలు, స్పోర్ట్స్ అకాడమీ కోచ్‌లు, స్పెషల్ స్కూల్లోని ఉద్యోగులకు సత్వరమే జీతాలు చెల్లించాలి.
- మార్చి నుంచి రిటైరైన ఉద్యోగులందరికీ పెన్షన్ బిల్లులు ఏజీ ఆఫీసుకు పంపాలి.
- బీఐఈ నిర్ణయం ప్రకారం ఆగస్టు 31లోగా ఇంటర్ అడ్మిషన్లు పూర్తి చేయాలి.
- ఇటీవల 142 మంది డిస్‌లోకేట్ అభ్యర్థులకు జారీచేసిన వార్నింగ్‌ను బేషరతుగా ఉపసంహరించుకోవాలి.
- టీజీటీ సోషల్ స్టడీస్ ఉపాధ్యాయురాలు విజయ నిర్మల సస్పెన్షన్‌ను రద్దు చేయాలి.
- ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రతి నెల 1న జీతాలు చెల్లించాలి.


మూడో ప్రపంచ యుద్ధం దిశగా వెళ్తున్నాం: ట్రంప్ › 7

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

మంగళవారం TUESDAY 27.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 83 ‖ వెల (Price) రూ.6.50

మంగళవారం, సూర్యోదయం: 6-01, సూర్యాస్తమయం: 6-33. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం కృష్ణ పక్షంతిథి: నవమి రాత్రి 1-34 వరకు. నక్షత్రం: రోహిణి పగలు 3-37 వరకు. వర్జ్యం: ఉదయం 7-44 నుంచి ఉదయం 9-19 వరకు. పునర్ వర్జ్యం: రాత్రి 9-18 నుంచి రాత్రి 10-55 వరకు. రాహుకాలం: పగలు 3-24 నుంచి సాయంత్రం 4-58 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-32 నుంచి ఉదయం 9-22 వరకు, పునర్ దుర్ముహూర్తం: రాత్రి 11-08 నుంచి రాత్రి 11-54 వరకు. అమృతకాలం: పగలు 12-28 నుంచి పగలు 2-03 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

సామాన్యుడి బతుకును కూల్చిన బుల్డోజర్





హైదరాబాద్‌లో కూల్చివేతలు కొనసాగుతున్నాయి. శేరిలింగంపల్లి మండల పరిధిలోని రాయదుర్గంలో సోమవారం జీహెచ్ఎంసీ, రెవెన్యూ, లిడ్‌క్యాప్, టీఎస్ఐఐసీ అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ మూడు నివాసాలు, ఐదు నిర్మాణాలు కూల్చివేశారు. తాత ముత్తాతల నుంచి నివాసముంటున్న పేదల ఇండ్లను సైతం బుల్డోజర్లతో కూల్చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఉదయం ఏడుగంటలకే పోలీసు బలగాలతో వచ్చిన అధికారులు ఇండ్లను కూలగొట్టడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇవి హైడ్రా కూల్చివేతలు కానప్పటికీ ఇలా అకస్మాత్తుగా వచ్చి ఇండ్లను కూల్చేయడంతో రోడ్డున పడ్డ కుటుంబాల వేదన చెప్పనలవి కాకుండా ఉన్నది. అధికారులు కూల్చివేతలు చేపట్టిన స్థలంపై కోర్టు స్టే ఉన్నది. అయినా అదేమీ పట్టని అధికారులు బాధితుల ఆక్రందనల మధ్యే ఇండ్లను కూల్చేశారు.

అధికారులు రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నరు

మా ముత్తాతలు హైదరాబాద్ టెన్నరీస్ సంస్థను స్థాపించినప్పటికే 37.08 ఎకరాల భూమి ఉన్నది. కానీ అధికారులు స్థలమంతా లిడ్‌క్యాప్‌దంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నరు. మా భూములను అన్యాయంగా, దౌర్జన్యంగా లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇంట్లో పిల్లలు, పెద్ద వయస్సు వారున్నారన్న కనీస జ్ఞానం లేకుండా ఉదయం 7 గంటలకే వచ్చి ఇండ్లు కూల్చివేశారు. రోడ్డుపై పడిగాపులు కాస్తున్నం. ప్రజాపాలనలో అధికారులు రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నరు.

- నసీర్ అలీఖాన్, బాధితుడు

హైడర్..బాద్!

సిటీ జనంలో ఎఫ్‌టీఎల్ టెన్షన్

- కంటోన్మెంట్ బోర్డు వద్ద ప్రజల బారులు
- మా భూములు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయా?
- మా అపార్ట్‌మెంట్ భద్రమేనా? అంటూ ఆరా
- లక్షలు పెట్టి కొంటే కునుకులేదని ఆవేదన

హైదరాబాద్/ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): 'సార్.. మా అపార్ట్‌మెంట్ ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందా? బఫర్‌జోన్‌లోకి వస్తుందా? చూసి చెప్పండి..' ఇవీ.. పలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న సామాన్యులు అధికారులను అడుగుతున్న ప్రశ్నలు. కొన్నిరోజులుగా హైదరాబాద్ నగరంలో హైడ్రా కొనసాగిస్తున్న కూల్చివేతలు.. చెరువుల సమీపంలోని అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్స్ కొనుగోలు చేసినవారి గుండెల్లో దడపుట్టిస్తున్నాయి. దీంతో వారు సంబంధిత కార్యాలయాలకు వెళ్లి తమ అపార్ట్‌మెంట్ల పరిస్థితి ఏమిటని ఆరా తీస్తున్నారు. సోమవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వీటికి సంబంధించిన సందేహాలే ఎక్కువగా రావడం గమనార్హం. ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీల ప్రతినిధులు కూడా వచ్చి తాము నిర్మించిన అపార్టుమెంట్లపై ఆరా తీయడం కనిపించింది. ఇదే విధంగా జీహెచ్ఎంసీ, › 2వ పేజీలో



నన్ను కాల్చండి.. కానీ కాలేజీని కూల్చొద్దు

- విద్యాభివృద్ధి కృషికి అడ్డుపడకండి
- కూల్చితే కుతుబ్ మినార్ కంటే ఎత్తయిన భవనాలు నిర్మిస్తా
- హైడ్రాపై ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు › 2

● మరి మంత్రి సౌధం మీదికి సాగలేదేమి?



'ప్రభుత్వ భాగస్వాములకూ ఫాంహౌస్‌లు ఉన్నాయి. నాపై ఎన్నో ఒత్తిళ్లు ఉన్నా ఎవర్నీ వదలను. మిత్రుల ఫాంహౌస్‌లు ఉన్నా తొలగించేందుకే హైడ్రాను ఏర్పాటు చేశా'.. ఈ నెల 25న సీఎం రేవంత్ రెడ్డి మాట ఇది.

'కొత్త టేపులు తెచ్చి కొలుచుకోండి. నా ఫాంహౌస్ ఎఫ్‌టీఎల్‌లోనో, బఫర్ జోన్‌లోనో ఉంటే కూల్చుకోండి. ఒక్క ఇటుక పెళ్ల ఉన్నా వెంటనే పడగొట్టండి. దిస్ ఈజ్ మై చాలెంజ్. ఈ వేదికపై నుంచి హైడ్రా అధికారి రంగనాథ్‌ను కూడా ఆదేశిస్తున్నా'.. ఈ నెల 24న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చాలెంజ్ ఇది.

ఎవర్నీ వదిలేదని రేవంత్‌రెడ్డి అన్నా.. తన ఇల్లు బఫర్ జోన్లో ఉంటే కూల్చేయండి అంటూ ఆయన మంత్రివర్గ సహచరుడు పొంగులేటి ఆదేశించినా.. హైడ్రా అటువైపే పోలె. కానీ, ఏ నోటీసు ఇవ్వకుండానే సామాన్యుడి ఇంటి మీదికి మాత్రం బుల్డోజర్ వచ్చింది. 40 ఏండ్లుగా ఉంటున్న పెంకుటిల్లును మాత్రం కూలగొట్టింది.

ఏది ఎఫ్‌టీఎల్, ఏదీ బఫర్? ఏది ప్రొహిబిటెడ్ జోన్, ఏది రిస్ట్రిక్టెడ్ జోన్? కొలతలు వేసింది ఎవరు? హద్దురాళ్లు ఎక్కడున్నాయి? ఇవేవీ తెలియకున్నా కొందరి ఇండ్లు కూలుతున్నాయి. కొందరి ఇండ్లు నిలుస్తున్నాయి. నా ఇల్లు ఎఫ్‌టీఎల్‌లోనో, బఫర్‌లోనో ఉంటే కూల్చుకోండి అంటూ సవాల్ విసిరిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. ఎఫ్‌టీఎల్‌కు అర కిలోమీటర్ దాకా నిర్మాణాలకు నిషిద్ధ ప్రాంతమే! అంటూ నమస్తే తెలంగాణ బయటపెట్టిన మెమోపై మాత్రం నోరువిప్పలేదు. నదిపై నిర్మించిన జలాశయాల వద్ద నిర్మాణ అనుమతులకు సంబంధించి 2012లో ప్రభుత్వం తెచ్చిన 168 జీవోనూ 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చింది. దీనిపైనా సీఎం సహా మంత్రులెవరూ కిమ్మనలేదు. మరి 500 మీటర్లలోపు నిర్మాణాలు సక్రమమా? అక్రమమా? ఆ ఇండ్లు బఫర్ జోన్‌లో ఉన్నట్టా? లేనట్టా? ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్టా? లేనట్టా? నిర్మాణాలు సక్రమమైతే సర్వే చేసి నిర్ధారించి, బహిరంగ ప్రకటన చేయొచ్చుగా? అక్రమమైతే హైడ్రా రంగంలోకి దిగదెందుకు? హైడ్రా తన పరిధి దాటి కూడా గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు అక్రమమంటూ కొన్నింటిని కూల్చివేసింది. మరి మిగతా వాటిని ఎందుకు వదిలిపెట్టినట్టు? ముఖ్యంగా నిబంధనల ప్రకారం తన నిర్మాణాలు లేనట్టయితే కూల్చుకోండి అని మంత్రి పొంగులేటి ఆఫర్ ఇచ్చినా హైడ్రా రంగంలోకి దిగేందుకు ఏ శక్తి అడ్డుకుంటున్నది?


డబ్బుల డైవర్షన్?

మహారాష్ట్ర ఎన్నికల కోసమేనా!

- ఢిల్లీ టార్గెట్ కోసమే.. నిర్మాణాలను టార్గెట్ చేశారా?
- ఆర్థికం, ఆధిపత్యం.. స్వామికార్యం, స్వకార్యం!
- ఓ ముఖ్యనేత వ్యూహం.. ఒకే దెబ్బకు అనేక పిట్టలు!

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నాయకత్వం ఎందుకు కూల్చివేతల పర్వానికి తెరలేపింది? ఎందుకంత రిస్క్ తీసుకుంటున్నది? డైవర్షన్ టాక్టిక్స్‌లో భాగంగానే కాంగ్రెస్ ముఖ్యులు ఈ కూల్చివేతలను మొదలుపెట్టినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ప్రధానంగా రెండు రకాల డైవర్షన్ల గురించి వారు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఒకటి.. రాష్ట్రంలో కొంతకాలంగా ప్రజాపరిపాలన స్తంభించిందంటూ, గ్రాఫ్ పడిపోతున్నదంటూ వార్తలు వెలువడ్డాయి. దానికి బలాన్ని చేకూరుస్తూ నిరుద్యోగుల ఆందోళన, రుణమాఫీ గొడవ.. రోజూ ఏదో ఒక వర్గం రోడ్డుమీదికి వస్తున్నది. నిరసనలు నిత్యకృత్యమైన ఈ దశలో ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ నాయకత్వం కూల్చివేతల ఎత్తుగడను ఎంచుకున్నారనేది రాజకీయ వర్గాలు చెప్తున్నమాట. ఇది కేవలం ప్రజల దృష్టిమళ్లించేందుకే కాదని, దీని వెనుక మరో డైవర్షన్ కూడా ఉన్నదని › 2వ పేజీలో





పట్టా భూముల్లోని ఇండ్లను కూల్చేస్తారా?

- విస్మయాన్ని వ్యక్తం చేసిన హైకోర్టు › 2
- అధికారుల సమన్వయలోపంపై గుస్సా

పేటీఎం బాస్‌కు సెబీ షోకాజ్ నోటీసు › 8

సీఎంఆర్‌ఎఫ్‌పై సీఐడీ

- నకిలీ బిల్లులతో ప్రైవేట్ దవాఖానల భారీ స్కామ్
- 28 ప్రైవేట్ దవాఖానలపై చర్యలకు సీఐడీ సిద్ధం › 10

ఇంటికి ఇద్దరికి విష జ్వరం



ములుగు ప్రభుత్వ దవాఖానలో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులు

రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి › 3

డెంగ్యూతో ప్రజలు చనిపోతున్నారు.. నిజాల్ని దాచిపెడ్తున్న సర్కారు: కేటీఆర్

- రాష్ట్రంలో విజృంభిస్తున్న డెంగ్యూ జ్వరాలు
- ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలు కిటకిట
- సర్కారు దవాఖానల్లో మందుల కొరత
- 600 కోట్ల మందుల బిల్లులు పెండింగ్?
- కేసులపై డీపీహెచ్‌వో తప్పుడు లెక్కలు
- డెంగ్యూ మరణాల్లేవు : వైద్యారోగ్యశాఖ

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): జ్వరాలతో తెలంగాణ అల్లాడుతున్నది. ప్రభుత్వం ముందుచూపు లేకపోవడం.. వైద్య, ఆరోగ్య శాఖకు 'మందుల'చూపు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా, ఇతర విష జ్వరాల విజృంభణతో ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలు నిండిపోయాయి. ప్రభుత్వ దవాఖానల్లో ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులకు చికిత్స › 3వ పేజీలో

ప్రభుత్వంపై పోరుకు గురుకుల జేఏసీ

11 సంఘాలు కలిసి ఏర్పాటు

- బదిలీలు, పదోన్నతుల్లో అక్రమాలను సవరించాలి
- సస్పెండ్ చేసిన టీచర్‌ను విధుల్లోకి తీసుకోవాలి
- తక్షణమే సమస్యలు పరిష్కరించాలని అల్టిమేటం › 6

గురుకులం కన్నా జైలు నయం!

- కారాగారాల టైంటేబుల్ కన్నా దారుణంగా పనివేళలు
- ఉదయం నుంచి రాత్రి వరకు 16 గంటల షెడ్యూల్
- తరగతుల్లోనే విద్యార్థుల నిద్ర.. బుర్రకెక్కని పాఠాలు
- కరువైన వ్యక్తిగత సమయం.. తీవ్ర మానసిక ఒత్తిడి

› 6



తేలుకుట్టిన దొంగలు

ముఠా మోసాలు... నేతల వేషాలు

పోలీసు వర్గాల్లో ఆసక్తికర చర్చ

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): 'కేసు మా వాడి మీద కూడా పెట్టండి' అని ఒకరు ఒత్తిడి తెస్తే, 'ముందు ఆయన సంగతి తేల్చాకే నా దాకా రండి' అని ఇంకొకరు ఒత్తిడి చేస్తారు. ఇద్దరూ అధికార పార్టీ ముఖ్యులే! దీంతో ఏం చేయాలో తెలియక పోలీసు ఉన్నతాధికారులు తలలు పట్టుకున్నారు. అధికార పార్టీ ముఖ్య నేతల మధ్య విభేదాలు ఇప్పుడు సిటీ పోలీసు ఉన్నతాధికారవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దాదాపు వారం రోజుల క్రితం మల్కాజిగిరి ప్రాంతంలో జరిగిన సంఘటనే దీనికి కారణం. విశ్వసనీయవర్గాలు వెల్లడించిన సమాచారం ప్రకారం... మల్కాజిగిరి-ఘట్‌కేసర్ ప్రాంతాల్లో, ఒక వ్యక్తి ఒక ముఠాను ఏర్పాటు చేసుకుని, ప్రజలను మోసగిస్తున్నట్టు వారం పది రోజుల క్రితం ఎస్‌వోటీ పోలీసుల దృష్టికి వచ్చింది. వారు ఆ ముఠాపై నిఘా వేసి ఉంచారు. ఫుడ్ కార్పొరేషన్‌లో ఉద్యోగం పెట్టిస్తానని, డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇప్పిస్తానని, గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న వారిని బదిలీ చేయిస్తానని చెప్తూ ఈ ముఠా 1.29 కోట్ల మేర మోసాలకు పాల్పడినట్టు ఎస్‌వోటీ పోలీసుల విచారణలో తేలింది. రాష్ట్ర ప్రభుత్వంలో పెద్దలకు సన్నిహితుడైన ఒక వ్యక్తి పేరును, › 5వ పేజీలో

మాఫీలో మరో నాటకం



- రుణమాఫీలో ప్రభుత్వం డైవర్షన్ డ్రామా
- సర్వే పేరుతో సర్కారు మరో కొత్త కథ
- రైతుల నుంచి కొత్తగా వివరాల సేకరణ
- ఏ సర్వే ప్రకారం ఇప్పటి వరకు మాఫీ?
- బ్యాంకుల వద్ద ఇప్పటికే రైతుల వివరాలు
- మాఫీని సాగదీసేందుకేనని అనుమానాలు
- 'హైడ్రా'తో ప్రజలను ఏమార్చలేక డ్రామా

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): అరకొర రుణమాఫీ చేసిన ప్రభుత్వంపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. దీని నుంచి తప్పించుకునేందుకు, కప్పిపుచ్చేందుకు ప్రభుత్వం తెలివిగా డైవర్షన్ పాలి'ట్రిక్స్'ను ప్రయోగిస్తున్నది. ఇందులో భాగంగానే నిన్న మొన్నటి వరకు అక్రమ నిర్మాణాల కూల్చివేత అంటూ 'హైడ్రా' పేరుతో పెద్ద డ్రామానే రక్తికట్టించింది. ఈ నాటకాన్ని ప్రజలు నమ్మలేదు. దీంతో మరో కొత్త నాటకానికి ప్రభుత్వం తెరలేపింది. రుణమాఫీ కాని రైతులకు కుటుంబ నిర్ధారణ కోసం ప్రత్యేక సర్వే పేరుతో మరో డ్రామాను మొదలుపెట్టింది. ప్రత్యేక యాప్‌తో మంగళవారం నుంచి సర్వే చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఈ › 6వ పేజీలో

పొంగులేటి కంపెనీకి 4,495 కోట్ల పనులు

- ఎగ్జింబ్యాంకుపై సోషల్ మీడియాలో చర్చ
- బ్యాంకు పూర్వాపరాలపై నెటిజన్ల ఆరా

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం రూ.4,495 కోట్ల పనులు దక్కించుకున్నది. ఇందులో ఏపీఎస్పీడీసీఎల్ కింద రూ.2,451 కోట్ల పనులు దక్కించుకోగా, ఏపీఈపీడీసీఎల్ నుంచి 2,043 కోట్ల పనులు చేపట్టింది. ఎస్పీడీసీఎల్ తరఫున నెల్లూరు, తిరుపతిలో, ఈపీడీసీఎల్ తరఫున శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంతోపాటు మరో ఐదు జిల్లాల్లో కేబుల్ పనులు చేయాల్సి ఉన్నది. ఈ పనులకు సంబంధించి రెండు సంస్థల నుంచి మొత్తం రూ.217.71 కోట్ల మేర అడ్వాన్స్‌లు తీసుకున్నట్టు తెలిసింది. దీనికితోడు ఇప్పటి వరకు ఏపీఎస్పీడీసీఎల్ నుంచి › 5వ పేజీలో

ఆర్టీసీలో జంగ్ సైరన్

- నేడు నల్లబ్యాడ్జీలతో రాష్ట్రవ్యాప్త నిరసన
- పాల్గొననున్న 35 వేల మంది కార్మికులు
- హామీలు అమలు చేయాలని డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేయాలని ఆర్టీసీ కార్మికులు జంగ్ సైరన్ మోగించారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 95 డిపోల పరిధిలో దాదాపు 35వేల మంది కార్మికులు కార్యక్రమంలో పాల్గొననున్నట్టు ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, కన్వీనర్ మౌలానా, కో కన్వీనర్ యాదయ్య వెల్లడించారు. ఆర్టీసీ జేఏసీ పిలుపుమేరకు ఎంజీబీఎస్ గౌలిగూడ బస్‌స్టేషన్‌లో ఉదయం 7 నుంచి 9గంటల వరకు, 10 నుంచి 11:30 గంటల వరకు తార్నాక దవాఖానలో, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు సికింద్రాబాద్ › 10వ పేజీలో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN | Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird kg	Dressed with Skin kg
₹ 64	109	190
	Retail Live Bird kg	Skin Less kg
	131	216

Conditions Apply. Issued in the interest of consumers

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

పింఛన్‌పై మధ్యేమార్గం

ఉద్యోగులు వ్యతిరేకిస్తున్న నూతన పింఛన్ పథకం (ఎన్‌పీస్) స్థానంలో కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి పింఛన్ పథకాన్ని (యూపీఎస్) ప్రవేశపెట్టింది. పాతకొత్తల మేలు కలయిక లాంటి ఈ కొత్త పథకంలో ఉద్యోగుల డిమాండ్లు, ద్రవ్య పొదుపు సూత్రాల మధ్య సమతూకం పాటిస్తూ మధ్యేమార్గం అనుసరించిందని చెప్పాలి. పదవీ విరమణకు ముందరి 12 మాసాల వేతన సగటులో 50 శాతం పింఛన్‌కు యూపీఎస్ హామీ ఇస్తున్నది. అదేవిధంగా కనీసం పదేండ్లు పనిచేసిన వారికి రూ.10 వేల కనీస పింఛన్ లభిస్తుంది. ఎన్‌పీఎస్ పథకంలో 14 శాతంగా ఉన్న కేంద్రం వాటా యూపీఎస్‌లో 18.5 శాతానికి పెరుగుతుంది. 2004 జనవరి 1 తర్వాత ఉద్యోగాల్లో చేరినవారికి ప్రభుత్వం ఇదివరకు ఎన్‌పీఎస్ ప్రవేశపెట్టింది. ఉద్యోగులకు సంబంధించినంత వరకు అదొక విభజనరేఖలా తయారైంది. ఆ తేదీకి ముందు చేరినవారికి పూర్తి పింఛన్ వస్తుంది. అంటే, వారి చివరి జీతంలో సగం మొత్తం అన్నమాట. దీన్నే పాత పింఛన్ పథకం (ఓపీఎస్) అని పిలుస్తున్నారు. తర్వాత చేరినవారికి ఎన్‌పీఎస్ కింద వారి నెలజీతం నుంచి మినహాయించుకున్న మొత్తం మేరకే పింఛన్ వస్తుంది. అది ఓపీఎస్ కన్నా చాలా తక్కువ మొత్తం అవుతుంది.

సహజంగానే ఉద్యోగుల్లో ఎన్‌పీఎస్ పథకం పట్ల మొదటినుంచీ వ్యతిరేకత మొదలైంది. పాత పింఛన్ పునరుద్ధరించాలనేది వారి ప్రధాన డిమాండ్లలో ఒకటిగా మారింది. తమ వాటా అంటూ ఏమీ లేకుండా పూర్తిగా ప్రభుత్వమే భరోసాగా ఉండే పాత విధానమే తమకు కావాలనేది వారి వైఖరి. 23 లక్షల మంది కేంద్ర ఉద్యోగులకు ఈ పథకం వర్తిస్తుంది. అది కూడా వారు ఎంచుకుంటేనే. ఒకసారి యూపీఎస్‌ను ఎంచుకుంటే ఇక వెనుకకు వెళ్లేందుకు వీలుండదు. రాష్ర్టాలు కూడా తమ ఉద్యోగుల ఎంపిక మేరకు అమలు చేయొచ్చని కేంద్రం అంటున్నది. ఓపీఎస్‌లో చివరి జీతాన్ని బట్టి పింఛన్ నిర్ణయిస్తే యూపీఎస్‌లో చివరి 12 నెలల వేతన సగటును బట్టి నిర్ణయిస్తారనేది గమనించాల్సిన విషయం. 50 శాతం ఉమ్మడి అంశమే అయినప్పటికీ, ఉద్యోగుల 10 శాతం చెల్లింపు కొనసాగుతుంది. అంటే ఓపీఎస్, ఎన్‌పీఎస్‌ల మేళవింపుగా కొత్త యూపీఎస్ ఉంటుంది. తమ వాటా చెల్లింపునే ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇది ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్నట్టు ఉందని వారంటున్నారు.

మనదేశంలో రాష్ర్టాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 2023-24 సంవత్సరంలో చెల్లించిన పింఛన్ రూ.5,22,105 కోట్లు. ఇది ఆయా రాష్ర్టాల ఆదాయంలో 6-21 శాతం మధ్యలో ఉంటుంది. ఇది మోయరాని భారమని కేంద్రం అంటున్నది. కానీ ఉద్యోగులు దీన్ని అంగీకరించడం లేదు. పింఛన్ అనేది తమకు ఆలస్యంగా చెల్లిస్తున్న వేతనమేననేది వారి వాదన. పింఛన్ అనేది ఉద్యోగి హక్కు అని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేయడం ఇక్కడ గుర్తుచేసుకోవాలి. కేంద్రం ప్రతిపాదించిన యూపీఎస్‌ను విపక్షాలు, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకిస్తుండటం గమనార్హం. ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు కేంద్రంపై పోరాటానికి సిద్ధమవుతున్నారు. విస్తృతస్థాయి రాజకీయ ఏకాభిప్రాయంతో, ఉద్యోగుల సానుకూల స్పందనతో మాత్రమే పింఛన్ మార్పులను అమలు చేయగలమని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలి.

కాంగ్రెస్.. ఓపీఎస్ ఎప్పుడు?



రావుల రాజేశం
77801 85674

'సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, ఓల్డ్ పింఛన్ విధానం (ఓపీఎస్) అమలుచేస్తాం..' కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో అభయ హస్తం కింద ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన గ్యారంటీ ఇది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు తొమ్మిది నెలలవుతున్నా ఆ దిశగా అడుగులు ముందుకు పడలేదు. దీంతో కాంగ్రెస్ పార్టీ తమను మోసం చేసిందన్న భావన ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్నది. తాజా గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో 3,69,200 మంది రెగ్యులర్ ఉద్యోగులున్నారు. వీరిలో 40 శాతం మందికిపైగా ఉద్యోగులు సీపీఎస్ విధానంతో నష్టపోతున్నారు.



2004 తర్వాత నియామకమైన వారిని సీపీఎస్ పరిధిలోకి చేర్చారు. వీరంతా సీపీఎస్‌ను రద్దుచేయాలని కోరుతున్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత ఇదే అంశంపై పలుమార్లు ముఖ్యమంత్రి సహా పలువురు మంత్రులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయింది. 'చేస్తాం.. చూస్తాం' అన్న మాటలే కానీ, ఇంతవరకు సీపీఎస్‌ను రద్దు చేసే ప్రయత్నాలేవీ సాగలేదు. దీంతో ఉద్యోగులు ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

సీపీఎస్ అనేది కేవలం ఉద్యోగి చందా ఆధారిత స్కీం. ఈ పథకంలో ఉద్యోగుల మూల వేతనం, డీఏల నుంచి ప్రతి నెలా 10 శాతం చొప్పున కట్ చేస్తారు. ప్రభుత్వం కూడా మరో 10 శాతం చందాను జమచేస్తుంది. ఈ మొత్తాన్ని ఎన్‌పీఎస్-ఎన్ఎస్‌డీఎల్‌కు బదిలీ చేస్తారు. అక్కడ ఉద్యోగికి పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నెంబర్ (ప్రాన్)లో ఈ మొత్తాన్ని జమ చేస్తున్నారు.

సీపీఎస్ రద్దు కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల ఎజెండాగా మారింది. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఉత్తర భారతానికో నిబంధన, దక్షిణ భారతదేశానికో నిబంధన అన్నట్టుగా వ్యవహరిస్తున్నది. సీపీఎస్‌ను రద్దు చేస్తామన్న హామీతోనే కాంగ్రెస్ రాజస్థాన్‌లో అధికారంలోకి వచ్చింది. ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ర్టాల్లోనూ ఇదే హామీనిచ్చింది. కాంగ్రెస్ మిత్రపక్షమైన జేఎంఎం అధికారంలో ఉన్న జార్ఖండ్‌లోనూ ఓపీఎస్‌ను అమలుచేస్తున్నారు. ఆయా రాష్ర్టాల్లో ఉద్యోగులకు పాత పింఛన్ పేమెంట్ ఆర్డర్లు సైతం ఇచ్చారు. అయితే దక్షిణాదిలోని కర్ణాటకలోనూ సీపీఎస్‌ను రద్దుచేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పటివరకూ అది నెరవేర్చలేదు. ఇదే తరహాలో తెలంగాణలో సీపీఎస్ రద్దు నినాదంతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కానీ, ఈ రెండు రాష్ర్టాల్లో సీపీఎస్‌ను రద్దు చేయకపోవడం విడ్డూరం.

కేంద్ర ప్రభుత్వం శనివారం కేబినెట్ సమావేశంలో ప్రవేశపెట్టిన భాగస్వామ్య పింఛన్ పథకం స్థానంలో కొత్తగా యూనిఫైడ్ పింఛన్ స్కీమ్ (యూపీఎస్)ను అమలుచేయాలనే నిర్ణయం పట్ల రాష్ట్ర ప్రభుత్వాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

25 ఏండ్ల సర్వీస్ పూర్తిచేసిన ఉద్యోగులకు 50 శాతం పింఛన్ గ్యారంటీ చేస్తున్నట్టు, సర్వీసులో మరణించిన కుటుంబాలకు 60 శాతం పింఛన్ ఇస్తామని ప్రకటించినప్పటికీ ఉద్యోగి నెలవారీ వేతనంలో 10 శాతం కోత విధిస్తూ చందాతో కూడిన పింఛన్ పథకాన్ని రద్దుచేసే విషయాన్ని ప్రస్తావించలేదు. దీనిపై ఉద్యోగులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌పీఎస్-యూపీఎస్ పింఛన్ విధానాన్ని ఎంచుకోవడం ఐచ్ఛికం అని పేర్కొనడంలోనే అసలు మోసం దాగున్నది. 1982 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. పింఛన్ అనేది ఉద్యోగి హక్కు. కాబట్టి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఓపీఎస్ కింద ఉద్యోగి పదవీ విరమణ తర్వాత ప్రతి నెలా సర్వీస్ పింఛన్ అందేది. ఉద్యోగి రిటైరైన చివరి నెలలో ఉన్న వేతనంలో 50 శాతం వేతనాన్ని సర్వీస్ పింఛన్ కింద ప్రభుత్వం చెల్లించేది. ఇప్పుడు 2004 తర్వాత నియామకమైన వారికి సర్వీస్ పింఛన్ అన్నదే లేదు. ఒకవేళ పింఛనర్ చనిపోతే అతని భార్యకు, దివ్యాంగులైన పిల్లలు, పెండ్లి కాని పిల్లలకు సర్వీస్ పింఛన్ అందేది. కానీ, ఇప్పుడు ఆ వెసులుబాటు కూడా లేకుండా పోయింది.

ఒక ఉద్యోగి రిటైర్ అయ్యే నెలలో 50 వేల వేతనం పొందితే, ఆ ఉద్యోగికి పాత పింఛన్ విధానంలో నెలకు రూ.25 వేల వరకు పింఛన్ అందేది. ఇది కుటుంబ పోషణకు, జీవిత చరమాంకంలో బాసటగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ భరోసానే లేకుండాపోయింది. ప్రభుత్వం పలు దఫాలుగా చెల్లించే డీఏ, పీఆర్సీ ఫిట్‌మెంట్లు పింఛనర్లకు సైతం వర్తిస్తాయి. కానీ, సీపీఎస్‌లో ఇవేవీ వర్తించవు. సీపీఎస్‌తో పింఛనర్లకు ప్రభుత్వంతో ఉన్న బంధం పూర్తిగా తెగిపోయింది.

మార్కెట్ హెచ్చుతగ్గులపైనే పింఛనర్లు ఆధారపడాల్సి వస్తుంది. పదవీ విరమణ తర్వాత కమ్యూటేషన్ కింద ఒక ఉద్యోగికి ఓపీఎస్‌లో కొన్నేండ్ల మొత్తం పింఛన్ అడ్వాన్స్‌గా పొందే వీలుంటుంది. ఇంటి నిర్మాణం, పిల్లల చదువులు, పెండ్లిండ్ల కోసం అడ్వాన్స్‌లు తీసుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ వెసులుబాటే లేకుండా పోయింది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరగా స్పందించి సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని అమలుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఒక ఉద్యోగి రిటైర్ అయ్యే నెలలో 50 వేల వేతనం పొందితే, ఆ ఉద్యోగికి పాత పింఛన్ విధానంలో నెలకు రూ.25 వేల వరకు పింఛన్ అందేది. ఇది కుటుంబ పోషణకు, జీవిత చరమాంకంలో బాసటగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ భరోసానే లేకుండాపోయింది. ప్రభుత్వం పలు దఫాలుగా చెల్లించే డీఏ, పీఆర్సీ ఫిట్‌మెంట్లు పింఛనర్లకు సైతం వర్తిస్తాయి. కానీ, సీపీఎస్‌లో ఇవేవీ వర్తించవు.



హైడ్రాజకీయం



తెలంగాణ విజయ్
94919 98702

తప్పులు చేసి వాటిని కప్పిపుచ్చుకోవటం ఆధునిక కాలంలో ఒక ఫ్యాషనైపోయింది. సహజంగా ఇలాంటి పోకడలను మనం తెరపైనే చూస్తుంటాం. కానీ, దురదృష్టవశాత్తు ఇప్పుడు మన తెలంగాణలో ప్రత్యక్షంగా చూస్తున్నాం. ప్రజల దృష్టి మళ్లించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు, పడుతున్న ఆపసోపాలు అచ్చం అలాగే ఉన్నాయి.

రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టడానికి కాంగ్రెస్ అలవికాని హామీలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఆరు గ్యారంటీల పేరిట లెక్కలేనన్ని హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని వంద రోజుల్లోనే అమలుచేస్తామని ప్రజలను మభ్యపెట్టింది. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీలను తుంగలో తొక్కింది. అయితే మొదలు 2023, డిసెంబర్ 9న 'రుణమాఫీ' చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయింది. ఆ తర్వాత రుణమాఫీ అమలు తేదీలు మారుస్తూ వచ్చింది. ఆఖరికి మూడు విడుతల్లో రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని ఏ మాత్రం నెరవేర్చుకోలేకపోయింది. 'రుణమాఫీ' తూతూ మంత్రంగా అమలు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. రైతులు ఆగ్రహానికి గురయ్యారు. రోడ్లపై ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తూ, శవయాత్రల రూపేణా ఆందోళనలు చేశారు. వీటన్నింటిని పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం 'హైడ్రా'జకీయానికి తెరలేపింది.

అక్రమ నిర్మాణాల కూల్చివేత ఆహ్వానించదగిన పరిణామం. కానీ, ఇందులోనూ రాజకీయ కోణానికి తెర దీయటమే ఆక్షేపణీయం. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను, నాయకులను మాత్రమే లక్ష్యంగా చేసుకోవటం 'హైడ్రా' వెనుక ఉన్న కుట్ర కోణాన్ని తెలియజేస్తున్నది. కాంగ్రెస్ తమ పార్టీలో చేరాలంటూ పల్లా రాజేశ్వర్‌రెడ్డి లాంటి నికార్సయిన నాయకులను బెదిరింపులకు గురిచేసింది. లొంగకపోవడంతో ఆస్తుల ధ్వంసంతోనైనా పార్టీలో చేర్చుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ హైడ్రామాకు తెరదీసింది. అసలు హైదరాబాద్‌లో చెరువులు మాయమవ్వటానికి కారకులెవరు? ఉమ్మడి రాష్ర్టాన్ని పాలించిందెవరు? సమైక్య రాష్ట్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్, టీడీపీలు కాదా? నాడు ఇష్టానుసారం చెరువులపై నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి నేడు నీతులు వల్లిస్తే జనం నమ్ముతారనుకోవటం హాస్యాస్పదం కాదా? కూల్చివేతలను సక్రమంగా అమలుచేస్తే 50 శాతం హైదరాబాద్ కనుమరుగవుతుంది. ఇది సాధ్యమా? ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తేనె తెట్టెను కదుపుతున్నాడనే చెప్పవచ్చు. చెరువుల్లో నిర్మాణాలు చేసినవారు అత్యధిక శాతం కాంగ్రెస్, టీడీపీ నేతలే. వీళ్ల నిర్మాణాలను కూల్చివేసే సాహసం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందా? అంటే చేయదనే చెప్పాలి. ఏదో నాలుగు రోజులు హడావుడి చేసి సల్లపడకపోతే అదే సంతోషం. రాష్ట్ర ప్రభుత్వంలోని మంత్రులు, ముఖ్యమంత్రి సోదరుడి ఫామ్‌హౌజ్‌లు సైతం చెరువుల ఆవరణల్లోనే ఉన్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీటిని కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేస్తుందా? అలాకాకుండా ప్రత్యర్థులను మాత్రమే టార్గెట్ చేస్తుందా? నిజంగా పారదర్శకంగా చేపడితే మాత్రం తప్పకుండా ప్రజలు స్వాగతిస్తారు, స్వాగతించాలి కూడా. కానీ, కక్ష సాధింపుల కోసమే 'హైడ్రా'ను వాడుకుంటే మాత్రం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

రాష్ట్ర ప్రజలు విష జ్వరాలతో అల్లాడుతున్నారు. డెంగ్యూ స్వైర విహారం చేస్తున్నది. చికున్ గున్యా కేసులు రోజురోజుకు అమాంతం పెరుగుతున్నాయి. ప్రభుత్వ దవాఖానల్లో సౌకర్యాలు లేక, మంచాలు దొరకక మనుషులు పిట్టల్లా రాలిపోతున్నారు. రాష్ట్రంలో ఇంత తతంగం జరుగుతున్నా ఏలికలు మాత్రం కనీసం ఒక సమీక్ష జరిపిన పాపాన పోలేదు. ఇక సంక్షేమ గురుకులాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. విద్యార్థులు పాము కాట్లకు గురవుతున్నారు. కలుషిత ఆహారంతో విద్యార్థులు దవాఖానల పాలవుతున్నారు. మహిళలపై జరుగుతున్న హత్యాచారాలు శాంతిభద్రతల్లో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరూపిస్తున్నాయి.

ఇలా.. రాష్ట్రంలో సమస్యలు రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఆ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు రోడ్డెక్కి నిరసనలు తెలియజేస్తున్నారు. ఈ ఘటనలు మీడియా కంట పడకుండా 'హైడ్రా' పేరిట కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తున్నది. అందులో భాగంగానే ఈ మళ్లింపు రాజకీయాలు. అయితే, కర్ణాటకలో జరిగిన వాల్మీకి స్కామ్‌లో తెలంగాణ కాంగ్రెస్ నాయకుల హస్తం ఉన్నదంటూ వార్తలు, ఊహాగానాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ 'హైడ్రా' మాకు ఫుల్‌స్టాప్ పడుతుందనే చర్చ ప్రజల్లో ఇప్పటికే మొదలైంది. ఆ ఇష్యూను డైవర్ట్ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ దిశగా అడుగులు వేస్తారో చూడాల్సి ఉన్నది. ఈ మళ్లింపు రాజకీయాలను ప్రజలు గమనించడం లేదని కాంగ్రెస్ నాయకులు భ్రమ పడుతున్నారు. కానీ, తెలంగాణ ప్రజలు తెలివైనోళ్లు. ఏకంగా కాంగ్రెస్ పార్టీనే డైవర్ట్ చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఆ పరిస్థితి రాకుండా చూసుకోవాల్సింది కాంగ్రెస్ పార్టీయే.

నాటి నెత్తుటి రోజులు మళ్లా తెస్తరా?



వర్ధెల్లి వెంకటేశ్వర్లు

మొన్నటి పొద్దు, ఆగస్టు 22. పాత్రికేయ లోకానికో దుర్దినం. పాలక వికృతిని ఎత్తిచూపిన పాత్రికేయం మీద గుండాలు తెగబడ్డ రోజు. రాజ్య కర్కశం మీద అక్షరాయుధాలు సంధించిన జర్నలిస్టులను పాలకులు పగబట్టిన దినం. తెలంగాణ తొలితరం పాత్రికేయుడు షోయబుల్లా ఖాన్ చేతులు తెగనరికి, ఆయన్ను హత్య చేసింది ఆగస్టు 22నే. 'ఉనే నహీ లిఖ్నా.. లిఖ్తేసో హాతోన్కో కాడ్డో' అని నిజాం రాజు తాబేదారు ఖాసీం రజ్వీ 1948లో ఆగస్టు 19న హుకుం వేస్తే... ఆగస్టు 22 తెల్లవారుజాము కల్లా షోయబ్ కుడిచేతిని నరికి దారుణంగా హత్య చేశారు.

కాంగ్రెస్ శిబిరం ఎత్తుకున్న ఓ పాట ఎన్నికల్లో జనంలోకి బాగా వెళ్లింది. 'మూడు రంగుల జెండా పట్టి.. సింగమోలే కదిలినాడు' అనే పల్లవితో మొదలై.. 'ఆనాటి రోజులు తెస్తాడు..' అనే చరణంతో సాగుతుంది ఆ పాట. నల్లగొండ గద్దర్ జీవం పోసిన ఆ పాటకు పల్లె ఊగింది. ఆకట్టుకునే జానపద బాణికి జనం పడిపోయారు. అటు రాజకీయ వ్యూహకర్తల పాచిక.. ఇటు పాట కలగలిసి జనం కండ్ల చుట్టూ త్రిశంకు పొరల్లా అల్లుకున్నయి. నిలబడి ఓట్లు గుద్దేశారు. కాంగ్రెస్ పార్టీని అందలమెక్కించారు. ఇక అక్కడి నుంచి కాలచక్రం గిర్రున తిరిగింది. వెలుగు దివ్వెలను తడుముకుంటూ అభివృద్ధి పథంలోకి కాదు, చీకట్లను పులుముకుంటూ తిరోగమనంలోకి జారింది. అటునుంచి అటే తిరిగి ఆనాటి ఆగస్టు 22ను వాపస్ తీసుకొచ్చింది. మళ్లీ అదేరోజున జర్నలిస్టుల మీద దాడికి తెగబడటం కాకతాళీయమే అయినా.. ఏమరుపాటు మాత్రం కాదు. పక్కా పథకం ప్రకారమే జరిగిన దాడి. ప్రభుత్వ పెద్దల ప్రోద్బలంతోనే జరిగిన దాడి. రాజ్యం ప్రేరేపించిన దాడి.

ఒకవైపు పంట రుణాలన్నీ మాఫీ చేశామని సర్కారు ఊదరగొడుతున్నది. మరోవైపు తమ రుణాలు మాఫీ కాలేదని రైతాంగం ఎదలు బాదుకుంటున్నది. వేలమంది రోడ్లమీదికొచ్చి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నరు. అది 41 లక్షల మంది అన్నదాతల భవిష్యత్తు సాగు సంకటం. ఈ నేపథ్యంలో మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డి ప్రజల్లోకి వెళ్లి పాలనా తీరుకు అద్దం పట్టే ప్రయత్నం చేసిండ్రు. వాస్తవ పరిస్థితి అంచనా కోసం ముఖ్యమంత్రి సొంతూరు కొండారెడ్డిపల్లి వెళ్లిండ్రు. అది జర్నలిస్టులుగా వారి కర్తవ్యం. దీనికే పాలకుల కడుపు మండింది. దాడికి పూనుకున్నారు. ఆ ఊరిలో నిజంగా సంపూర్ణ రుణమాఫీ అయినట్టయితే.. జర్నలిస్టులను సాదరంగా ఆహ్వానించి, 'ఇదీ మా ఘనత' అని తొడగొట్టి ప్రపంచానికి చాటొచ్చు. 'ఇక రాజకీయాలు వదిలెయ్ కేటీఆర్.. నువ్వు రాజీనామా చెయ్ హరీశ్‌రావు' అని జనం నుంచే డిమాండ్ పెట్టొచ్చు. ఇది చేయకపోగా మహిళలనే సోయి లేకుండా మూకదాడికి తెగబడటం నీతిమాలినతనం.

ఇదే రోజున జరిగిన మరో ఘటన.. రుణమాఫీ కోసం రోడ్డెక్కిన రైతుల మీద రాళ్ల దాడి. అది తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో జరిగింది. సోషల్ మీడియాలో వైరలైన వీడియోలను చూస్తుంటే.. గతం కండ్లలో మెదిలింది. మా ఊరు కర్విరాల కొత్తగూడెం. తుంగతుర్తి నియోజకవర్గం. ఇక్కడ బతకాలంటే బండయినా కొట్టి పొట్ట పోసుకోవాలే.. లేదంటే రాజకీయ హత్యలు చేసైనా పూట




గడుపుకోవాలె. రాయలసీమ జిల్లాలను మించిన కరువు, రాజకీయ ఫ్యాక్షనిజం తుంగతుర్తి పల్లెల్లో ఉండేది. ఎదిగిన పోరలకు పని దొరక్కపోయేది. గోటికి మీసం అందకముందే అనివార్యంగా చేతికి ఆయుధం అందేది. వేల ఎకరాల భూములున్నయి కానీ, నీళ్లు లేవు. చినుకులు కురిసి సెక్క తడిస్తే.. ఇంత ధాన్యం చేతికి వచ్చినట్టు, లేకుంటే లేదు. పూట గడవటమే గగనం. చదువుకు పొమ్మని ప్రోత్సహించే కుటుంబాలు అతి తక్కువ. ఆకలి ఉండి, అడ్డూ అదుపు లేని పోరలను రెండు ప్రధాన రాజకీయ పార్టీలు టార్గెట్ చేసేవి. ఇంత కూర పెట్టి, పావు సారా పోసి చేరదీసేవి. నాలుగు రోజులు తిరక్కుండానే చేతికి కర్రో, కత్తో ఇచ్చి వేసి రమ్మంటే ఊరు ఊరంతా రణరంగమయ్యేది. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాయలసీమలో ఫ్యాక్షన్ హత్యలు ఆగినాయి కానీ.. తుంగతుర్తి పల్లెల్లో మాత్రం రాజకీయ అరాచకాల పరంపర అట్లానే కొనసాగింది. కొత్తగూడెం, గుమ్మడవెల్లి, కుక్కడం, అన్నారం కుంటపల్లి, వెలుగుపల్లి, గోరంట్ల, సంగెం మొదలైన ఏటివతలి గ్రామాల్లో నిత్య హత్యలతో తెల్లారేది. రాజకీయ కార్పణ్యాలతో ఇక్కడి భూమి నెత్తురుతో తడిసి ప్రతీకార విత్తులు మొలిచేవి.

కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక తుంగతుర్తి బాగుపడ్డది. తన మెదడుకు పదునుపెడితే బీడుకు తడి తాకింది. కాళేశ్వరం కట్ట మీంచి తల్లి గోదారమ్మ వచ్చి నెత్తుటి కాళ్లను కడిగింది. మిషన్ కాకతీయతో ఊరూరా చెరువులు, కుంటలు నిండినయి. ప్రతి మడి తడిసింది. పల్లె పచ్చబడ్డది.. బీడు పండింది. కరువు తీరింది. ముఖ్యమంత్రిగా కేసీఆర్ తన, మన అనే భేదం లేకుండా రాజకీయ కక్షలు, కొట్లాటల మీద ఉక్కుపాదం మోపారు.

సగటు మనిషి బువ్వకు, బతుక్కు భరోసా దొరికింది. మలితరం పిల్లలు బడిబాట, పెద్దలు మడిబాట పట్టిండ్రు. రాజకీయ కార్పణ్యాలు, హత్యలు ఆగిపోయినయి. సుఖశాంతులు వెల్లివిరుస్తున్నయి. మా ప్రాంతంలో ఇది తెలంగాణ వచ్చినప్పటి కంటే గొప్ప విప్లవం. ఇది 1789 ఫ్రెంచ్ విప్లవ భావజాలం కంటే మరింత విస్తృతమైనది. దీన్ని సాధించిన నవతరం విప్లవకారుడు కేసీఆర్.

అటువంటి నియోజకవర్గంలో ఇన్నాళ్ల తర్వాత మళ్లీ రాజకీయ గొడవలు అనగానే గుండె గుభేల్‌మన్నది. ఆనాడు ఇంతే.. ఎక్కడో మండల కేంద్రంలో కొట్లాటలైతే.. అది రాత్రికిరాత్రే పడగ విప్పి పల్లెలకు విస్తరించేది. గృహ దహనాలు, లూటీలు, పంట విధ్వంసాలయ్యేవి. నెత్తుర్లు చిందేవి. ఇప్పుడు దసరా పండుగ, పంచాయతీ ఎన్నికలు కలిసి వస్తున్నయి. పెద్ద పండుగకు యమగండమే పొంచి ఉన్నది. ఆయుధ పూజ అనంతరం తంతు ఏ దారుణానికి దారితీస్తుందో..! దసరా పూజ కాడ వేటపోతును కొట్టి, తుపాకీ పేల్చటం ఆనవాయితీ. ముదిరాజులు వీరకత్తి పట్టి పోతును కొట్టి పూజ ఆరంభిస్తే.. ఊరి పెద్ద తుపాకీ పేల్చి క్రతువు ముగిస్తాడు. గ్రామాల్లో ఇది పెద్దరికపు ఆధిపత్య సింబల్. ఇగో ఈ ఈగో కోసమే ప్రతి ఊరులో రెండు గ్రూపులు మోపైతున్నయి. ఎవరి పంతం వాళ్లదే. ఎవరి ముఠా వాళ్లకే. దీనికి సర్పంచ్ ఎన్నికలు తోడు వచ్చినయి. నివురుగప్పిన నిప్పులా ఉన్న రాజకీయ కక్షలు మళ్లీ ఆనాటి పరిస్థితులకు దారితీస్తాయేమో అనే భయం నాలాంటి సగటు తుంగతుర్తి వాసిని భయపెడుతున్నది. పోలీసుల అప్రమత్తత, వారి బాధ్యతాయుతమైన విధులే మా ప్రాంతానికి ఇక రక్షక కవచం



రైతులపై నోరు పారేసుకోవద్దు



నిరాధారమైన, అవాస్తవాలతో కూడిన రెచ్చగొట్టే ఆరోపణలు చేసిన ఎంపీ కంగనా రనౌత్‌పై బీజేపీ వెంటనే చర్యలు తీసుకోవాలి. రైతుల సమస్యలపై ఆమెకు ప్రాథమిక సమాచారం, అవగాహన లేవు. ఒక ఎంపీగా ఉండి ఓ వృత్తి, వర్గంపై అహంకారపూరిత ఆరోపణలు చేయడం మంచిది కాదు.

- కుశ్వంత్ సింగ్, పంజాబ్ మాజీ సమాచార కమిషనర్



కాకతీయ కళాతోరణం లేని రాజముద్రతో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఎదుట అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

రాజముద్రలో కాకతీయ కళాతోరణం ఔట్!

వరంగల్, ఆగస్టు 26 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : రాజముద్రను అధికారులు ఇష్టారీతిగా వినియోగిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని తక్కువ చేసేలా రాజముద్రలో మార్పులు చేసే ప్రతిపాదన ముందుకు తెచ్చింది. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మాత్రం అత్యుత్సాహం చూపి రాజముద్రను మార్చారు. ఎల్ఆర్ఎస్‌పై సందేహాల నివృత్తి కోసం ప్రభుత్వం అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం హెల్ప్ డెస్క్ బ్యానర్ ఏర్పాటు చేశారు. ఇందులో తెలంగాణ రాజముద్ర మార్చేశారు. అధికారిక రాజముద్ర కాకుండా కొత్తగా చేసి పెట్టారు. అధికారులు రాజముద్రను మార్చడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం వరంగల్ చారిత్రక గొప్పదనాన్ని తెలిపేలా రాజముద్రలో కాకతీయ కళాతోరణాన్ని పెడితే, మున్సిపల్ కార్పొరేషన్ విరుద్ధంగా వ్యవహరించిందని విమర్శిస్తున్నారు. వరంగల్ నగర ఔన్నత్యాన్ని తగ్గించేలా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

• డాక్టర్ రఘురామ్‌కు ప్రతిష్టాత్మక ఐఎస్ఎస్ ఫెలోషిప్



దరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు చెందిన ప్రముఖ సర్జన్ డాక్టర్ పిల్లరిశెట్టి రఘురామ్ అంతర్జాతీయ శస్త్రచికిత్స సమాఖ్య (ఐఎస్ఎస్) ఫెలోషిప్‌ను మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో జరుగుతున్న 'వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ సర్జరీ' 50వ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘురామ్ మాట్లాడుతూ బ్రెస్ట్ శస్త్రచికిత్స విధానంలో తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. గౌరవాన్ని తన తల్లికి, మాతృదేశానికి అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. హైదరాబాద్‌లోని కిమ్స్‌లో డాక్టర్ రఘురామ్ పనిచేస్తున్నారు. దీన్ని స్వీకరించిన ఏకైక భారతీయుడిగా, భారత ఉపఖండంలోనే పిన్న వయస్కుడిగా ఆయన నిలిచారు.

ఎల్ఆర్ఎస్‌పై నాడు ఫ్రీ.. నేడు ఫీజులా?

- ముఖ్యమంత్రి రేవంత్‌కు హరీశ్‌రావు బహిరంగ లేఖ
- ప్రభుత్వ మెడలు వంచి ఉచితం చేయించే బాధ్యత బీఆర్ఎస్‌ది
- ప్రజలు ఒక్క రూపాయి కూడా కట్టొద్దు: మాజీ మంత్రి హరీశ్



హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం లే అవుట్ క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)ను ఉచితంగా అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రుణమాఫీ కాక, రైతుబంధు రాక రైతన్నలు ఆవేదన చెందుతుంటే.. విషజ్వరాలతో సామాన్యులు అల్లాడుతుంటే.. ప్రభుత్వం మాత్రం ఎల్ఆర్ఎస్ ఫీజులు వసూలు చేయాలని కలెక్టర్ నుంచి పంచాయతీ సెక్రటరీ వరకు ఉన్న యంత్రాంగంపై ఒత్తిడి చేయటం అన్యాయమని అన్నారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితం చేయాలని కోరుతూ ఆయన సీఎం రేవంత్‌కు బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖలో.. పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు రోజుకు మూడు, నాలుగుసార్లు ఫోన్ చేసి ప్రజలను వేధిస్తున్నారని, ఫీజులు చెల్లించకుంటే లే అవుట్లు రద్దు చేస్తామంటూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. డిమాండ్ నోటీసులు ఇస్తూ, టార్గెట్లు పెట్టి రూ.15 వేల కోట్లు వసూళ్లు చేయాలని ఆదేశాలివ్వటం అంటే ప్రజల రక్తమాంసాలను పీల్చడమేనని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టంచేశారు. ఆనాడు ఎల్ఆర్ఎస్ అంటే దోపిడీ అని.. ఇప్పుడు ప్రజలను దోపిడీ ఎందుకు చేస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. నాడు ఫ్రీ ఫ్రీ ఫ్రీ అని, నేడు ఫీజు ఫీజు ఫీజు అంటున్నారని.. ఓడ దాటే దాక ఓడ మల్లన్న, ఓడ దాటినంక బోడి మల్లన్న చందంగా కాంగ్రెస్ వైఖరి తేటతెల్లమవుతున్నదని ధ్వజమెత్తారు. 'అపుడు ఎల్ఆర్ఎస్‌కు ఫీజు వద్దన్న మీరు ఇప్పుడు అధికారంలోకి రాగానే అదే ఎల్ఆర్ఎస్‌తో దందా చేస్తున్నారా? అప్పుడు కట్టొద్దని ఇప్పుడు కాటు వేస్తారా? స్వయంగా మీతో సహా ప్రస్తుతం మీ క్యాబినెట్లో సహచరులుగా ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వంటి నేతల మాటలను మీకు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నా' అని లేఖలో పేర్కొన్నారు.

1. **ఉత్తమ్‌కుమార్‌రెడ్డి:** నో ఎల్ఆర్ఎస్- నో బీఆర్ఎస్, మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్క రూపాయి తీసుకోకుండా ఉచితంగా ఎల్ఆర్ఎస్ అమలు చేస్తాం.
2. **భట్టి విక్రమార్క:** రక్తాన్ని పీల్చాలన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నది. వీలైతే కట్టకండి. అప్పుల భారాన్ని ఎల్ఆర్ఎస్ రూపంలో ప్రజల మీద వేస్తున్నారు.
3. **సీతక్క:** ఎల్ఆర్ఎస్ పేరుతో దోచుకోవడానికి, దాచుకోవడానికి ప్రజల దగ్గర చిల్లి గవ్వ లేకుండా చేయడానికి కొత్త నాటకం.
4. **రేవంత్‌రెడ్డి:** బీఆర్ఎస్ అయిపోయింది. ఎల్ఆర్ఎస్ అయిపోయింది. ఎంఆర్ఎస్ తెస్తడట. ఎంఆర్ఎస్ అంటే మ్యారేజ్ రెగ్యులరైజేషన్ స్కీం కూడా తీసుకొస్తుందేమో.

ఇవి మాత్రమే కాదు, ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏకంగా హైకోర్టుకు వెళ్లారని హరీశ్‌రావు గుర్తు చేశారు. పిల్ దాఖలు చేశారని, ఎన్నికల్లో గెలిచేందుకు ప్రజలను మభ్యపెట్టి రెచ్చగొట్టేలా బహిరంగ సభల్లో ఊదరగొట్టారని, ఎన్నికలు పూర్తికాగానే మాట మార్చి ఎల్ఆర్ఎస్‌పై ఫీజులు వసూలు చేయాలని నిర్ణయం తీసుకోవడం రెండు నాల్కల ధోరణికి అద్దం పడుతుందని విమర్శించారు. ప్రజాపాలన అని డబ్బాకొట్టుకుంటున్న మీకు 25.44 లక్షల దరఖాస్తుదారుల కుటుంబాల ఆవేదన కనిపించటం లేదా? ఇప్పటికైనా కండ్లు తెరిచి హామీ ప్రకారం పూర్తి ఉచితంగా ఎల్ఆర్ఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాట తప్పిన ప్రభుత్వానికి చెంపపెట్టుగా ఏ ఒక్కరూ ఒక్క రూపాయి ఎల్ఆర్ఎస్ ఫీజు కూడా చెల్లించవద్దని రాష్ట్ర ప్రజలకు పిలుపునిస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయించే బాధ్యత బీఆర్ఎస్ తీసుకుంటుందని తేల్చిచెప్పారు.

ఇండిపెండెంట్ జర్నలిస్టులకు రక్షణేది?

- రాహుల్‌గాంధీ మీరైనా ముఖ్యమంత్రికి చెప్పండి
- ప్రజల కోసం పనిచేస్తే దాడులా?
- వాస్తవాలను వెలికితీసే వారిపై కక్ష ఎందుకు?
- తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని కాపాడండి
- ఢిల్లీలోని రాహుల్ ఇంటి వద్ద జర్నలిస్టుల నిరసన



ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న స్వతంత్ర జర్నలిస్టులు

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఇండిపెండెంట్ జర్నలిస్టులు, మీడియా సంస్థలు స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితి లేదని ఇండిపెంటెండ్ జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవాలను ప్రజల మందుంచుతున్న ఆఫీసుల ముందు నయీం గ్యాంగ్‌లతో పహారా కాయిస్తున్నారని, ఏ క్షణం దాడులు చేస్తారో తెలియక బిక్కుబిక్కుమంటున్నామని, ఈ దారుణ పరిస్థితిపై రాహుల్‌గాంధీ వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం ఢిల్లీలోని రాహుల్‌గాంధీ ఇల్లు, ఏఐసీసీ కార్యాలయం వద్ద వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్వతంత్ర జర్నలిస్టు శంకర్ మాట్లాడుతూ.. రుణమాఫీపై గ్రౌండ్ రిపోర్టు తీసుకొని.. ఉన్నది ఉన్నట్టు చెప్పే ప్రయత్నం చేస్తున్న క్రమంలోనే తమపై దాడులకు ప్రేరేపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ దొరక్కపోవటంతో ఇల్లు, ఏఐసీసీ కార్యాలయం వద్ద ఆందోళనల చేపట్టినట్టు తెలిపారు. సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో రుణమాఫీ జరిగిందా? లేదా? అని తెలుసుకునేందుకు వెళ్లిన మహిళా జర్నలిస్టులపై, తమపై దాడికి తెగబడ్డారని, 30 కిలోమీటర్ల మేర 150 కిలోమీటర్ల వేగంతో కార్లతో వెంబడించి భయభ్రాంతులకు గురిచేశారని వివరించారు. వెల్దండి పీఎస్‌కు వెళ్లి ప్రాణాలు కాపాడుకున్నట్టు వెల్లడించారు. గతంతో ఫిబ్రవరి 22న కూడా తమపై దాడి చేశారని, ఇటీవల ఓయూలో జీ తెలుగు జర్నలిస్టులు, ఇండిపెండింట్‌గా ఉన్న చిలుక ప్రవీణ్, ఆకుల శ్రీనివాస్‌రెడ్డి, సరిత, విజయారెడ్డి వంటి వారిపైనా దాడులకు తెగబడ్డారని తెలిపారు.

రాష్ట్రంలో పరిస్థితి బాగోలేదు

ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకు ప్రయత్నం చేస్తున్నాం కాబట్టే దాడులు చేస్తున్నారని జర్నలిస్టు సుంకరి ప్రవీణ్ తెలిపారు. తెలంగాణలో స్వతంత్ర జర్నలిస్టుల పరిస్థితి దారుణంగా ఉంది కాబట్టే.. ఢిల్లీ వరకు రావాల్సి వచ్చిందన్నారు. ఏ పెద్ద పనికైనా సీఎం రేవంత్‌రెడ్డి అధిష్ఠానంతో మాట్లాడేందుకు ఢిల్లీకి వస్తున్నారని, అందుకే సమస్యలు చెప్పుకునేందుకు తాము కూడా ఢిల్లీకి వచ్చినట్టు చెప్పారు. వార్తల కోసం వెళ్లిన వారిపై దాడులు చేస్తూ.. వారి ఆఫీసుల చుట్టూ రెక్కీ చేయటం దారుణమని అన్నారు. తామంతా గతంలోని మెయిన్‌స్ట్రీమ్ మీడియా సంస్థల్లో పనిచేసిన వారిమేనని చెప్పారు. మిస్ లీడింగ్ వార్తలు రాస్తే తమపై కేసులు పెట్టుకోవచ్చని ఇండిపెండెంట్ జర్నలిస్టు ప్రభాకర్ చెప్పారు. రాహుల్ తెలంగాణకు వచ్చి వీధుల్లో ప్రేమను పంచుతామని చెప్పినా.. ఆ పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం కుటుంబసభ్యులే దాడులు చేయడంతో అధిష్ఠానానికి చెప్పేందుకు ఢిల్లీ వచ్చినట్టు వివరించారు.

వినతిపత్రాలు తీసుకోని రాహుల్ ఆఫీస్

'సేవ్ తెలంగాణ జర్నలిస్టు' అంటూ ఢిల్లీ వరకు వెళ్లి ఏఐసీసీ, రాహుల్‌గాంధీ కార్యాలయాల్లో వినతి పత్రం ఇచ్చేందుకు ప్రయత్నించినా.. తీసుకునేందుకు సిబ్బంది నిరాకరించినట్టు ఇండిపెండెంట్ జర్నలిస్టులు తెలిపారు. దీంతో జంతర్‌మంతర్ వద్దకు వచ్చి నిరసన తెలిపారు. ఆ తర్వాత రాష్ట్రపతి, పీఎం కార్యాలయాల్లో మెమొరాండం ఇచ్చారు. తెలంగాణలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపై అధికారులకు వివరణ ఇచ్చారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి బంధువుల ఆగడాలు ఆపాలని, దాడులు, కక్షపూరిత చర్యలు మానుకొనే చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఇప్పటికే రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశామని, వారి ద్వారా తమకు రక్షణ కల్పించే ఏర్పాట్లు చేయాలని రాష్ట్రపతి, పీఎం కార్యాలయ అధికారులకు విన్నవించారు. నిరసనలో ఇండిపెండెంట్ జర్నలిస్టులు లింగస్వామి, ఆకుల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

20% డిపాజిట్‌పై మినహాయింపు ఇవ్వండి

- భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి పిటిషన్

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): ఆదాయ పన్నులో మినహాయింపు ఇస్తూ గతంలో ఐటీ శాఖ ఇచ్చిన ఉత్తర్వులకు విరుద్ధంగా ఇప్పుడు నోటీసులు, పన్ను మదింపు ఉత్తర్వులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ ఎన్ రాజేశ్వరరావు ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. కార్మికుల సంక్షేమ చట్టం కింద 2008లో ఈ మండలి ఏర్పాటైందని పిటిషనర్ తరపు న్యాయవాది గుర్తు చేశారు. వీటి అమలుపై స్టే ఇచ్చేందుకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు నిరాకరించడంతో పాటు మదించిన ఆదాయపన్ను మొత్తంలో 20 శాతం డిపాజిట్ చేయాలని షరతు విధించిందని చెప్పారు. డిపాజిట్‌పై మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని ఐటీ శాఖకు నోటీసు జారీచేసిన హైకోర్టు తదుపరి విచారణ 28కి వాయిదా వేసింది.



డెంగ్యూతో బాలిక మృతి

ధర్మసాగర్, ఆగస్టు 26 : డెంగ్యూ జ్వరంతో బాలిక మృతి చెందిన ఘటన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు పెసరు స్వామి కూతురు ప్రవళిక (11)కు నాలుగు రోజుల క్రితం జ్వరం వచ్చింది. చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ దవాఖానకు తీసుకెళ్లగా వైద్యులు డెంగ్యూ అని నిర్ధారించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తమ్ముడు కూడా జ్వరంతో బాధపడుతున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. గ్రామంలో చాలామందికి విషజ్వరాలు వస్తున్నాయని, వైద్యాధికారులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



చెయ్యే.. ఫ్లూయిడ్ స్టాండ్

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 26: ఎంజీఎం దవాఖానలో ఫ్లూయిడ్ హ్యాంగర్స్ లేకపోవడంతో రోగులు, అటెండెంట్లు ఇబ్బందులు పడిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఓ రోగిని కుర్చీలో కూర్చోబెట్టి సెలైన్ బాటిల్‌ను అటెండెంట్ చేతికివ్వడంతో అది ఎక్కే వరకు ఆమె అలాగే పట్టుకుని నిలబడింది. అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.




సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులు; మహబూబాబాద్ జిల్లా కొత్తతండాలో ఇంటి వద్దే చికిత్స చేయించుకుంటున్న వృద్ధురాలు

ఇంటికి ఇద్దరికి విష జ్వరం

మొదటిపేజీ తరువాయి...

అందిస్తుండగా నగరంలోని కొన్ని కార్పొరేట్ దవాఖానలు 'మా హాస్పిటల్‌లో బెడ్స్ ఖాళీగా లేవు. వేరే హాస్పిటల్‌కు వెళ్లండి' అని గేటు నుంచే వెనక్కి పంపుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. 'మేం సర్వే చేస్తున్నప్పుడు ప్రతి పది మందిలో కనీసం ముగ్గురు, నలుగురు జ్వరం ఉన్నట్టు చెప్తున్నారు' అని ఆరోగ్య సిబ్బంది వెల్లడిస్తున్నారు. అంటే ప్రతి ఇంట్లోనూ జ్వర బాధితులు కనిపిస్తున్నారు. మరోవైపు దవాఖానల్లో మందుల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ (సీడీఎస్)లో నిల్వలు అడుగంటాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.



వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని ఏజెన్సీ గ్రామమైన కొండాపూర్‌లో వైద్య సాయం అందక మంచం పట్టిన ఓ వృద్ధురాలు

ఒకే అధికారి, ఒకే రోజు రెండు తీర్ల లెక్కలు

డెంగ్యూ కేసుల లెక్కల్లో ప్రభుత్వం ప్రకటిస్తున్నదానికి, వాస్తవ పరిస్థితులకు భారీ వ్యత్యాసం ఉన్నదని మొదటి నుంచీ ఆరోపణలున్నాయి. దీన్ని నిజం చేస్తూ డీపీహెచ్ రవీందర్ నాయక్ ఒకేరోజు విడుదల చేసిన లెక్కల్లో తీవ్ర వ్యత్యాసం కనిపిస్తున్నది.

- 'నమస్తే తెలంగాణ'లో ఈ నెల 23న ప్రచురితమైన 'పడకేసిన ప్రజారోగ్యం' అనే వార్తకు డీపీహెచ్ ఈ నెల 24 వివరణ ఇచ్చారు. ఈ నెల 23 నాటికి రాష్ట్రంలో ఒక్క డెంగ్యూ మరణం నమోదు కాలేదని పేర్కొన్నారు. మొత్తం 4,459 డెంగ్యూ కేసులు నమోదైనట్టు తెలిపారు. మొత్తం 63,532 మందికి టెస్టులు నిర్వహించినట్టు చెప్పారు. కానీ ఈ నెల 24న డీపీహెచ్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాష్ట్రంలో ఆగస్టు 21 నాటికి 4,648 డెంగ్యూ కేసులు నమోదైనట్టు చెప్పారు. 66,589 టెస్టులు చేసినట్టు వెల్లడించారు.
- వాస్తవానికి 21 నుంచి 23 వరకే కేసుల సంఖ్య, టెస్టుల సంఖ్య పెరగాల్సింది పోయి తగ్గింది. 189 కేసులు తగ్గగా, టెస్టుల సంఖ్య తగ్గినట్టు చెప్తున్నారు. చేసిన టెస్టుల సంఖ్య 3057 తక్కువగా చూపారు.
- ఇదే తరహా జ్వరసర్వేలోనూ తప్పుడు వివరాలు వెల్లడిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సోమవారం నాటికి రాష్ట్రంలో 2,65,324 జ్వర కేసులు నమోదైనట్టు డీపీహెచ్ ప్రకటన విడుదల చేశారు. సర్వే సమయంలో జ్వర లక్షణాలున్నవారికి అక్కడే పారాసిటమాల్ వంటి ట్యాబ్లెట్లు ఇస్తున్నారని, తీవ్రంగా ఉన్నవారిని మాత్రమే పీహెచ్‌సీకి పంపతున్నారని చెప్పారు. పీహెచ్‌సీ, పై దవాఖానలకు వెళ్లినవారి లెక్కలు మాత్రమే అధికారికంగా నమోదు చేస్తున్నారని సమాచారం. అందుకే సంఖ్య తక్కువగా కనిపిస్తున్నదనే ఆరోపణలున్నాయి.

• డెంగ్యూ మరణాల్లేవు : వైద్యశాఖ

రాష్ట్రంలో ఈ నెల 23 నాటికి ఒక్క డెంగ్యూ మరణం కూడా నమోదు కాలేదని వైద్య,ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ నెల 23న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'పడకేసిన ప్రజారోగ్యం' కథనానికి వైద్యశాఖ వివరణ ఇచ్చింది. కథనంలో పేర్కొన్న 8 మరణాలు కూడా డెంగ్యూకు సంబంధించినవి కావని, ఇతర కారణాలతోనే రోగులు మరణించారని పేర్కొన్నది. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఈ ఏడాది మే నుంచే చర్యలు చేపట్టామని, నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, వ్యాధులు, దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఉన్నతాధికారుల బృందం రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నదని తెలిపారు.

వేధిస్తున్న మందుల కొరత

రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీల నుంచి టీచింగ్ వైద్యశాలల వరకు మందుల కొరత ఉన్నట్టు వైద్యసిబ్బంది చెప్తున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి దవాఖానలకు మందులు సరఫరా అవుతుంటాయి. కానీ, ఈ నెల 23 నాటికి సీడీఎస్‌లోనే 31 రకాల ట్యాబ్లెట్లు, 19 రకాల ఇంజిక్షన్లు, 11 సర్జికల్ ఐటమ్స్, 21 రకాల సిరప్‌లు లేవని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రధానంగా జ్వర బాధితులు, ఇతర రోగులకు దవాఖానల్లో అందించే చికిత్సలో వాడే మందులు కూడా కరువయ్యాయని చెప్తున్నారు. దీంతో దవాఖానల నుంచి ఇండెంట్లు వచ్చినా సరఫరా చేయలేక చేతులెత్తేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లుగా బఫర్ స్టాక్‌తో నెట్టుకొచ్చామని, అది కూడా అడుగంటిందని అంటున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దవాఖానల్లో 40 శాతం వరకు మందుల కొరత ఉన్నట్టు చెప్తున్నారు. 'సూపరింటెండెంట్ల ఖాతాలో ఉన్న ఆరోగ్యశ్రీ నిధుల నుంచి నెట్టుకొస్తున్నాం. అత్యవసర మందులు, పరికరాలు కొనుగోలు చేస్తున్నాం. అయినా కొరత తీరడం లేదు' అని ఓ సూపరింటెండెంట్ పేర్కొన్నారు. టీజీఎంఎస్ ఐడీసీకి మందులు సరఫరా చేసే సరఫరాదారులు, డీలర్లకు ప్రభుత్వం సుమారు రూ.600 కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టినట్టు సమాచారం. అందుకే వారు సరఫరా నిలిపివేశారని చెప్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, మందులు సరఫరా చేయాలని కోరుతున్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

రాష్ట్రంలో డెంగ్యూతో ప్రజలు చనిపోతున్నారు: కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డెంగ్యూ మరణాలే లేవని ప్రభుత్వం చెప్తున్నదని, మరో వైపు పత్రికల్లో డెంగ్యూతో ప్రజలు చనిపోతున్నారని రోజూ వార్తలు వస్తున్నాయని సోమవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. రెండు రోజుల క్రితమే డెంగ్యూ కారణంగా ఐదుగురు చనిపోయారని వార్తలు వచ్చాయని తెలిపారు. ఆదివారం కూడా మరో ముగ్గురు చనిపోయినట్టు వార్తలు చూశానని, మరి నిజాల్ని ప్రభుత్వం ఎందుకు దాచిపెడుతున్నదని ప్రశ్నించారు. దవాఖానల్లో సరిపడా మందులు కూడా లేవని పేర్కొన్నారు. ఒకే బెడ్ పై ముగ్గురు నుంచి నలుగురికి వైద్యం అందిస్తున్న పరిస్థితి ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం డెంగ్యూ సమస్య తీవ్రంగా ఉందని అంగీకరించి వెంటనే రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని కోరారు.

పిల్లలకు కుళ్లినా గుడ్లా...?

రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు కుళ్లిన గుడ్లను అందించడంపై కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. శరత్‌రెడ్డి అనే ఎక్స్ యూజర్ సోమవారం కేటీఆర్‌ను ట్యాగ్ చేస్తూ భువనగిరిలోని పెద్దవాడ సమ్మద్ చౌరస్తా అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆహారంగా కుళ్లిన గుడ్లు అందిస్తున్నట్టు పేర్కొన్నాడు. దీనిపై స్పందించిన కేటీఆర్ ఇది చాలా దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పసిపిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే ఈ సమస్యపై దృష్టి పెట్టాలని కోరారు.



సర్దార్ నగర్‌లో ఉన్న తుమ్మల చెరువు కన్పించడంలేదని పహాడీషరీఫ్ పోలీసులకు వినతిపత్రం ఇస్తున్న అందెల శ్రీరాములుయాదవ్

తుమ్మల చెరువు మిస్సింగ్!

- 8 ఎకరాల్లో మాయం అయింది
- కాస్త వెతికి పెట్టండి సారూ
- పోలీసులకు బీజేపీ నేతల ఫిర్యాదు

బడంగ్‌పేట, ఆగస్టు26: 'అలుగు ఉంది.. కానీ చెరువు ఆనవాళ్లు మచ్చుకైనా కనిపించడం లేదు. కాస్త వెతికిపెట్టండి సారూ' అంటూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని సర్దార్‌నగర్ రెవన్యూపరిధిలో 8ఎకరాల్లో ఉండే తుమ్మల చెరువు కనిపించడం లేదని పహాడీషరీఫ్ పోలీసులను ఆశ్రయించారు. చెరువు ఎక్కడ ఉందో కనిపించడంలేదని.. చెరువు అలుగు మాత్రమే కనిపిస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో తుమ్మల చెరువు కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేయడం హాట్‌టాఫిక్‌గా మారింది. ఈ సందర్భంగా అందెల శ్రీరాములు మాట్లాడుతూ మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తాళ్లచెరువు నామరూపాల్లేవని, జల్‌పల్లిలో పెద్దచెరువు భూములను నోటరీలు చేసి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. చెరువుల్లోని భూములను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. హైడ్రా పేరుతో డ్రామాలు చేయకుండా నిజాయితీగా చెరువులను చెరబట్టిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

మౌనమేల మంత్రిగారూ!?

- కొత్త టేపులు తెచ్చి కొలుచుకోండి అంటివి!
- 500 మీటర్ల నిబంధనపై మాట్లాడకపోతివి!
- 'ఎవరినీ వదిలిపెట్టబోం' అన్న హైడ్రా ఆ వైపు కన్నెత్తి చూడదేమంటూ ప్రశ్నలు
- బ్యాలెన్స్ చేసేందుకు ఇదే అవకాశమంటూ సీఎం రేవంత్‌రెడ్డికి జనం సూచనలు



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): 'కొత్త టేపులు తెచ్చి కొలుచుకోండి.. నాది, నా తమ్ముడి ఇంటి నిర్మాణం హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉంటే కూల్చుకోండి' అంటూ ఓపెన్ సవాల్ చేసి.. ఇప్పుడు మౌనం వహించారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. 500 మీటర్ల నిబంధనపై 'నమస్తే తెలంగాణ' ప్రశ్నించినా చడీచప్పుడు లేదు. ప్రస్తుతం ఉన్న గూగుల్ మ్యాప్‌లో చూస్తే నీటి నిల్వకు ఆయన ఇంటి నిర్మాణాలు చాలా దూరంగా ఉన్నాయి కదా అన్నట్టు కనిపిస్తుంది. పైగా 100 ఫీట్ల బఫర్‌జోన్ నిబంధన మాత్రమే ఉందనే అంచనాతో ఆయన ఆ వ్యాఖ్యలు చేసి ఉండొచ్చు. కానీ 2007లోనే పురపాలక శాఖ ఇచ్చిన అర కిలోమీటరు నిబంధన మెమోను 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చింది. 2012లో పురపాలక శాఖ భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన 168 జీవోను సైతం తెరపైకి తీసుకొచ్చింది. తాజాగా కొన్నేండ్ల కిందట మ్యాప్‌లను బేరీజు వేసి అసలు గుట్టురట్టు చేసింది. దీంతో మంత్రి పొంగులేటి సోదరుల నిర్మాణాలపై ప్రజల నుంచి ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. మరి వీటిపై సమాధానాలేవి?

- బఫర్‌జోన్ వరకు మాత్రమే నిర్మాణాలు నిషిద్ధం అని చర్చ జరుగుతున్న సందర్భంలో పొంగులేటి కొత్త టేపులు తెచ్చి కొలుచుకోండి.. కూల్చుకోండి అంటూ ఆఫర్ ఇచ్చారు. అంతకుమించి నిబంధనలు ఉన్నాయని వెలుగులోకి వచ్చిన తర్వాత ఎందుకు స్పందించటం లేదు?
- చెరువులకు బఫర్‌జోన్ వరకు నిబంధన ఉంటుంది. కానీ జంట జలాశయాల అంశం వేరు. దీనిపై సుప్రీంకోర్టు దాకా దశాబ్దాలపాటు విస్తృత చర్చ జరిగింది. అనేక నిపుణుల కమిటీలు అధ్యయనం చేశాయి. అనేక జీవోలు, మెమోలు జారీ అయ్యాయి. కేవలం బఫర్ జోన్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే ఎట్ల? జంట జలాశయాలకు సంబంధించి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే జారీ చేసిన ఉత్తర్వులను ఎందుకు విస్మరిస్తున్నారు?
- హైడ్రా తన పరిధి దాటి కూడా గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు కొన్నింటిని కూల్చివేసింది. మరి మిగతా వాటిని ఎందుకు వదిలిపెట్టినట్టు? నిబంధనల ప్రకారం తన నిర్మాణాలు లేనట్టయితే కూల్చుకోండి అని మంత్రి పొంగులేటి ఆఫర్ ఇచ్చినా హైడ్రా రంగంలోకి దిగేందుకు ఏ శక్తి అడ్డుకుంటున్నది?
- జలమండలి అధికారికంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నిషిద్ధ జోన్లను ఎందుకు నిర్ధారించడం లేదు? నిజంగా మంత్రి పొంగులేటి నిర్మాణాలు ఆ పరిధిలోకి రానట్టయితే సర్వే చేసి నిర్ధారించి, బహిరంగ ప్రకటన చేయొచ్చు కదా?
- గీతానుసారమే హైడ్రా కూల్చివేతలని సెలవిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, తన మిత్రులకూ జంట జలాశయాల పరిధిల్లో ఫాంహౌస్‌లు ఉన్నాయని ప్రకటించారు. ఆ నిర్మాణాల నుంచి వచ్చే మురుగునీరు అందులో కలిస్తే.. ఆ నీటిని నగరవాసులకు తాగునీటిగా వినియోగించడం ఎంత వరకు భావ్యం? అని అభిప్రాయపడ్డారు. మరి పొంగులేటి నిర్మాణాలపై నిజాలను నిగ్గు తేల్చండని హైడ్రాను ఎందుకు ఆదేశించడం లేదు?
- సామాన్యుడికి ఓ న్యాయం? పెద్దోళ్లకు మరో న్యాయమా? అనే సూటి ప్రశ్నలు తెలంగాణ సమాజం నుంచి వస్తున్న నేపథ్యంలో రేవంత్ సర్కారు జంట జలాశయాల పరిధిల్లోని నిర్మాణాలపై సర్వే చేసి, శ్వేతపత్రం విడుదల చేస్తే రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధి ప్రజలకు తెలుస్తుంది కదా?

'500 మీటర్లు' ప్రశ్నపై నోరు మెదపరేం?

కాంగ్రెస్ ప్రభుత్వం (2007లో) అధికారంలో ఉండగానే పురపాలక శాఖ ఇచ్చిన 500 మీటర్ల నిబంధన మెమోను ఈ నెల 25న 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెస్తే.. ఇప్పటిదాకా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నోరు మెదపలేదు. 2012లో పురపాలక శాఖ భవన నిర్మాణ అనుమతుల 168 జీవోనూ 'నమస్తే తెలంగాణ' తెరపైకి తెచ్చింది. దీనిపైనా సీఎం సహా మంత్రులెవరూ కిమ్మనలేదు. మరి 500 మీటర్లలోపు నిర్మాణాలు సక్రమమా? అక్రమమా? ఆ ఇండ్లు బఫర్ జోన్‌లో ఉన్నట్టా? లేనట్టా? ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్టా? లేనట్టా? నిర్మాణాలు సక్రమమైతే సర్వే చేసి నిర్ధారించి, బహిరంగ ప్రకటన చేయొచ్చుగా? అక్రమమైతే హైడ్రా రంగంలోకి దిగదెందుకు?



రాయదుర్గంలో సోమవారం కూల్చివేతలకు ముందు.. తర్వాత

మా తప్పుంటే భూమినే అప్పగిస్తం

సర్వే నంబర్ 1 నుంచి 41వరకు ఉన్న 37.08 ఎకరాల భూమి మా తాతల ఆస్తి. అది పక్కా ప్రైవేట్ భూమి. లిడ్‌క్యాప్ సంస్థతో ఏర్పడిన వివాదంతో ఇప్పటికే ఆ భూమిపై హైకోర్టులో కేసు నడుస్తున్నది. గతంలో స్థల వివాదం విషయంలో మేం కోర్టును ఆశ్రయించాం. లిడ్‌క్యాప్ ఎండీ శ్రీనివాస్ నాయక్, ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ ఈ భూమి కోసం ఎంతో ఒత్తిడి చేస్తున్నారు. మాకు రూ.50 కోట్లు, ఎకరం స్థలం ఇస్తామంటూ ఆఫర్లు ఇచ్చారు. మా వైపు న్యాయం ఉన్నది. కోర్టులో కేసు గెలిస్తే మా భూమి మాకు వస్తుంది. కేసు ఓడితే భూమిని ప్రభుత్వానికి అప్పగిస్తాం. అంతేగానీ డబ్బులకు అమ్ముడుపోమని గతంలోనే చెప్పినం.

– బసిరత్ అలీఖాన్, బాధితుడు

పేదోళ్ల ఇండ్లపైకి బుల్డోజర్

- పోలీసు నీడలో కూల్చివేతలు
- తెల్లారేసరికే వచ్చిన అధికారులు
- నోటీసులు ఇవ్వకుండానే నేలమట్టం!
- రాయదుర్గంలో రోడ్డునపడ్డ బాధిత కుటుంబాలు
- మమ్మల్ని నిర్బంధించి ఇండ్లు కూల్చిండ్రు
- అనుమతులు, స్టే ఉన్నా కూలగొట్టిండ్రు : బాధితుల ఆవేదన
- యూనిటీ మాల్ కోసమే కూలదోశారని ఆరోపణ

కొండాపూర్, ఆగస్టు 26 : రాష్ట్రంలో బుల్డోజర్ పాలన కొనసాగుతున్నది. ఎన్నో ఏండ్లుగా నివాసముంటున్న పేదల ఇండ్లను సైతం బుల్డోజర్లతో కూలగొట్టడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. నోటీసులు ఇవ్వకుండా తెల్లావారి ఏడుగంటలకే అధికారులు భారీగా పోలీసు బలగాలతో మోహరించి కోర్టు స్టే ఉన్న స్థలంలోనూ నివాసాలను కూలగొట్టడంతో ఆ కుటుంబాలు రోడ్డునపడ్డాయి. శేరిలింగంపల్లి మండలంలోని రాయదుర్గంలో సోమవారం జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, లిడ్‌క్యాప్, టీఎస్‌ఐఐసీ అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ మూడు నివాసాలు, ఐదు నిర్మాణాలు కూల్చివేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ఇండ్లల్లో ఉన్న సామగ్రి అంతటినీ బయట పడేసి అధికారులు కూల్చివేతలకు పాల్పడ్డారు. తమను నిర్బంధించి మరీ ఇండ్లను కూల్చివేశారని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 'మా తాత ముత్తాతల నుంచి ఈ ఇండ్లల్లోనే ఉంటున్నం.. ఏటా జీహెచ్‌ఎంసీకి ఆస్తి పన్ను చెల్లిస్తున్నం.. కరెంటు బిల్లులు కడుతున్నం.. ఈ భూమికి సంబంధించి కోర్టు స్టే కూడా ఇచ్చింది. సోమవారం కోర్టులకు సెలవు ఉండటంతో ఇదే అదునుగా పోలీసులు మమ్మల్ని చుట్టుముట్టి బుల్డోజర్లతో తమ ఇండ్లను కూలగొట్టిండ్రు. పిల్లలున్నరు.. ఆరోగ్యం బాగలేనోళ్లున్నరు. ఏమాత్రం సోయి లేకుండా అధికారులు రాక్షసుల్లా వచ్చి తమ ఇండ్ల మీద పడి కూల్చిండ్రు. ఇప్పుడు తాము ఏడుండాలె?' అంటూ బాధితులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

అధికారులు రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నరు

మా ముత్తాతలు హైదరాబాద్ టెన్నరీస్ సంస్థను స్థాపించినప్పటికే 37.08 ఎకరాల భూమి ఉన్నది. కానీ అధికారులు స్థలమంతా లిడ్‌క్యాప్‌దంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నరు. లిడ్‌క్యాప్ సంస్థకు కేవలం 5 ఎకరాల స్థలం మాత్రమే ఉన్నది. మా భూములను అన్యాయంగా, దౌర్జన్యంగా లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇంట్లో పిల్లలు, పెద్ద వయస్సు వారున్నారన్న కనీస జ్ఞానం లేకుండా ఉదయం 7 గంటలకే వచ్చి ఇండ్లు కూల్చివేశారు. ఇప్పుడు మా కుటుంబాలు ఎక్కడికి పోవాలి? ఉదయం నుంచి రోడ్డుపై పడిగాపులు కాస్తున్నం. ప్రజాపాలనలో అధికారులు రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నరు.

– నసిర్ అలీఖాన్, బాధితుడు

ప్రజా పాలనంటే ఇదేనా?

ఈ భూములపై కోర్టులో కేసులు నడుస్తున్నాయి. కూల్చివేతలు చేపట్టవద్దని స్టేటస్ కోలు ఉన్నాయి. అయినా అధికారులు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, ఇంట్లో చిన్న పిల్లలు, పెద్దలు ఉన్నారన్న కనీస సోయి లేకుండా కూల్చివేశారు. హృద్రోగ సమస్యలు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మా కుటుంబ సభ్యులు ఎక్కడికి వెళ్లాలో అర్థంకాని పరిస్థితి తెచ్చారు. రేవంత్‌రెడ్డి చెబుతున్న ప్రజాపాలన అంటే ఇదేనా?

– ముఖ్తర్ అలీఖాన్, బాధితుడు

గంట వ్యవధిలోనే నేలమట్టం

రాయదుర్గం 1 నుంచి 41 వరకు ఉన్న సర్వే నంబర్లలో 37.08 ఎకరాల భూమి ఉన్నది. ఇది హైదరాబాద్ టెన్నరీస్‌కు చెందినదని, దాని పూర్తి హక్కులు తమకు వంశపారపర్యంగా వస్తున్నాయని కొన్ని కుటుంబాలు ఇక్కడ ఇండ్లు కట్టుకొని ఉంటున్నాయి. కాగా ఇవి లిడ్‌క్యాప్ (లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట కార్పొరేషన్)కు చెందిన భూములుగా అధికారులు వాదిస్తున్నారు. ఈ క్రమంలో భూములపై హైకోర్టులో కేసు కొనసాగుతున్నది. ఈ క్రమంలో సోమవారం తెల్లారుజామున ఐదు గంటలకు జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, లిడ్‌క్యాప్, టీఎస్‌ఐఐసీ అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఇండ్లు కూల్చివేస్తామని సమాచారం ఇచ్చి ఉదయం ఏడు గంటల్లోపు వంద మంది పోలీసు బలగాలు, బుల్డోజర్లు అక్కడికి చేరుకున్నాయి. ఈలోగా కొంతమేర సామగ్రిని వారంతా తీసుకొని బయటికి వచ్చారు. ఏడు గంటల ప్రాంతంలో కూల్చివేతలు మొదలుకావడంతో బాధితులు లబోదిబోమని అడ్డుకునే ప్రయత్నంచేశారు. పోలీసులు తమను పక్కకు తీసుకెళ్లి, కదలకుండా చుట్టూ మోహరించినట్టు బాధితులు తెలిపారు. గంట వ్యవధిలోనే మూడు ఇండ్లతోపాటు సమీపంలోని ఐదు నిర్మాణాలను నేలమట్టం చేశారు.

యూనిటీ మాల్ కోసమే?

1942లో తమ పూర్వీకులు హైదరాబాద్ టెన్నరీస్ సంస్థను ఏర్పాటు చేసి అక్కడే నివాసం ఉన్నారని, ప్రస్తుతం అధికారులు కూల్చివేసిన ఇండ్లకు సైతం ఇంటి నంబర్లతోపాటు కరెంటు బిల్లులు, పన్నులను రెగ్యులర్‌గా జీహెచ్‌ఎంసీకి చెల్లిస్తున్నామని బాధితులు తెలిపా రు. హైకోర్టు ఇచ్చిన స్టేటస్‌కోను పరిగణనలోకి తీసుకోకుండా కూల్చివేయడం రాక్షసపాలన కు నిదర్శనమంటూ ఆవేదన వ్యక్తంచేశారు. లిడ్‌క్యాప్ ఆధ్వర్యంలో యూనిటీ మాల్ నిర్మాణం కోసం కేంద్రం నుంచి రూ.500 కోట్లు వచ్చాయని, తమకు భూములు అప్పగించాలంటూ బసిరత్ అలీఖాన్ కుటుంబంపై లిడ్‌క్యాప్ ఎండీ శ్రీనివాస్ నాయక్, ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్ ఒత్తిడి చేసినట్టు, లిడ్‌క్యాప్ జీఎం వేణుమాధవ్ ద్వారా చర్చలకు పిలిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సదరు స్థలం తమ కుటుంబానికి చెందినదని, ఏవైనా సమస్యలుంటే కోర్టు ద్వారా తేల్చుకోవాలని లిడ్‌క్యాప్ యాజమాన్యానికి తెలిపామని చెప్పారు. 'మీ కుటుంబాన్ని రోడ్డుపైకి లాగి ఆ భూమిని మా ఆధీనంలోకి తీసుకుంటం' అంటూ లిడ్‌క్యాప్ యాజమాన్యం బెదిరించినట్టు బాధితులు వాపోతున్నారు.

సలకం చెరువులో కబ్జాలు కూల్చే దమ్ముందా?

ప్రభుత్వానికి బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి సవాల్



హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): హైడ్రా పేరుతో హడావుడి చేస్తున్న ప్రభుత్వానికి సలకం చెరువులో ఉన్న ఒవైసీ భూములను కూల్చే దమ్ముందా? అని బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. సోమవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కబ్జాలను కప్పిపుచ్చుకోవడానికి ఒవైసీ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని మండిపడ్డారు. నిజంగా ప్రజాప్రతినిధివే అయి తే స్వచ్ఛందంగా కట్టడాలను కూల్చేయాలని డిమాండ్ చేశారు. సలకం చెరువులోని ఆక్రమణలు హైడ్రా కమిషనర్‌కు కనిపించకుంటే తానే వచ్చి చూపిస్తానని చెప్పారు. హామీలను నెరవేర్చలేకనే ప్రభుత్వం హైడ్రాను తెర మీదకి తెచ్చిందని విమర్శించారు. దమ్ముంటే పాతబస్తీలో గుర్రం చెరువు, జల్‌పల్లి చెరువులోనూ అక్రమ నిర్మాణాలు ఉన్నాయని, వాటన్నింటినీ కూల్చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్యాక్రాంతం అయిన భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. దేవాదాయ శాఖ భూముల్లోని ఆక్రమణలపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నన్ను కాల్చండి.. కాలేజీని కూల్చొద్దు: ఒవైసీ

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): సకలం చెరువులో ఉన్న ఒవైసీ విద్యాసంస్థలపై సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న పోస్టులపై ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ సోమవారం స్పందించారు. ట్యాంక్‌బండ్ బఫర్ జోన్‌లో ఉన్న నెక్లెస్‌రోడ్‌ని కూడా కూల్చివేస్తారా అని నిలదీశారు. తనపై మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించుకోవచ్చని, ఒవైసీ విద్యాసంస్థను మాత్రం కూల్చవద్దని అన్నారు. పేదలకు ఉచితవిద్యను అందించేందుకు 12 భవనాలను నిర్మించానని, వీటిని ఉద్దేశపూర్వకంగా కొందరు తప్పుగా చూపిస్తున్నారని తెలిపారు. గతంలో తనపై కాల్పులు జరిగాయని, కావాలంటూ మళ్లీ కత్తులతో దాడి చేసుకోవచ్చని, కానీ పేదల విద్యాభివృద్ధికి చేస్తున్న కృషికి అడ్డుపడొద్దని అక్బరుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు.

డబ్బుల డైవర్షన్?

మొదటిపేజీ తరువాయి...

విశ్లేషకులు అనుమానిస్తున్నారు.. అదే 'మహారాష్ట్ర ఎన్నికలు'! త్వరలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. హర్యానా, కశ్మీర్ తర్వాత నవంబర్‌లో మహారాష్ట్ర ఎన్నికలు జరగవచ్చని భావిస్తున్నారు. ఈ దశలో మహారాష్ట్రలో గెలుపు కాంగ్రెస్ అధినాయకత్వానికి అత్యవసరం. అందుకు ఆ పార్టీకి భారీ ఫండింగ్ అవసరం. ప్రస్తుతం రెండు పెద్ద రాష్ట్రాల్లోనే కాంగ్రెస్ అధికారంలో ఉన్నది. ఒకటి కర్ణాటక కాగా.. మరొకటి తెలంగాణ. రెండూ ఆర్థికంగా, రాజకీయంగా బలమైనవి. పాలనాపరంగా కర్ణాటకలో ఇప్పటికే దివాలా పరిస్థితులు కనిపిస్తున్నాయి. వరుసగా వెలుగుచూస్తున్న కుంభకోణాలు, చార్జీల మోత, పెరుగుతున్న ప్రజావ్యతిరేకత, అవినీతిలో ఆరోపణల్లో పీకల్లోతు కూరుకుపోయిన సీఎం సిద్ధరామయ్య! ముఖ్యమంత్రి ఎప్పుడు మారుతారో తెలియని సందిగ్ధ స్థితి! దీంతో కర్ణాటక నుంచి నిధుల సమీకరణ సాధ్యమయ్యేలా కాంగ్రెస్ అధిష్ఠానానికి కనిపించడంలేదని ఆ పార్టీ వర్గాలే చెప్తున్నాయి. ఈ క్రమంలో మహారాష్ట్రలో కాంగ్రెస్ ఎన్నికల ఖర్చును భరించాల్సిన భారమంతా తెలంగాణపైనే పడిందని అవి భావిస్తున్నాయి. ఈ మేరకు పార్టీ ఫండ్‌కు సంబంధించి కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్ర నాయకత్వానికి భారీ టార్గెట్‌ను ఇవ్వడంతోపాటు.. సమకూర్చాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నదని పార్టీవర్గాలే చర్చించుకుంటున్నాయి.

ప్రముఖులపై ఒత్తిడి!

తెలంగాణలోనూ పరిస్థితి అనుకున్నంత ఆశాజనకంగా ఏమీ లేదు. రియల్‌ఎస్టేట్ రంగం పడిపోయింది. దాని అనుబంధ రంగాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నగదు చెలామణి తగ్గిపోయింది. పారిశ్రామిక రంగాల్లో నిస్తేజం అలుముకున్నది. దీంతో ఆర్థిక వనరులను సమకూర్చుకునే అనివార్యమైన పరిస్థితుల్లో రాష్ట్ర నాయకత్వం అక్రమ కట్టడాల కూల్చివేతకు తెరలేపిందని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఈ క్రమంలో తమకు భారీగా సపోర్ట్ చేయాల్సిందిగా ఒకరిద్దరు ప్రముఖులపై నాయకులు ఒత్తిడి తెచ్చారని.. వారు కాదనడంతోనే కూల్చివేతల అంకానికి సిద్ధమయ్యారని నేతల చర్చల్లో వినిపిస్తున్న మాట. ఒకరిద్దరు గట్టోళ్లను కొడితేనే మిగిలిన పని సునాయాసంగా అయిపోతుందని ఈ నిర్ణయానికి వచ్చినట్టు వారు చెప్తున్నారు. ఇందుకోసం డబ్బు, పలుకుబడి ఉన్న వ్యక్తులు, విపక్ష ప్రముఖులు, సెలబ్రిటీలు, పారిశ్రామికవేత్తలను టార్గెట్ చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్వామికార్యం.. స్వకార్యం!

స్వామికార్యంతోపాటు స్వకార్యం కూడా సాధించుకునేందుకు కూల్చివేతలను ఎంచుకున్నట్టు అధికారపార్టీలోని కొందరు నేతలు మాట్లాడుకుంటున్నారు. 'పార్టీలో తనకు ప్రత్యర్థులుగా ఉన్న నాయకులను లక్ష్యం చేసుకోవడానికీ ఈ కూల్చివేతలను ఓ ముఖ్యనేత వాడుకుంటున్నారు. పార్టీలో తానే సుప్రీం అని, తనను కాదని ఎవరూ ఏమీ చేయలేరనే సంకేతాలు ఇవ్వడమే ఆయన ఉద్దేశం. ఆర్థిక వనరుల సమీకరణ తనతోమాత్రమే సాధ్యమని అటు అధిష్ఠానానికి తెలియజెప్పడంతోపాటు.. కూల్చివేతల బూచి చూపి అక్రమ నిర్మాణాలు కలిగిన పార్టీలోని తన ప్రత్యర్థులకు గట్టి హెచ్చరికలు పంపడం ఆ వ్యూహంలో భాగమే' అని కాంగ్రెస్ పరిణామాలను దగ్గరినుంచి గమనించే సీనియర్ రాజకీయ విశ్లేషకుడు ఒకరు చెప్పారు. హైడ్రా వ్యవహారంలో టార్గెట్ అయిన నేతల్లో ఒకరు పొంగులేటి కాగా, మరొకరు వివేక్! ఇద్దరూ ఆర్థికంగా బలవంతులు కావడం, ఢిల్లీ నాయకత్వాన్ని ప్రభావితం చేయగలిగి ఉండటంతో వారిని అక్రమ నిర్మాణాల వివాదంలోకి లాగి ఉంటారన్నది సదరు విశ్లేషకుడి మాట.

అనుకూలమైన అధికారులకు చోటు!

హైడ్రా రాత్రికిరాత్రి వచ్చింది కాదని, కొంతకాలంగా దానికి రంగం సిద్ధంచేశారని స్వతంత్ర జర్నలిస్టు ఒకరు వ్యాఖ్యానించారు. 'రంగారెడ్డి, మెదక్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో తనకు విశ్వసనీయులైన, తన మాట చెల్లుబాటు చేసే అధికారులను ముఖ్యనేత ఒకరు కొంతకాలంగా నియమిస్తూ వచ్చారు. కూల్చివేతల పర్వం మొదలైతే.. అది తన అదుపాజ్ఞల్లో అధికారులు నడుపాలన్నది ఆయన ఉద్దేశం కావచ్చు' అని ఆ పాత్రికేయుడు పేర్కొన్నారు.

అప్పులపై బీద అరుపులు అందుకేనా?

'కేంద్రంలో అధికారం లేనప్పుడు.. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో తమ ప్రభుత్వాల నుంచి కాంగ్రెస్ అధిష్ఠానం ఏం ఆశిస్తుందో అందరికీ తెలుసు. ఈ విషయంపై పూర్తి అవగాహన ఉన్నది కనుకే రాష్ట్ర కాంగ్రెస్ బాధ్యులు తెలంగాణ అప్పుల్లో ఉన్నదని పదే పదే మాట్లాడారు. రాష్ట్రం పరువు పోయినా సరే.. అన్న రీతిలో వాళ్ల వ్యాఖ్యానాలు సాగాయి. నిజానికి వాళ్ల ఉద్దేశం తెలంగాణ అప్పుల్లో ఉన్నదని చాటిచెప్పడం కాదు.. కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణపై పెట్టుకున్న అంచనాలను తగ్గించడం. అంత ఇచ్చుకోలేమని చెప్పకోవడం. కానీ కాంగ్రెస్ అధిష్ఠానం వీటిని పట్టించుకునే పరిస్థితి లేదు. ఆర్థిక వనరుల సమీకరణకు తెలంగాణ తప్ప దానికి మరో దారి లేదు' అని కాంగ్రెస్‌లోని ఓ సీనియర్ నేత వ్యాఖ్యానించడం గమనార్హం.

అడ్డొస్తే బుల్డోజర్లు ఎక్కించండి

- ప్రభుత్వ భూములు చెరపట్టిన వారిని ఉపేక్షించొద్దు
- జెండారంగులతో సంబంధం లేకుండా కూల్చేయండి
- పెద్దలను వదిలి పేదల నిర్మాణాలను కూల్చితే ఊరుకోం
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మొయినాబాద్, ఆగస్టు 26: జెండా రంగులతో సంబంధంలేకుండా ప్రభుత్వ భూములను కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయాలని.. ఎవరైనా అడ్డొస్తే బుల్డోజర్లు వారిపైకి ఎక్కించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే నెల ఒకటి నుంచి 15వరకు నిర్వహించనున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సోమవారం రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ మండలంలోని చాందినీ గార్డెన్‌లో జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా మెదక్, చేవెళ్ల ఎంపీలు రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. పెద్దలను వదిలి పేదల నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను చెరపట్టిన వారు ఎంతటివారైనా ఉపేక్షించొద్దని.. అందుకు బీజేపీ సంపూర్ణ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. హైడ్రాను పనుల్లో రాజకీయ నాయకులు, వీఐపీలు జోక్యం చేసుకోవద్దని, ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్రభుత్వ భవనాలు ఉన్నా కూల్చివేయాలని చెప్పారు. ప్రభుత్వం కూల్చివేతలపై దృష్టి పెట్టి ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. దవాఖానల్లో మంచాల్లేక.. మందుల్లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆరోపించారు.

అధికారులపైనా చర్యలు తీసుకోండి : ఎంపీ కొండా

ఎఫ్‌టీఎల్‌ను కబ్జాలను కూల్చివేయడంతోపాటు, నిర్మాణాలకు అనుమతులిచ్చిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్రమ భవనాలను కొందరు విక్రయించి వెళ్లిపోయారని.. వాటిని కొనుగోలు చేసిన మధ్యతరగతి ప్రజలకు నష్టపరిహారాన్ని ఇప్పించే బాధ్యతను కూడా హైడ్రా తీసుకోవాలని కోరారు. పేదలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.



పులిపై రేవంత్ స్వారీ

రాజకీయాలకతీతంగా 'హైడ్రా' పనిచేయాలి: సీపీఐ నేత నారాయణ

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : హైడ్రా చర్యలతో బడా బాబులు జైలుకు వెళ్లాల్సి వస్తుందో? లేదో? గానీ వారి ఒత్తిడితో రేవంత్‌రెడ్డే జైలుకు వెళ్లే ప్రమాదం ఉన్నదని, రేవంత్‌రెడ్డి పులి మీద స్వారీ చేస్తున్నాడని, మధ్యలో ఆపేస్తే ఆ పులే తినేస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హెచ్చరించారు. హైదరాబాద్‌లోని మగ్దుం భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆక్రమణల కూల్చివేత విషయంలో రాజకీయాలకు అతీతంగా హైడ్రా పనిచేయాలని సూచించారు. నోటరీ ద్వారా కొందరు ప్రభుత్వ భూమి అమ్మకాలు చేపట్టారని, వీటి విషయంలో పేదలకు నష్టం జరగకుండా చూడాలని కోరారు. ఎన్ కన్వెన్షన్‌ను ఎఫ్‌టీఎల్‌లోనే నిర్మించారని, ఈ విషయంలో నాగార్జున నుంచి డబ్బులు వసూలు చేసి చెరువును నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలను కూల్చే విషయంపై రేవంత్‌రెడ్డి అఖిల పక్ష సమావేశం పెట్టాలని సూచించారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ నిర్మాణాలతో పోల్చడం సరికాదని చెప్పారు.

హైడర్..బాద్!

మొదటిపేజీ తరువాయి...

జలమండలి కార్యాలయాల వద్ద కూడా ఆరా తీస్తున్నట్టు తెలిసింది. హైదరాబాద్‌లోని అనేక చోట్ల బడా నిర్మాణ సంస్థలు కూడా చెరువుల సమీపంలో అపార్టుమెంట్లను నిర్మించి, విక్రయించాయి. లక్షలాది సామాన్యులు వాటిల్లో ఫ్లాట్లు కొనుగోలు చేశారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఉన్న నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తుండటంతో ఆయా ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్‌వాసుల్లో అలజడి మొదలైంది. ఈ నేపథ్యంలో కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని పలు అపార్టుమెంట్లలో ఆదివారంరోజే సమావేశాలు నిర్వహించుకుని, జరుగుతున్న పరిణామాలపై చర్చించుకున్నారు. సోమవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించడంతో అక్కడికి వచ్చి తమ అపార్టుమెంటు కుంటలు, చెరువుల పరిధిలోకి వస్తుందా? కంటోన్మెంట్ బోర్డు హైడ్రా పరిధిలోకి వస్తుందా? అని ఆరా తీశారు. ఇది ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నందున వర్తించదని అక్కడివారు సమాధానం ఇచ్చారు. హస్మత్‌పేట చెరువు సమీపంలోని అపార్టుమెంట్ల వాసులు చాలామంది ఉదయం నుంచి ఇదేరీతిన అడుగుతున్నారని అధికారులు చెప్తున్నారు.

శివారు ప్రాంతాల్లోనూ అలజడి

హైడ్రా కూల్చివేతలతో హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లోనూ అలజడి మొదలైంది. ఎప్పుడు ఎవరి భవనం కూలుతుందోనన్న భయం పలువురిని వెన్నాడుతున్నది. పారిశ్రామికవాడలన్నీ ఎక్కువగా హైదరాబాద్ శివారు ప్రాంతాలైన రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోనే ఉన్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన అనేక పారిశ్రామికవాడల్లో చిన్నాచితక చెరువులు, కుంటలు ఉన్నాయి. ముఖ్యంగా చర్లపల్లి, నాచారం, మల్లాపూర్ తదితర ప్రాంతాల్లో పారిశ్రామికవాడల సమీపంలోనే చెరువులు ఉండగా, ఉప్పల్ పారిశ్రామికవాడ మూసీ నది సమీపంలోనే ఉన్నది. వాటి బఫర్‌జోన్లు, ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించిన తరువాతే లేఔట్‌లు చేసి పరిశ్రమలకు కేటాయించారు. ఎంతో కాలంగా ఇక్కడ పరిశ్రమలు కూడా కొనసాగుతున్నాయి. అయితే, హైడ్రా ఎప్పుడు, ఎవరిపై కూల్చివేతల అస్త్రాన్ని ప్రయోగిస్తుందో అంతుబట్టడంలేదని పరిశ్రమ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. గతంలో ప్రభుత్వమే స్థలాలు కేటాయించినప్పటికీ, పరిశ్రమ వర్గాల్లో ఒక విధమైన భయానక వాతావరణం ఉన్నదని, కొత్తగా పరిశ్రమ పెట్టేవారు ఏ చిన్న కుంట ఉన్నా ఆ దరిదాపుల్లోకి వచ్చేందుకు కూడా జంకుతున్నారని చెప్తున్నారు.

రియల్ అగమ్యగోచరం

మరోవైపు రియల్‌ఎస్టేట్ పరిస్థితి కూడా అగమ్యగోచరంగా తయారైంది. రాష్ట్రంలో ప్రభుత్వ మార్పు నేపథ్యంలో మందకొడిగా ఉన్న రియల్ ఎస్టేట్‌రంగం పరిస్థితి హైడ్రా కూల్చివేతలతో నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డ చందంగా మారింది. కొత్తగా లేఔట్లు వేసేవారు, నిర్మాణాలు చేపట్టేవారు కొంతకాలం వేచి చూద్దామనే ధోరణి అవలంబిస్తున్నారు. ఆస్తులకు సంబంధించిన టైటిల్ క్లియర్‌గా ఉన్నప్పటికీ, ప్రాజెక్టు చేపట్టేందుకు ధైర్యం సరిపోవడం లేదని రియల్‌ఎస్టేట్ వర్గాలు చెప్తున్నాయి. అన్నీ సవ్యంగా ఉన్నా ఒకటికి పదిసార్లు చూసుకుని, అధికారుల నుంచి అభయం లభించేవరకు ప్రాజెక్టు చేపట్టలేమని అంటున్నారు.

పట్టా భూముల్లోని ఇండ్లను కూల్చేస్తారా?

విస్మయాన్ని వ్యక్తం చేసిన హైకోర్టు

అధికారుల సమన్వయ లోపంపై గుస్సా



హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): వరంగల్‌లోని దేశాయిపేట్ ఎంహెచ్‌నగర్ వాసులకు గతంలో కలెక్టర్ ఇచ్చిన పట్టా భూముల్లో పేదలు నిర్మించుకున్న ఇండ్లను కూల్చివేసేందుకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నోటీసులు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ 75 మంది హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ నోటీసులపై జస్టిస్ టీ వినోద్‌కుమార్ ఆశ్చర్యాన్ని వ్యక్తంచేశారు. పట్టా భూముల్లో నిర్మించుకున్న ఇండ్లను ఎలా కూల్చేస్తారని ప్రశ్నిస్తూ.. సంబంధిత ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడాన్ని ఆక్షేపించారు. ప్రభుత్వం ఒక్కటే అయినా అధికారులు ఒకేతీరుగా పనిచేయడం లేదని, ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీపీఎల్ పథకం కింద పేదలకు ఇచ్చిన పట్టాలను చట్టప్రకారం రద్దు చేయకుండా ఆ స్థలాలను స్వాధీనం చేసుకోరాదని, అప్పటివరకు ఆ ఇండ్లను ఖాళీ చేయించరాదని జీడబ్ల్యూఎంసీ కమిషనర్, డిప్యూ టీ కమిషనర్‌కు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యాజ్యంలో కలెక్టర్‌ను ప్రతివాదిగా చేర్చాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు. కలెక్టర్‌తోపాటు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ముఖ్యకార్యదర్శి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్, డీసీ, ఇరిగేషన్ ఈఈ తదితరులకు నోటీసులు జారీ చేసి.. 3 వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేశారు.

గుడిసెల కూల్చివేతలు ఆపండి: జస్టిస్

కాగా, చిన్నవడ్డేపల్లి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాలు ఉన్నాయంటూ జూలై 25న జీడబ్ల్యూఎంసీ ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ వరంగల్ దేశాయిపేటలోని 13వ డివిజన్‌కు చెందిన మరో 127మంది హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ విచారణ జరిపారు. పిటిషనర్లతోపాటు ఆ చెరువు శిఖం పరిధిలో గుడిసెలు నిర్మించిన వారందరికీ చట్టప్రకారం నోటీసులు జారీ చేసి, అందరి వాదన వినాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. 2007-2023 మధ్య రెవెన్యూ అధికారులు పేదలకు ఇచ్చిన ఈ పట్టాలపై విచారణ జరపాలని తహసీల్దార్‌కు ఉత్తర్వులు జారీచేశారు. అధికారులు చేపట్టే చర్యలు చట్టానికి లోబడి ఉండాల్సిందేనని తేల్చి చెప్పారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకునే వరకు పిటిషనర్లను ఆ ప్రాంతం నుంచి ఖాళీ చేయించరాదని, వారి గుడిసెలు కూల్చడం లాంటి చర్యలు చేపట్టవద్దని స్పష్టం చేశారు.


అందరూ పేదలే.. అన్నీ పట్టా జాగాలే

పిటిషనర్ల తరపున న్యాయవాది రవీందర్ వాదిస్తూ, కేవలం 30నుంచి 60 గజాల స్థలాల్లో పేదలు ఇండ్లను నిర్మించుకుని ఇంటి పన్నుతోపాటు విద్యుత్తు బిల్లులు చెల్లిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు అధికారులు వచ్చి ఆ ఇండ్లు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నాయని, కూల్చేస్తామని నోటీసులు జారీ చేయడం దారుణమని పేర్కొన్నారు. ఆ ఇండ్లు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్నట్టు నిర్ధారణ చేయలేదని, సర్వేకూడా జరపలేదని చెప్పారు. ఇండ్ల న్నీ పట్టా భూముల్లోనే ఉన్నాయని, ఆ ఇండ్ల జోలికి వెళ్లకుండా ఉండేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

కార్పొరేషన్ వాదన ఇదీ..

జీడబ్ల్యూఎంసీ పరిధిలోని చెరువుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని గతంలో ఇదే హైకోర్టు ఆదేశించిందని అదనపు అడ్వకేట్ జనరల్ గుర్తుచేశారు. దీంతో భద్రకాళి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని 250 గుడిసెలను తొలగించామని, మరికొన్ని ఆక్రమణలను తొలగించాల్సి ఉన్నదని వివరించారు. చిన్న వడ్డేపల్లి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న 329 గుడెసెలను తొలగింపునకు డివిజన్ బెంచ్ గడువు ఇచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ మున్సిపల్ చట్టం-2019లోని 178, 180, 181 సెక్షన్ల కింద పిటిషనర్లకు జీడబ్ల్యూఎంసీ నోటీసులు ఇచ్చిందని, అయినప్పటికీ వారి గుడిసెల కూల్చివేతకు చర్యలు చేపట్టడం చెప్పారు.

యూపీఎస్ వర్సెస్ ఎన్‌పీఎస్



న్యూఢిల్లీ, ఆగస్టు 26: రిటైర్మెంట్ తర్వాత భరోసాతో కూడిన పెన్షన్ ఆదాయం రావాలంటూ ఆందోళన బాట పట్టిన ఓ వర్గం ప్రభుత్వ ఉద్యోగులను శాంతింపజేసేలా ఇటీవల కేంద్ర సర్కారు యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్)ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఎవరైతే కొత్త పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్)లో ఉన్నారో వారికే దీన్ని ఎంచుకొనే సౌలభ్యం కల్పించారు. మరి నిపుణులేమంటున్నారు?

ఇదీ సంగతి..

యూపీఎస్‌లో గ్యారంటీడ్ ఇన్‌కమ్ ఆకట్టుకుంటున్నదని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్, లాడర్7 వెల్త్ పార్ట్‌నర్స్ సీఈవో సురేశ్ సదగోపన్ అంటున్నారు. చివరి 12 నెలలు పొందిన జీతంలోని బేసిక్ పే సగటులో 50 శాతాన్ని నెలనెలా పెన్షన్‌గా తీసుకోవచ్చని చెప్తున్నారు. కాబట్టి ఎన్‌పీఎస్ నుంచి యూపీఎస్‌కు మారడం లాభమేనని అభిప్రాయపడుతున్నారాయన. ఇక రిటైర్మెంట్ వయసు ఇంకా చాలాకాలం ఉన్నట్టైతే ఎన్‌పీఎస్‌లోనే ఉండాలని ఉద్యోగులకు వాల్యూ రిసెర్చ్ సీఈవో ధీరేంద్ర కుమార్ సలహా ఇస్తున్నారు. ఈక్విటీ మార్కెట్ రిటర్న్స్‌ను అందుకోవచ్చని సూచిస్తున్నారు.

పన్ను పోటు

ఎన్‌పీఎస్‌లో పోగైన సొమ్ములో రిటైర్మెంట్ సమయంలో ఒకేసారి పొందే 60 శాతం మొత్తాలకు పన్నుండదు. మిగతా 40 శాతం మొత్తాలు నెలనెలా పెన్షన్ రూపంలో వస్తాయి. అయితే వీటిపై మాత్రం సదరు ఉద్యోగికి వర్తించే ఐటీ స్లాబు ప్రకారం పన్నులు పడుతాయి. ఇక యూపీఎస్‌లో పన్నుల వర్తింపు గురించి కేంద్రం నుంచి ప్రకటన రావాల్సి ఉన్నది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి యూపీఎస్ అమల్లోకి రానున్నది. కనీసం 25 ఏండ్ల సర్వీస్ ఉంటే గ్యారంటీడ్ పెన్షన్ వస్తుంది.

నాస్కాం చైర్‌పర్సన్‌గా సింధు గంగాధరన్



న్యూఢిల్లీ, ఆగస్టు 26: ఐటీ ఇండస్ట్రీ బాడీ నాస్కాం చైర్‌పర్సన్‌గా సింధు గంగాధరన్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె శాప్ ల్యాబ్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గత వారంలో రాజేశ్ నంబియర్ తన పదవికి రాజీనామా చేయడంతో ఈ స్థానాన్ని ఆమె భర్తీచేశారు. గ్లోబల్ ఇన్నోవేషన్ లీడర్‌గా భారత్ ఆవిర్భంచడంలో నాస్కాం కీలక పాత్ర పోషించింది..మన దేశం యొక్క బలమైన ఇంజినీరింగ్ ఆర్అండ్‌డీ సామర్థ్యాలు, వినూత్న సామర్థ్యం, విస్తృతమైన డిజిటల్ నిపుణులతో స్థిరమైన వృద్ధిని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆమె అన్నారు.

పేటీఎం బాస్‌కు సెబీ షోకాజ్ నోటీసు

న్యూఢిల్లీ, ఆగస్టు 26: పేటీఎం బ్రాండ్‌తో ఆర్థిక సేవలు అందిస్తున్న వన్97 కమ్యూనికేషన్స్ ఎండీ, సీఈవో విజయ శేఖర్ శర్మకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మార్చి 2024లో స్టాక్ ఆప్షన్ కింద షేర్ల కేటాయింపునకు సంబంధించి ఈ నోటీసులు జారీ చేసినట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. 2021-22 ఆర్థిక సంవత్సరానికిగాను ఎంప్లాయి స్టాక్ ఆప్షన్ కింద 2.1 కోట్ల షేర్లను శర్మకు కేటాయించినట్లు గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడించింది.

మెడ్‌ప్లస్ నుంచి వార్బర్గ్ ఎగ్జిట్

హైదరాబాద్, ఆగస్టు 26: మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్‌లో తనకున్న మొత్తం వాటాను విక్రయించింది ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం వార్బర్గ్ పింకస్. 11.35 శాతం వాటాను ఓపెన్ మార్కెట్లో విక్రయించడంతో రూ.836 కోట్ల నిధులు సమకూరాయి. పూర్తిగా బ్లాక్ డీల్ ద్వారా జరిగిన ఈ 11.35 శాతానికి సమానమైన 1.35 కోట్ల ఈక్విటీ షేర్లను ఒక్కో షేరుకు రూ.616.48 చొప్పున విక్రయించింది. దీంట్లో సింగపూర్ గవర్నమెంట్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్లు 62.45 లక్షల షేర్లు లేదా 5.2 శాతం వాటాను కొనుగోలు చేశాయి.

వందే భారత్ | మేడ్ ఇన్ తెలంగాణ

- కేసీఆర్ హయాంలో కోచ్ ఫ్యాక్టరీ
- కేంద్రం మొండిచేయి చూపినా ప్రైవేటుగా పరిశ్రమ ఏర్పాటు
- దేశీయ అవసరాలకే కాకుండా ఇతర దేశాలకూ ఎగుమతి
- మరో 1000 మందికి ఉద్యోగాలు

హైదరాబాద్, ఆగస్టు 26(నమస్తే తెలంగాణ): కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటులో కేంద్రం మొండిచేయి చూపినా.. ప్రైవేటు రంగంలో కోచ్ ఫ్యాక్టరీని నెలకొల్పి కేసీఆర్ సర్కారు కేంద్ర ప్రభుత్వానికి సవాల్ విసిరింది. కేంద్రం మాటతప్పినా తాము సొంతంగానే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసుకున్నామనే సందేశాన్ని ఇచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఈ ఫ్యాక్టరీ ఇప్పుడు కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తయారుచేస్తున్న వందేభారత్ రైళ్లకు కూడా అనేక కీలక భాగాలను సరఫరా చేస్తున్నది. ఇది నిజంగానే తెలంగాణ ప్రజలకు గర్వకారణమని పలువురు ప్రశంసిస్తున్నారు. పునర్విభజన చట్టం ప్రకారం కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాల్సి ఉన్నది. రాష్ట్రం ఏర్పాటై పదేండ్లు దాటినా ఇంతవరకు కేంద్రం ఈ హామీని నెరవేర్చలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేకసార్లు కేంద్రానికి విజ్ఞప్తులు చేసి చివరికి ప్రైవేటు రంగంలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటునకు అవసరమైన చర్యలు తీసుకున్నది. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా కొండకల్‌లో ప్రభుత్వం మేధా సర్వో కోచ్ ఫ్యాక్టరీకి 100 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. రూ.805 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన ఈ కోచ్ ఫ్యాక్టరీలో 558 మందికి ప్రత్యక్షంగా, మరో 500 మందికి పరోక్షంగా ఉపాధి, ఉద్యోగాలు లభించాయి. గత ఏడాది జూన్‌లో అప్పటి సీఎం కేసీఆర్ ఈ ఫ్యాక్టరీని ప్రారంభించారు. స్విట్జర్లాండ్‌కు చెందిన స్టాడ్లర్ రైల్ భాగస్వామ్యంతో మేధా సర్వో డ్రైవ్స్ సంస్థ రైల్ బోగీలతోపాటు రోలింగ్ స్టాక్ కోచెస్, లోకోమోటివ్స్, వ్యాగన్స్, ట్రైన్ సెట్, మెట్రో రైళ్లు, మోనోరైళ్లు తదితర వాటిని తయారు చేస్తున్నది. ఇప్పటికే ఇండియన్ రైల్వేస్‌కు అవసరమైన బోగీలతోపాటు ఇతర పరికరాలను మేధా సర్వో సరఫరా చేస్తుండగా, సమీప భవిష్యత్తులో ఆసియా పసిఫిక్ దేశాలకు కూడా రైలు బోగీలు, రైలు పరికరాలను ఎగుమతి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నది. అంతేకాదు, ముంబాయి మోనో రైళ్లను కూడా ఇక్కడే తయారు చేయనున్నారు. తాజాగా, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వందేభారత్ రైళ్లకు కూడా వివిధ ప్రధాన పరికరాలను మేధా సర్వో సరఫరా చేస్తుండటం విశేషం. వందేభారత్ రైళ్లకు అవసరమైన ప్రొపల్షన్, కంట్రోల్‌తోపాటు ఇతర పరికరాల సరఫరాకు సంబంధించి మేధా సర్వో డ్రైవ్స్ లిమిటెడ్ 2021లో రూ.2,211 కోట్ల కాంట్రాక్టును దక్కించుకున్నది. అంతేకాదు, ఫ్రాన్స్ చెందిన ఆల్‌స్టోమ్ సంస్థ భాగస్వామ్యంతో వందేభారత్‌కు అల్యూమినియమ్ బాడీలను కూడా తయారు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. మేధా సర్వో కార్యకలాపాలు రోజురోజుకూ పెరుగుతుండడంతో భవిష్యత్తులో మరో 1000 మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉన్నది.





మేధా విజయ ప్రయాణం గర్వకారణం: కేటీఆర్

వందేభారత్ రైళ్లకు అవసరమైన పరికరాలను మేధా సర్వో సరఫరా చేస్తుండడంపై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. వందేభారత్ రైళ్ల తయారీలో మేధా సర్వో పరిశ్రమ కీలకంగా మారిందని తెలిపారు. మన రాష్ట్రానికి చెందిన మేధా కోచ్ ఫ్యాక్టరీ అద్భుతమైన ఇంజినీరింగ్ ప్రతిభతో విజయవంతంగా ప్రయాణం సాగించటం తనకెంతో గర్వంగా ఉన్నదని వెల్లడించారు. మేధా కోచ్ ఫ్యాక్టరీ నిర్వాహకులు, పరిశ్రమ బృందాన్ని అభినందించారు. కంపెనీ మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

త్వరలో యూఎల్ఐ సేవలు

ప్రారంభించనున్న రిజర్వ్ బ్యాంక్ • మరింత సరళతరం కానున్న రుణ ప్రక్రియ




బెంగళూరు, ఆగస్టు 26: దేశ ఆర్థిక వ్యవస్థలో డిజిటలైజేషన్ విజయం తెచ్చిన ఉత్సాహంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మరో సరికొత్త సేవలకు శ్రీకారం చుట్టబోతున్నది. యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (యూఎల్ఐ)ను అందుబాటులోకి తీసుకురానున్నది. ఇదో సులభతర రుణ సదుపాయ వేదిక. చిన్న, గ్రామీణ రుణగ్రహీతలను ప్రధానంగా దృష్టిలో పెట్టుకొని దీన్ని ఆర్బీఐ తెస్తున్నది. నిజానికి గత ఏడాదే ఈ నయా టెక్నాలజీ ప్లాట్‌ఫామ్‌ను రెండు రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా పరిచయం చేయాలని చూస్తున్నారు. 'మేము ప్రారంభించాలనుకుంటున్న కొత్త వేదికను ఇప్పట్నుంచి యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్‌గా పిలుస్తాం. దీనిద్వారా బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల వంటి రుణదాతలకు విభిన్న డాటా సర్వీస్ ప్రొవైడర్ల నుంచి రుణగ్రహీతల సమ్మతితో వారికి సంబంధించిన అన్ని సాంకేతిక సమాచార వివరాలు అందుతాయి. ఆయా రాష్ట్రాల్లో ఉన్న భూ రికార్డుల వివరాలనూ అప్పులిచ్చేవారు తెలుసుకోవచ్చు' అని సోమవారం ఇక్కడ 'డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్' అంశంపై జరిగిన ఆర్బీఐ@90 గ్లోబల్ కాన్ఫరెన్స్‌కు హాజరైన ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. ఈ క్రమంలోనే భారతీయ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రయాణంలో జన్‌ధన్-ఆధార్-మొబైల్ (జేఏఎం), యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), యూఎల్ఐలను ఓ విప్లవాత్మక ముందడుగుగా దాస్ అభివర్ణించారు.

నిరంతరం పనిచేస్తాం

దేశ ఆర్థిక రంగాన్ని బలోపేతం చేయడానికి విధానాలు, వ్యవస్థల్ని రూపొందించేందుకు.. నూతన వేదికల ఆవిష్కరణకు ఆర్బీఐ నిరంతరం పనిచేస్తూనే ఉంటుందని దాస్ స్పష్టం చేశారు. ఇక భారత్‌తో ఆయా దేశాల సమన్వయం, సర్దుబాట్లతో సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) చెల్లుబాటు విస్తృతం కాగలదన్నారు. అలాగే గడిచిన దశాబ్ద కాలంలో దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఎన్నో సాంకేతిక మార్పులు వచ్చాయని గుర్తుచేశారు. డిజిటలైజేషన్‌తో బ్యాంకింగ్ లావాదేవీలు చాలా సులభమైపోయాయని చెప్పారు. రుణాల మంజూరు ప్రక్రియ కూడా సరళతరమైందన్నారు. అయితే వ్యక్తిగత సమాచార గోప్యతపట్ల ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని గవర్నర్ దాస్ అన్నారు.

యూఎల్ఐ గురించి..



రుణ మదింపు, ముఖ్యంగా చిన్న, గ్రామీణ రుణగ్రహీతలు రుణాలు పొందేటప్పుడు పట్టే సమయాన్ని యూఎల్ఐ బాగా తగ్గిస్తుందని ఈ సందర్భంగా దాస్ తెలియజేశారు. యూఎల్ఐ నిర్మాణం సాధారణ, ప్రామాణిక ఏపీఐలను పోలి ఉంటుందన్నారు. కాబట్టి డాక్యుమెంట్లు కూడా పెద్దగా అవసరం ఉండదని పేర్కొన్నారు. అంతేగాక వ్యవసాయ రుణగ్రహీతలతోపాటు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)ల రుణగ్రహీతలకూ లాభిస్తుందన్న ఆశాభావాన్ని దాస్ వ్యక్తం చేశారు. 'పైలట్ ప్రాజెక్ట్ నుంచి వచ్చిన ఫలితం ఆధారంగా యూఎల్ఐ సేవలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావాలనుకుంటున్నాం. యూపీఐ మాదిరే యూఎల్ఐ కూడా ఆదరణ పొందుతుందన్న నమ్మకం ఉన్నది' అని దాస్ తెలిపారు. ఇదిలావుంటే 2016 ఏప్రిల్‌లో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ద్వారా యూపీఐ సేవలను దేశానికి పరిచయం చేశామన్న దాస్.. భారత్‌లో రిటైల్ డిజిటల్ పేమెంట్స్ వృద్ధిలో ఇది కీలకపాత్ర పోషించిందని చెప్పారు. కాగా, ఆర్బీఐ మార్గదర్శకంలో బ్యాంకులు ప్రమోట్ చేసినదే ఈ ఎన్‌పీసీఐ అన్న విషయం తెలిసిందే. బ్యాంకులు, నాన్-బ్యాంక్ థర్డ్ పార్టీ యాప్‌లు, క్యూఆర్ కోడ్‌ల వినియోగం.. ఇలా అన్నీ కలిసి యూపీఐకి ప్రజాదరణను తీసుకొచ్చాయి. భారత్‌లోనేగాక, ఆయా దేశాల్లోనూ యూపీఐ ప్రఖ్యాతిగాంచినట్టు దాస్ అన్నారు.

నేడు టీ హబ్‌లో ఇన్వెస్టర్ కనెక్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): టీ హబ్‌లో ఇన్వెస్టర్ కనెక్ట్ సదస్సును మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్ సంస్థ చైర్మన్ జేఏ చౌదరి తెలిపారు. ఔత్సాహిక స్టార్టప్ వ్యవస్థాపకులను ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో ఉండి సరికొత్త ఆవిష్కరణలు చేసేందుకు వారిని ప్రోత్సహించడానికి పెట్టుబడుల పరంగా సహకారాన్ని అందించడానికి ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశంలోని ప్రముఖ వెంచర్ క్యాపిటలిస్టులైన కలారీ క్యాపిటల్, ఆర్కా మీడియా వర్క్స్, ఎంథిల్ వెంచర్స్, ఎండ్రియా పార్టనర్స్, సక్సీడ్ ఇన్నోవేషన్ ఫండ్, పేవ్‌స్టోన్, ఎన్‌టీటీ డాటా సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకాబోతున్నారు.

భెల్‌కు 11 వేల కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ, ఆగస్టు 26: ప్రభుత్వరంగ విద్యుత్ పరికరాల తయారీ సంస్థ భెల్ మరో భారీ ప్రాజెక్టును దక్కించుకున్నది. అదానీ పవర్ నిర్మించతలపెట్టిన మూడు థర్మల్ పవర్ ప్రాజెక్టులకు సంబంధించి రూ.11 వేల కోట్ల విలువైన ఆర్డర్ లభించినట్లు కంపెనీ పేర్కొంది. ఇందుకు సంధించి అదానీ పవర్, తన సబ్సిడరీ సంస్థయైన మహాన్ ఎనర్జీ లిమిటెడ్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ ఆర్డర్‌లో భాగంగా బాయిలర్లు, టర్బైన్లు, జనరేటర్లను సరఫరా చేయాల్సి ఉంటుందని బీఎస్ఈకి సమాచారం అందించింది. ఒక్కో ప్రాజెక్టు 2X800 మెగావాట్ల సామర్థ్యంతో అడ్వాన్స్‌డ్ సూపర్‌క్రిటికల్ టెక్నాలజీతో నిర్మిస్తున్నది. రాజస్థాన్‌లో కవై ఫేజ్-2, కవై-ఫేజ్-3, మహాన్ ఫేజ్-3ని మధ్యప్రదేశ్‌లో ఏర్పాటు చేయబోతున్నది.

నియోజకవర్గానికో మహిళా పారిశ్రామికవాడ


- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 26(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 67 వేల మంది స్వయం సహాయక బృందాల మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమానికి తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ మహిళల కోసం ప్రతి శాసన సభ నియోజకవర్గంలో ఒకటి చొప్పున 119 ప్రత్యేక పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. స్వయం సహాయక బృందాల ఉత్పత్తులు దేశవ్యాప్తంగా సరఫరా కావడంతో కొన్ని విదేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయన్నారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో మూడు వారాల శిక్షణ ముగించుకున్న ఈజిప్టు 'వాణిజ్య దౌత్యవేత్తల' బృందంతో సోమవారం మంత్రి శ్రీధర్ బాబు సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈజిప్టుతో వాణిజ్య సంబంధాలు మెరుగుపర్చుకునేందుకు తమ ప్రభుత్వం ఆసక్తితో ఉందన్నారు. ఔషధ ఎగుమతుల్లో రాష్ట్రం ప్రపంచంలోని అనేక దేశాలతో పోటీపడే స్థాయికి చేరుకున్నదని, రాష్ట్రం మొత్తం ఎగుమతులు రూ.1,16,182 కోట్లు కాగా ఇందులో రూ.36,893 కోట్లు ఫార్మా ఎగుమతులేనని ఆయన తెలిపారు.



కుకుడ వాగు నుంచి చెలిమెల నుంచి నీరు తోడుకుంటున్న నాగుల్వాయి గ్రామస్తులు

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం నాగుల్వాయి గ్రామస్థులు తాగు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. బీఆర్ఎస్ సర్కారులో మిషన్ భగీరథ నీరివ్వగా, ప్రస్తుతం పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టకపోవడంతో గుక్కెడు నీటికీ తిప్పలు పడుతున్నారు. సైకిళ్లపై, కాలినడకన మూడు కిలోమీటర్ల దూరంలోని కుకుడ వాగుకు వెళ్లి చెలిమెల నీరు తెచ్చుకొంటున్నారు. పైపులైన్‌కు మరమ్మతులు చేసి భగీరథ నీటిని అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - బెజ్జూర్



ట్రాక్టర్ టైరు పట్టుకుని వాగు దాటుతున్న ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని ఎలిశెట్టిపల్లి ఆదివాసీలు

టైర్ ఉంటేనే వాగు దాటేది

ఏటూరునాగారం, ఆగస్టు 26 : ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని ఎలిశెట్టిపల్లి వాసులు జంపన్నవాగు దాటాలంటే ట్రాక్టర్ టైర్ (ట్యూబ్‌లో గాలి నింపి)ను పట్టాల్సిందే. గత నెల మొదటి వారంలో వర్షాలు కురవడంతో ఎలిశెట్టిపల్లి వాసుల రాకపోకల కోసం బోటు ఏర్పాటుచేశారు. ఆ తర్వాత వాగు తగ్గడంతో అధికారులు అక్కడ నుంచి బోటును తరలించారు. అప్పడప్పుడు కురుస్తున్న వర్షాలకు నీరు చేరడంతో జంపన్నవాగు దాటి రావడానికి ఎలిశెట్టిపల్లి వాసులు ఇబ్బంది పడుతున్నారు. కొంతమంది తాడు కట్టిన ట్రాక్టర్ టైరును పట్టుకుంటే మరికొందరు దానిని లాగుతూ ఒడ్డుకు తీసుకొస్తున్నారు. అలాగే మరికొంత మంది ఈత కొట్టుకుంటూ వాగు దాటుతున్నారు. ఇలాంటి సాహసాలు ప్రమాదకరమని తెలిసినప్పటికీ అవసరాల రీత్యా తప్పడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు వెంటనే బోటు ఏర్పాటు చేసి రవాణా సౌకర్యం కల్పించాలని ఎలిశెట్టిపల్లి వాసులు కోరుతున్నారు.

చిన్నారిపై కుక్కల దాడి

పరిస్థితి విషమం.. సిద్దిపేట జిల్లాలో ఘటన



మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఆగస్టు 26 : కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలైన ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని బేగంపేట గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అన్నెమైన లాస్య, దేవేందర్ దంపతుల మూడేండ్ల కూతురు అనుశిత సోమవారం మధ్యాహ్నం ఇంటి బయట ఆడుకుంటున్నది. ఒక్కసారిగా కుక్కలు చిన్నారిపై దాడి చేసి తలపై తీవ్రంగా గాయపర్చాయి. వెంటనే చిన్నారిని భూంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు సిద్దిపేటకు రెఫర్ చేశారు. సిద్దిపేట ఏరియా దవాఖాన వైద్యులు మెరుగైన వైద్య చికిత్సల కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు పంపారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

కవ్వాల్‌లో మళ్లీ పెద్దపులి సంచారం

అప్రమత్తమైన ఫారెస్ట్ ఆఫీసర్లు



హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : కవ్వాల్ టైగర్ జోన్‌లో నాలుగు రోజుల నుంచి పెద్దపులి సంచరిస్తోందని ఫారెస్ట్ ఆఫీసర్లు వెల్లడించారు. జన్నారం రేంజ్ పరిధి గోండుగూడ బీట్‌తో పాటు అల్లీనగర్, దొంగపెల్లి అటవీ ప్రాంతాల్లో ఈ నెల 22న యానిమల్ ట్రాకర్స్‌తో అడుగులను గుర్తించి, మగపులిగా నిర్ధారించారు. 10 రోజుల క్రితం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని, గుండాల అడవుల్లో తిరిగిన పెద్దపులి ప్రస్తుతం కవ్వాల్ టైగర్ జోన్‌లో సంతరిస్తున్న పులి ఒక్కటేనని భావిస్తున్నారు. 2019లో కవ్వాల్ అడవుల్లో సంచరించిన పులి..అప్పటి నుంచి మళ్లీ రాలేదు. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి కాగజ్‌నగర్ కారిడార్ ద్వారా ఆసిఫాబాద్ అడవులవైపు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇన్నేండ్ల తర్వాత కవ్వాల్ టైగర్ జోన్‌లోని పులి రావడంతో ఆఫీసర్లు అప్రమత్తమయ్యారు.



సప్తగిరి 70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
భ్రమరాంబ 70 ఎ/సి - కూకట్‌పల్లి | ఇంద్రనాగేంద్ర 70 - కర్మన్‌ఘాట్ | వెంకటరమణ/పద్మావతి 70 - కాచిగూడ
మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట | ఆరాధన ఎ/సి - తార్నాక | లక్ష్మీ ఎ/సి - శంషాబాద్ | సాయిపూజ - సూరారం
MYTHRI MOVIE DISTRIBUTORS LLP

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

ఇ-టెండరు కోరుతూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా) PUB/0849

దిగువ పనుల కొరకు భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సికింద్రాబాద్ వారు సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండరు కోరుతున్నారు.

1. **NIT No: C/E.29/TRD/ SC/ 27/ 2024-2025, పని పేరు:** టెండరు నం. C/E.29/TRD/ SC/ 27/ 2024-2025, తేదీ: 23-08-2024. SC డివిజన్‌లోని BPQ-KI సెక్షన్‌లో అండర్‌గ్రౌండ్ కేబుల్ క్రాసింగ్స్‌లోకి 33 KV ఓవర్‌హెడ్ పవర్ లైన్ క్రాసింగ్స్ కన్వెర్షన్-(IRPSM ID: 11.05.36.23.3.54.007) **ప్రకటిత వ్యయం: రూ. 1,45,10,527, పూర్తి చేయు కాలం:** 5 నెలలు, **ముగింపు తేదీ:** 23-09-2024న, 15.00 గం.

1) బిడ్ డాక్యుమెంటు మరియు ఇతర వివరాల కొరకు వెబ్‌సైట్ **http://ireps.gov.in**కు లాగిన్ కాగలరు.
2) టెండరుదార్లు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను మరియు మ్యాన్యువల్ ఆఫర్లు పరిశీలించబడవు.
3) టెండరు ఫారం ధర &బయానాను ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే చెల్లించాల్సిందిగా కాగోరు టెండరుదారులందరు కోరబడుచున్నారు.
4) GSTIN ఐడెంటిఫికేషన్ నెం.లు పొందవల్సిందిగా మరియు తమ ఆఫర్లతో పాటు దాఖలు చేయవల్సిందిగా కాగోరు టెండరుదారులందరు కోరబడుచున్నారు.
5) టెండరు దాఖలుచేయు కాలవ్యవధి యొక్క ప్రారంభ తేదీ వరకు టెండరుదారు ఏదేని సవరణల (ఆన్‌లైన్‌పై మాత్రమే జారీ చెయ్యబడును) కొరకు గమనించగలరు.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ / TRD/సికింద్రాబాద్

ఓపెన్ ఇ-టెండరు ప్రకటన నం.లు C/E.29/Elec/M/SC/13/SQ/OT/ 2024-2025 తేదీ: 24.08.2024 PUB/0850

దిగువ ఇవ్వబడిన పని కొరకు **16-09-2024న 15.00 గంటల** వరకు భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకందారు ఇ-టెండరు కోరుతున్నారు.

1. **ఇ-టెండరు నం.** etender No. C/E.29/ Elec/M/SC/13/SQ/OT/2024-25 etender No. E-M-SC-13-OT-2024-25. **పని పేరు:** సికింద్రాబాద్ డివిజన్-ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్- i) ఫిట్టింగ్స్ రీవైజ్డ్ స్కేల్ ఏర్పాటుతో సహా స్టాఫ్ క్వార్టర్స్ రీవైరింగ్, ii) DKJ, BDCR, SNF & BPA సెక్షన్స్ యొక్క స్టాఫ్ క్వార్టర్స్‌లో వేరందా ఎక్స్‌టెండెడ్ పోర్షన్‌లో లైటింగ్ అరేంజిమెంట్స్ ఏర్పాటు, iii) MDR- స్టాండర్డ్ టైప్ II క్వార్టర్స్‌తో పాత RB-I టైప్ క్వార్టర్స్ రీప్లేస్‌మెంట్. iv) MABD- క్వార్టర్స్ (టైప్ IV) నిర్మాణం-2 యూనిట్లు. v) KRA-వాటర్ సప్లై అరేంజిమెంట్స్‌కు మెరుగుదలలు. vi) KZJ: DEN/ సెంట్రల్ /SCs అధికార పరిధిలో KZJ కాలనీ & ఇతర మేజర్ కాలనీలలో వాటర్ సప్లై అరేంజిమెంట్స్‌కు మెరుగుదలలు- విద్యుత్ ఏర్పాట్లు. **టెండరు విలువ:** రూ. 2,07,04,089.78, **బయానా:** రూ. 2,53,500.00 **CTF:** రూ. 0.00, **పూర్తి చేయు కాలం:** 6 నెలలు.

సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, (మెయింటెనెన్స్), సికింద్రాబాద్

ఓపెన్ ఇ-టెండర్ నెం. NED/E.29/ TrD/Tender/10& 11/2024-25, తేదీ: 22.08.2024 PUB/0851

దిగువ తెలిపిన పనుల కొరకు దిగువ సంతకందారు సీల్డ్ టెండర్లు కోరుతున్నారు.

1. టెండర్ నెం.N/E.29/TrD/Tender/ 10/ 2024-25, పనుల వివరణ: నాందేడ్ డివిజన్‌లో DIQ స్టేషన్ వద్ద JNPT సైడింగ్ కొరకు సర్క్యూట్ బ్రేకర్ (CB)తో కొత్త SSP ఏర్పాటుచేయుట. పూర్తి చేయు కాలం: 6 నెలలు, సుమారు విలువ: రూ. 1,26,11,481/-, బిడ్ సెక్యూరిటీ: రూ. 2,13,100/-
2. టెండర్ నెం.**N/E.29/TrD/Tender/ 11/ 2024-25,** పనుల వివరణ: నాందేడ్ డివిజన్‌లో నాందేడ్ స్టేషన్ వద్ద కామన్ లూప్-1 (PF 04) కొరకు ఓవర్‌షూట్ లైన్ మరియు 30m పిట్ లైన్-2 క్యాట్‌వాక్ పొడగింపు 720 mకు స్టేబుల్ లైన్-03 పొడగింపు ప్రతిపాదనకు సంబంధించి OHEకు మార్పులు చేర్పులు. పూర్తి చేయు కాలం: 6 నెలలు, సుమారు విలువ: రూ. 1,21,12,290/-, బిడ్ సెక్యూరిటీ: రూ.2,10,600/-

ముగింపు తేదీ: 19.09.2024న 16.00 గం.లకు

సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/ TR/ నాందేడ్

A1096

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి